
'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 170

శనివారం 9-9-2023



రన్నరప్ బోపన్న-ఎబ్డెన్ జోడీ

యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ ఫైనల్లో ఓడిన ఇండో-ఆసీస్ ద్వయం -15లో



రిలయన్స్ సూపర్ కంప్యూటర్స్

ఎన్‌విడియాతో కలిసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ల అభివృద్ధి -15లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కేంద్రం వైఖరిని సమర్థిస్తున్నాం

రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో కేంద్రం వైఖరిని పూర్తిగా సమర్థిస్తున్నామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు.

- వివరాలు 7లో



ఉప పోరులో మిశ్రమ ఫలితాలు

ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ 3, ప్రతిపక్ష ఇండియా కూటమి 4 సీట్లు గెలుచుకున్నాయి.

- వివరాలు 7లో



వృద్ధికి ఆర్‌బీఐ పెద్దపీట

త్వరలో ఐ-సీఆర్ఆర్ విధానం నుంచి పూర్తిగా బయటకు రానున్న ఆర్‌బీఐ. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా రూ. లక్ష కోట్లు!

- వివరాలు 15లో



మహిళా సాధికారతకు మార్గదర్శనం

తమ ఫౌండేషన్ తరఫున మహిళలకు సాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకోసం కృషి చేస్తున్న షఫాలికాపై కథనం

- వివరాలు 13లో

న్యూస్‌రీల్


సర్టిఫికెట్ల తనిఖీకి ప్రత్యేక సెంటర్!



గురుకుల పోస్టులకు 1:2 నిష్పత్తిలో ఎంపికయ్యే అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు హైదరాబాద్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేయాలని బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు పరిశీలన కేంద్రం ఏర్పాటు, నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు.

- వివరాలు 12లో ▶

రోగాలను బట్టి పీజీ మెడికల్ సీట్లు!



ఆయా ప్రాంతాల్లో వ్యాధులు.. రోగుల సంఖ్య.. అందుతున్న వైద్య సేవలను బట్టి మెడికల్ కాలేజీలకు పీజీ సీట్లు కేటాయించాలని జాతీయ మెడికల్ కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు కొత్త పీజీ మెడికల్ ముసాయిదాను విడుదల చేసింది.

- వివరాలు 12లో ▶

'సార్' ✕ ఉన్నతాధికారులు



పౌరసరఫరాల సంస్థలో ఆధిపత్య పోరు నడుస్తోంది. సంస్థలో కీలక హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులకు, సంస్థ బాధ్యతలు చూసేందుకు నియమితులైన 'సార్'కు మధ్య విభేదాలు పెరుగుతున్నాయి.

- వివరాలు 2లో ▶

'లొకేషన్'తో ప్రైవసీ చిక్కులు!



స్మార్ట్‌ఫోన్లలో ఉండే లొకేషన్ ఫీచర్ ఎంత సౌకర్యవంతమో అంతే స్థాయిలో ఇబ్బందికరం కూడా అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది మన ప్రైవసీని దెబ్బతీస్తుందని.. మనం ఎక్కడకు వెళ్తున్నాం, ఎంత సేపు ఉన్నా మనే ప్రతి అంశం ఈ లొకేషన్‌తో తెలిసిపోతుందని స్పష్టం చేస్తున్నారు.

- వివరాలు 7లో ▶

ఇలాంటుకేత్



శుక్రవారం ఢిల్లీలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, ప్రధాని మోదీ మాటామంతి



బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వనీ చౌబే స్వాగతం



బాబు ముఠా పరార్

- విదేశాలకు ఉడాయించిన ముదుపుల పాత్రధారులు
- సీఐడీ నోటీసులతో విచారణ నుంచి తప్పించుకునేందుకే..
- చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు పలాయనం
- షాపూర్జీ–పల్లోంజి ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని దుబాయ్‌కి జంప్
- పత్తాలేని షెల్ కంపెనీల ప్రతినిధి యోగేశ్ గుప్తా
- తాను అరెస్టైతే సానుభూతి పొందే వ్యూహంతోపాటు అల్లర్లకు బాబు పథకం



సాక్షి, అమరావతి: తన అవినీతి బండారం బట్టబయలు కావడంతో మాజీ సీఎం చంద్రబాబు బెంబేలెత్తుతున్నారు. షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని కాజేసిన వైనం ఆధారాలతో సహా వెలుగులోకి రావడంతో ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులు రాత్రికి రాత్రే విదేశాలకు పరారయ్యారు. బాబు తరఫున అన్నీ తామై వ్యవహరించిన తన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెని ప్రతినిధి మిగతా 8వ పేజీలో ▶

'రక్షణ' బంధం బలీయం

జీ20 సదస్సుకు భారత్ విచ్చేసిన బైడెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు

పలు రంగాల్లో సహకారంపై సంయుక్త ప్రకటన విడుదల

ఎంక్యూ-9బీ రకం 31 డ్రోన్ల విక్రయానికి బైడెన్ పచ్చజెండా

భారత్‌లో జీఈ ఎఫ్414 జెట్ ఇంజన్ల సంయుక్త తయారీకి ఓకే

జీ20 కూటమి ఏ విధంగా గొప్ప ఫలితాలను రాబట్టగలదన్న దానిని జీ20 సారథిగా భారత్ నిరూపించి చూపింది. ఈ సదస్సు తాలూకు ఫలితాలు మున్ముందు మరిన్ని ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశిస్తాయి.

- అమెరికా అధ్యక్షుడు బైడెన్

స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత ఇండో-పసిఫిక్ కోసం క్వాడ్ కూటమి అత్యావశ్యకం. వచ్చే ఏడాది భారత్‌లో జరిగే క్వాడ్ (అమెరికా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియా) కూటమి సదస్సుకు బైడెన్ రావాలి.

- ప్రధాని మోదీ

6లో

శిఖరాగ్ర భేటీకి శ్రీకారం

నేటి జీ20 కూటమి సదస్సుకు మొదలైన అధినేతల రాక.. ఢిల్లీ డిక్లరేషన్‌పైనే అందరి దృష్టి

ఏకాభిప్రాయం సాధిస్తాం

ఢిల్లీ డిక్లరేషన్‌పై భారత్ ధీమా

- వివరాలు 6,7 పేజీల్లో

టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల

5,089 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

- ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష
- రూ.1,000కి పెరిగిన ఫీజు
- తక్కువ పోస్టుల భర్తీపై నిరుద్యోగుల నిరసన



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. వాస్తవానికి ఈ నెల 5వ తేదీనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రూపొందించినప్పటికీ గోప్యంగా ఉంచిన విద్యాశాఖ, గురువారం అర్ధరాత్రి వెల్లడించింది. శాఖలో 22 వేల వరకూ ఖాళీలున్నప్పటికీ, కేవలం 5,089 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్టు వెల్లడించింది. 1,523 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఖాళీలను కూడా భర్తీ చేస్తామని గతంలో ప్రకటించినా నోటిఫికేషన్‌లో వాటి ఖాళీలను ప్రస్తావించలేదు. స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, భాషా పండితుల పోస్టులను భర్తీ చేస్తున్నట్టు తెలిపింది. తొలిసారిగా ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్)లో పరీక్షను నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు మిగతా 3వ పేజీలో ▶



సభ్యదేశాలదే తుది నిర్ణయం

ప్రపంచంలో సిసలైన దేశం అంటూ ఏదైనా ఉందంటే అది భారతదేశమేనని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇచ్చే ప్రక్రియలో తన పాత్ర ఏమీ లేదని, సభ్య దేశాలదే తుదినిర్ణయమని ఆయన స్పష్టంచేశారు.

- వివరాలు 6లో

కేసీఆర్ స్ట్రాంగ్ పొలిటీషియన్

గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలు



- నా నాలుగేళ్ల పదవీ కాలానికి ముందు అలాంటి సీఎంను చూడలేదు
- ఆయన్ను చూసిన తర్వాత ఎన్నో విషయాలు నేర్చుకున్నా..
- పాత వివాదాల్లోకి వెళ్లాలనుకోవడం లేదు..కొంత సత్సంబంధాలు అవసరం
- ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య దూరం నేను కొలిచి చూడను
- ఒకవేళ నేను ప్రభుత్వంతో పోరాటం చేసినా అది ప్రజల కోసమే
- ప్రధాని వస్తే ముఖ్యమంత్రి ఎందుకు వెళ్లరు?
- పుదుచ్చేరిలో 20 మంది ఐఏఎస్‌లతో పనిచేయిస్తున్నా.. ఇక్కడ ఐఏఎస్‌లు రారు
- గవర్నర్‌గా ఐదో ఏడాదిలో అడుగిడుతున్న సందర్భంగా కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ

- వివరాలు 8లో



షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు

లోక్‌సభతోపాటు జరుగుతాయనే భ్రమల్లో ఉండొద్దు: కిషన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌తో బీజేపీకి ఎట్టిపరిస్థితుల్లో పొత్తు ఉండదు.. కేసీఆర్, బీఆర్‌ఎస్‌లను ఓడించాలనే కసి శ్రేణుల్లో కనిపిస్తోంది
- సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన సభకు కేంద్రమంత్రి అమిత్ షా
- ఈ నెల 26 నుంచి 3 ప్రాంతాల నుంచి బీజేపీ బస్సుయాత్రలు.. వచ్చే నెల 14న హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ ఉంటుందని వెల్లడి

- వివరాలు 2లో



ఉస్మానియా వద్ద రవీందర్ భార్య నిరసన

హోంగార్డు రవీందర్ మృతి

- కాలిన గాయాలతో డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ఉన్నతాధికారుల వేధింపులతోనే రవీందర్ ఆత్మహత్య అంటూ భార్య సంధ్య ఆందోళన
- ఉస్మానియా ఆస్పత్రి వద్ద నిరసనకు దిగిన బంధువులు, హోంగార్డులు
- పలు రాజకీయ పార్టీల నేతల సంఘీభావం
- సాయంత్రం వరకు ఉద్రిక్తత.. ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమణ

- వివరాలు 5లో

క్లుప్తంగా...

నేడు బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులకు సంస్థాగత అంశాలపై శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ సీనియర్ నాయకుడు కొప్పుల రాజు తదితరులు హాజరవుతారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ప్రత్యర్థిని ఓడించేందుకు బరిలో ఉంటా

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



జన్నారం: వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో ఉంటానని, ప్రధాన ప్రత్యర్థి ఓటమే తన లక్ష్యమని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రేండ్లగూడలో రామాలయ నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. అనంతరం జన్నారంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆరునెలలుగా నియోజకవర్గ అభివృద్ధి పనులు ఆపివేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కృషి చేశానని చెప్పారు. తనతో ఏళ్లుగా ఉంటూ లబ్ధిపొందిన నాయకులు పదినిమిషాల్లోనే దూరం కావడం బాధగా ఉందని, అలాంటివారిని ప్రజలు నమ్మవద్దని కంటతడి పెట్టారు. తన హయాంలో ఖానాపూర్ రోడ్డు నిర్మాణానికి ఎంతో శ్రమించానని, కానీ, నిధుల మంజూరులో జాప్యం చేశారని, కానీ, ఇప్పుడు వాటిని ఎలా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిని బట్టి గత కొన్నినెలలుగా తనపై కుట్ర జరిగినట్లు అర్థమవుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ టికెట్ రాకపోయినా, స్వతంత్రంగానైనా ప్రజల మద్దతుతో ప్రత్యర్థిని ఓడిస్తానని చెప్పారు.

తప్పులు సవరించాకే ఓటర్ల తుదిజాబితా

సీఈవోకు బీజేపీ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పాటోలతో కూడిన ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న తప్పులు, లోపాలను సవరించిన తర్వాతే తుదిజాబితా ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ ప్రతినిధిబృందం విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని డీఈవోలు, ఈఆర్వోలు, బీఎల్వోలు, సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని పేర్కొంది. శుక్రవారం సీఈవోకు బీజేపీ నేతలు బంగారు శ్రుతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేతినేని సరళ, ఆంథోనిరెడ్డి, అజయ్‌కుమార్, పవన్‌కుమార్‌లతో కూడిన ప్రతినిధిబృందం వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రంలో రా ష్ట్రంలోని 43 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాల్లో చోటుచేసుకున్న తప్పులకు సంబంధించిన వివిధ అంశాలను ప్రస్తావించారు.

ఐదోరోజు బీజేపీ ఆశావహుల దరఖాస్తులు 621

సాక్షి, హైదరాబాద్: బీజేపీ టికెట్ ఆశావహుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం అత్యధికంగా 621 మంది వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా రు. ఇప్పటిదాకా 1,620 దరఖాస్తులు అందినట్టు పార్టీవర్గాల సమాచారం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి బీజేపీ దరఖాస్తులను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ టికెట్ కోసం మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి, వేములవాడ టికెట్ కోసం మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు కుమారుడు డాక్టర్ వికాస్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణకు రెండు రోజులే మిగిలి ఉన్నాయి. శని, ఆదివారాల్లో ముఖ్యనేతలు దరఖాస్తులు ఇవ్వనుండటంతో పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున ఆశావహుల తాకిడి పెరగవచ్చని భావిస్తున్నారు.

బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం రస్-అల్- ఖైమా నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలు తనిఖీల్లో తన బ్యాగేజీలో అక్రమంగా తీసుకొచ్చిన 368 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ. 20.35 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సార్'X ఉన్నతాధికారులు

- పౌరసరఫరాల సంస్థలో పెరుగుతున్న విభేదాలు
- మిల్లర్లు, అధికారులపై 'సార్' అజమాయిషీ... ఉన్నతాధికారుల గుర్రు
- ఉద్యోగుల నియామకం, అధికారుల బదిలీలకు బ్రేకులపై 'సార్' అసహనం
- తాను ప్రతిపాదించిన పనులేవీ జరగడం లేదని వాపోతున్న వైనం
- బేరసారాలు జరుగుతున్నాయంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల సంస్థలో ఆధిపత్య పోరు నడుస్తోంది. సంస్థలో కీలక హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులకు, సంస్థ బాధ్యతలు చూసేందుకు నియమితులైన 'సార్'కు మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. తాను ప్రతిపాదించిన పనులేవీ సంస్థలో జరగడం లేదని, ఎక్కడికక్కడ ఆటంకాలు సృష్టిస్తున్నారని 'సార్' అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోమంటే ఎలా అని అధికారులు ప్రశ్నిస్తున్నారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం మిల్లింగ్, సీఎంఆర్ అప్పగింత మొదలు మిల్లులు, ఎంఎల్‌ఎస్ పాయింట్లపై విజిలెన్స్ దాడులు, రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో అవకత వకల వరకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం మొద లు అధికారుల బదిలీల వరకు పలు అంశాలపై విభేదాలు సంస్థ సిబ్బందిలో హాట్‌టాపిక్‌గా మారాయి.

మిల్లుల్లో తనిఖీలు .. విజిలెన్స్ దాడులు

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి పెరిగిన నేపథ్యంలో రైస్‌మిల్లుల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయి, సీఎంఆర్ నిర్దేశిత గడువులోగా పూర్తి కావడం లేదు. దీంతో కొన్ని నెలల క్రితం మిల్లర్ల అక్రమాలను నిగ్గు తేల్చే పేరుతో ప్రభుత్వ ప్రతినిధిగా 'సార్' రంగంలోకి దిగారు. పలు జిల్లాల్లో స్థానిక విజిలెన్స్, జిల్లా అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. అయితే ఏ మిల్లులో ఎంత లోటు ఉంది, ఏ మేరకు అక్రమాలకు పాల్పడ్డాయనే అంశాలను మీడియాకు వెల్లడించేందుకు తాను చేసిన ప్రయత్నాలను ఉన్నత స్థాయిలో అధికారులు అడ్డుకున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే ఎండీకి గానీ, ప్రభుత్వ పెద్దలకు గానీ సమాచారం ఇవ్వకుండా 'రహస్య ఎజెండా'తో 'సార్' తనిఖీలు చేశారని సంస్థ అధికారులు కౌంటర్ ఇస్తున్నారు. తనిఖీల పేరుతో దందాలు సాగుతున్నాయనే అనుమానాలే దీనికి కారణమని కొందరు చెబుతున్నారు. ఇటీవల పలు జిల్లాల్లో రేషన్ బియ్యం పంపిణీ జరిగే ఎంఎల్‌ఎస్ పాయింట్లకు విజిలెన్స్ సిబ్బందిని పంపిస్తూ దాడుల పేరుతో భయపెడుతున్నారని, తనను ప్రసన్నం చేసుకున్న వారిని వదిలేసి, లేదంటే బెదిరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

సీఆర్‌ఓ భవనానికి బ్రేక్

సికింద్రాబాద్‌లోని చీఫ్ రేషనింగ్ అధికారి (సీఆర్‌ఓ) భవనాన్ని రెండు అంతస్తుల్లో నిర్మించాలని బాధ్యతలు చేపట్టిన వెంటనే 'సార్' భావించారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా మిల్లర్ల 'సహకారం'తో రూ.2 కోట్లతో నిర్మించాలని ఆయన ప్రయత్నించారు. ఈ మేరకు సంస్థలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డీఈఈని ప్రతిపాదనలు అడిగితే, ఆయన కేవలం రూ.70 లక్షల అంచనాతో ప్రతిపాదనలు ఇచ్చారు. తర్వాత సదరు డీఈఈ డిప్యుటేషన్ రద్దు చేసుకొని వెళ్లిపోయారు. ఆయన స్థానంలో కరీంనగర్‌లో పనిచేసిన ఓ రిటైర్డ్ ఇంజనీర్‌ను డీఈఈగా తెచ్చేందుకు 'సార్' చేసిన ప్రయత్నం విఫలమైంది. దీన్ని కూడా ప్రభుత్వ పెద్దల ద్వారా ఉన్నతాధికారులు అడ్డుకున్నారనే వాదన విన్పిస్తుండగా, మిల్లర్ల 'సహకారం'తో భవన నిర్మాణం చేపట్టడాన్ని అధికారులు తప్పుబడుతున్నారు.

11 మంది సిబ్బంది ఆరుకు కుదింపు

కీలక పదవిలో చేరిన తర్వాత 'సార్' తన పేషీలో 11 మంది సిబ్బందిని నియమించుకున్నారు. అయితే సంస్థ ఎండీ.. వారి సంఖ్యను ఏకంగా ఆరుకు కుదిస్తూ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశం అయ్యింది. అయితే ఈ మేరకు ఆదేశాలు వచ్చినా సిబ్బందిని తగ్గించే నిర్ణయం అమలుకాకపోవడంపై సంస్థలో చర్చ జరుగుతోంది.

ఔట్‌సోర్సింగ్ నియామకాలకు నో

రాష్ట్రంలో ఏ కార్పొరేషన్‌లో లేనివిధంగా పౌరసరఫరాల సంస్థలో 800 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించి 'సార్' చేసిన సిఫారసులను అధికారులు ఆమోదించడం లేదని సమాచారం. ప్రధాన కార్యాలయంలో ఉండే లీగల్ అడ్వయిజర్ తరహాలో జిల్లాకో లీగల్ అడ్వయిజర్‌ను పెట్టాలని ప్రతిపాదించినప్పటికీ ఉన్నతాధికారి అంగీకరించలేదని తెలుస్తోంది. మూడు జిల్లాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ముగ్గురికి అవకాశం ఇవ్వగా, మరి కొందరి కోసం చేస్తున్న ప్రయత్నాలకు కూడా అడ్డు పడుతున్నట్లు సమాచారం. జిల్లాల్లో పనిచేస్తున్న డీఎంలు, ఇతర ఉద్యోగుల బదిలీల విషయంలో కూడా తన ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదని 'సార్' అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

వసూళ్ల ఆరోపణలు

ఇదే సమయంలో 'సార్'పై పలు ఆరోపణలు సంస్థలో విన్పిస్తుండటం గమనార్హం. త్వరలో డిప్యుటేషన్ పూర్తయ్యే డీజీఎం-అడ్మిన్, డీజీఎం - ఫైనాన్స్ పోస్టుల నియామకం కోసం బేరసారాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు పీడీఎస్ బియ్యాన్ని సీఎంఆర్ కింద పంపించి ఉద్యోగం కోల్పోయిన వ్యక్తిని మళ్లీ అదే పోస్టులో నియమించేందుకు ప్రయత్నాలు జరిగాయని, ఈ విషయంలో నలుగురు రైస్ మిల్లర్లు బేరం కుదిర్చారనే ఆరోపణలు కూడా విన్పిస్తున్నాయి.

కేసీఆర్ ఇచ్చే కమీషన్లకు బీజేపీ కక్కుర్తి

- కేసీఆర్‌పై ఒక్క కేసయినా పెట్టారా?
- బీజేపీ నేత వినయ్‌రెడ్డి చేరిక కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ రేవంత్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఇచ్చే కమీషన్లకు బీజేపీ కక్కుర్తి పడుతోందని, అందుకే కేసీఆర్ అవినీతి, దోపిడీలను బీజేపీ నేతలు బలపరుస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన బీజేపీ నేత పి.వినయ్‌రెడ్డి శుక్రవారం తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం రేవంత్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నా బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 'బండి సంజయ్, కిషన్‌రెడ్డి, అరవింద్‌లను అడుగుతున్నా. దేశవ్యాప్తంగా ఐదువేలకు పైగా ఈడీ కేసులు పెట్టా రు. లక్షకు పైగా ఐటీ కేసులు నమోదు చేశారు. వేలాది కేసులను సీబీఐ విచారిస్తోంది. కానీ, కేసీఆర్‌పై ఎందుకు కేసులు పెట్టడం లేదు. మోదీ నుంచి అమిత్‌షా వరకు, బండి సంజయ్ నుంచి జవదేకర్ వరకు ప్రతి ఒక్కరూ కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని అంటున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?' అని నిలదీశారు.

కేసీఆర్ రూ.లక్ష కోట్లు దోచుకున్నారు

కేసీఆర్ లక్ష కోట్లు దోచుకున్నారని, ఇప్పుడు ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గానికి రూ.50 కోట్లు చొప్పున రూ.500 కోట్లు ఖర్చు పెట్టాలని చూస్తున్నారని రేవంత్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు జమిలీ ఎన్నికల పేరుతో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రయత్నిస్తున్నాయని, బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి వచ్చినా ఈసారి కాంగ్రెస్ గెలుపును ఆపలేరు అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనిల్‌తో పాటు ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

15- 20 గంటల కరెంట్ నిరూపిస్తే రాజీనామా

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): రాష్ట్రమంతటా విద్యుత్ కోతలు ఉన్నాయని, ఎక్కడైనా 15–20 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. విద్యుత్ కోతలపై వివరాలు తెలుసుకునేందుకు తాము భువనగిరి పరిధిలోని ఓ సబ్‌స్టేషన్‌లో లాగ్ బుక్‌ను తీసుకుంటే, ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో ఉన్న అన్ని సబ్‌స్టేషన్లలోని లాగ్ బుక్‌లను తీసేసుకుందని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ డబ్బులను నమ్ముకున్నారని, తాము మాత్రం ప్రజలను నమ్ముకున్నామని చెప్పారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలలో రహదారులు మాత్రమే అభివృద్ధి చెందాయని, ప్రజలు మాత్రం అభివృద్ధి చెందలేదని కోమటిరెడ్డి విమర్శించారు. బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని బతకలేని తెలంగాణగా మార్చారన్నారు. ఎన్నికల కోసం దళితబంధు, బీసీ బంధులను ప్రకటిస్తూ సొంత పార్టీకి చెందిన వారి కుటుంబసభ్యులకే లబ్ధి చేకూరుస్తున్నారని, ఈ బంధులతో కేసీఆర్ దుకాణం బంద్ అవుతుందని చెప్పారు. హోంగార్డు రవీందర్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో అసంతృప్తి లేదు

కాంగ్రెస్‌లో ఎలాంటి అసంతృప్తి లేదని కోమటిరెడ్డి అన్నారు. పదవులు తనకు కొత్తకాదని వ్యాఖ్యానించారు. 17న కొంగరకలాన్‌లో జరిగే కాంగ్రెస్ సభలో కర్ణాటక తరహాలో ఐదు గ్యారంటీ పథకాలను సోనియాగాంధీ ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే అవకాశం కల్పించండి

గవర్నర్ డాక్టర్ తమిళిసైకి బీజేపీ నేత డీకే అరుణ వినతి



గవర్నర్ తమిళిసైకి వినతిపత్రం ఇస్తున్న అరుణ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం తనకు కల్పించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. హైకోర్టు తీర్పు, ఈసీ ఇచ్చిన ఆదేశాల మేరకు తనతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించేలా చూడాలన్నారు. శుక్రవారం ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావుతో కలిసి అరుణ వినతిపత్రం సమర్పించారు. ఈసీ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన రాజపత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. గద్వాల అసెంబ్లీ స్థానానికి సంబంధించిన పరిణామాల గురించి అడిగి తెలుసుకున్న గవర్నర్, అరుణతో ప్రమాణస్వీకారం చేయించేలా అసెంబ్లీ కార్యదర్శి, స్పీకర్‌తో మాట్లాడతానని చెప్పినట్టు బీజేపీ వర్గాల సమాచారం. అనంతరం అరుణ మీడియాతో మాట్లాడుతూ తన ప్రమాణానికి ఏర్పాట్లు చేయాలని రెండుసార్లు అసెంబ్లీ సెక్రటరీ, స్పీకర్‌ను కలిసేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరన్నారు. దీనిపై వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో గవర్నర్‌ను కలిసినట్లు తెలిపారు. ఈ అంశంలో ఉద్దేశపూర్వకంగానే స్పీకర్ వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోందన్నారు.

కేసీఆర్ ఫొటోలతో ప్రొద్దుటూరు నుంచి సైకిల్ యాత్ర

సాక్షి, హైదరాబాద్: ఏపీలోని పొద్దుటూరుకు చెందిన దివ్యాంగుడైన చిత్రకారుడు తుపాకుల రామాంజనేయరెడ్డి తెలంగాణ సీఎం కేసీఆర్‌పై తనదైన శైలిలో అభిమానం చూపించారు. తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపిస్తున్న కేసీఆర్‌పై ఇష్టంతో ఆయన ఫొటోలను ఇరవై రోజుల పాటు కాన్వాస్ మీద ఆక్రిలిక్ పాటు గండికోట మట్టితో మోనో కలర్‌లో స్వయంగా చిత్రించారు. ప్రత్యేకంగా ఫ్రేమ్‌లు కట్టించి ప్రొద్దుటూరు నుంచి ఏడు రోజులపాటు సైకిల్‌పై ప్రయాణం చేసి శుక్రవారం మిత్రులతో కలిసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రగతి భవన్‌కి విచ్చేసిన రామాంజనేయ రెడ్డి బృందానికి మంత్రి కేటీ రామారావు స్వాగతం పలికారు. కేసీఆర్‌పై వేసిన పెయింటింగులను స్వీకరించి, కళాకారుడి అభిమానాన్ని, కృషిని అభినందించారు.

బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయి

- రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ
- వట్టె జానయ్య మీద కేసులు పెట్టడంపై మండిపాటు



అభివాదం చేస్తున్న నాయకులు ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ, రేణుక యాదవ్ తదితరులు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. సూర్యాపేట వేదికగా ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై మంత్రి జగదీశ్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుంటే సీఎం కేసీఆర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వట్టె జానయ్యపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పలు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో జానయ్య సతీమణి రేణుక యాదవ్‌తో కలసి హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..బీసీ వర్గానికి చెందిన వట్టె జానయ్య సూర్యాపేటలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రకటించిన మరుసటి రోజు నుంచి వారం రోజుల వ్యవధిలో ఆ వ్యక్తిపై 90 కేసులు పెట్టడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వట్టె జానయ్యపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయకుంటే సూర్యాపేటలో రెండు లక్షల మందితో బహిరంగ సభను నిర్వహించి బీఆర్‌ఎస్‌కు వణుకుపుట్టిస్తామని మందకృష్ణ హెచ్చరించారు. ప్రతి సందర్భంలో తమను కాళ్లకు మొక్కేలా జగదీశ్‌రెడ్డి ప్రవర్తించారంటూ రేణుక యాదవ్ ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం అంతరించిపోయిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు ఆరోపించారు. జానయ్య సోదరుడు కృష్ణయాదవ్, పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధిక జలాలను వాడకుండా అడ్డుకోండి

ఏపీపై కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత నీటి సంవత్సరం 2023–24లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తన కోటాకి మించి 67.351 టీఎంసీల కృష్ణా జలాలను అధికంగా వాడుకుందని కృష్ణానది యాజమాన్య బోర్డుకి తెలంగాణ ఫిర్యాదు చేసింది. తెలంగాణ 22.21 టీఎంసీలను వాడుకోగా, రాష్ట్రం పరిధిలో 11.799 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయని పేర్కొంది. ఇకపై ఏపీ అధిక జలాలను వాడుకోకుండా నిలువరించాలని కోరింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గురువారం కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. ప్రస్తుత ఏడాది తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న నేపథ్యంలో ఏపీ సమర్పించి న ఇండెంట్లను పరిశీలించవద్దని కోరింది. గతేడాది నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకున్న 18.701టీఎంసీలను ఈ ఏడాది వాడుకోవడానికి అవకాశం కల్పించాలని సూచించింది.

11న త్రిసభ్య కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఉభయ రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కృష్ణా బోర్డు ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ ఈ నెల 11న జలసౌధలో సమావేశం కానుంది. వాస్తవానికి గత నెల 21న త్రిసభ్య కమిటీ సమావేశం జరగగా, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గైర్హాజరయ్యారు.

కేసీఆర్ అవకాశం ఇస్తారనే నమ్మకముంది: పల్లా

- జనగామ సీటుపై వారంలో ప్రకటన



మొబైల్ నుంచి మైక్ ద్వారా పల్లాతో మాట్లాడిస్తున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి

రఘునాథపల్లి (జనగామ): జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే దానిపై వారంలో స్పష్టత వస్తుందని, సీఎం కేసీఆర్ తనకు అవకాశం ఇస్తారనే నమ్మకం ఉందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శాసన సభ్యుడిగా అవకాశం దక్కితే జనగామ నియోజకవర్గాన్ని గజ్వేల్, సిద్దిపేటస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. పల్లాకు మద్దతుగా జనగామ జెడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రఘునాథపల్లి మండలం నిడిగొండ ఫంక్షన్ హాల్‌లో నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పల్లా హాజరు కావాల్సి ఉంది. అయితే హైదరాబాద్ నుంచి బయల్దేరారు... త్వరలోనే చేరుకుంటారని నాయకులు పలుమార్లు ప్రకటించారు. తాను సమావేశంలో పాల్గొనేందుకు బయల్దేరానని, అయితే సీఎం కేసీఆర్ ఫోన్ చేసి అత్యవసర పని ఉందని చెప్పడంతో రాలేకపోతున్నట్లు పల్లా స్థానిక నేతలకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. కాగా, పల్లా మాటల్ని మొబైల్ ఫోన్ ద్వారా స్థానిక నేతలు మైక్‌లో విన్పించారు. సమావేశం ఏర్పాటుపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మందలించడంతోనే పల్లా వెనుదిరిగి వెళ్లిపోయారని వాట్సాప్ గ్రూపులలో ప్రచారమైంది. ఓ వైపు ఇప్పటికే పల్లాకు అవకాశమివ్వొద్దంటూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బహిరంగంగా నిరసన వ్యక్తం చేస్తుండగా..మరోవైపు ఇంకోవర్గం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని, నాగపురి కిరణ్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వాలని మరోవర్గం కోరుతుండటంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు

- లోక్‌సభతోపాటు జరుగుతాయనే భ్రమల్లో ఉండొద్దు: కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌తో బీజేపీకి ఎట్టిపరిస్థితుల్లో పొత్తు ఉండదు
- కేసీఆర్, బీఆర్‌ఎస్‌లను ఓడించాలనే కసి బీజేపీ శ్రేణుల్లో కనిపిస్తోంది
- 17న హైదరాబాద్ విమోచన సభకు కేంద్రమంత్రి అమిత్ షా
- ఈ నెల 26 నుంచి 3 ప్రాంతాల నుంచి బీజేపీ బస్సుయాత్రలు
- వచ్చే నెల 14న హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ ఉంటుందని వెల్లడి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఇంద్రసేనా రెడ్డి, మురళీధర్‌రావు, జవదేకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలతోపాటే రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఉంటాయనే భ్రమల్లో ఎవరూ ఉండొద్దని.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగానే జరుగుతాయని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను ఓడించాలనే కసి, పట్టుదల బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో స్పష్టంగా కనిపిస్తోందని.. బీఆర్‌ఎస్‌తో ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీకి ఎలాంటి పొత్తు ఉండబోదని చెప్పారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీజేపీ పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య స్నేహం లేదని, ఉండబోదని.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనని క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

పార్టీలో మార్పు కనిపిస్తోంది..

గతంలో తాను ఉమ్మడి ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పటికి, ఇప్పుడున్న పార్టీకి ఎంతో మార్పు కనిపిస్తోందని రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. బీఆర్‌ఎస్‌పై పోరాడి కచ్చితంగా గెలుపొందాలనే పట్టుదల బీజేపీ శ్రేణుల్లో కనిపిస్తోందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కావని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని.. ఈ విషయాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

వివిధ అంశాలపై ఆందోళనలు, నిరసనలు

పదాధికారుల భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు.. సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తారు. నిరుద్యోగుల సమస్యలపై ఈ నెల 13న ఉదయం 11 గంటల నుంచి 14న ఉదయం వరకు 24 గంటల పాటు ఇందిరా పార్క్ దగ్గర నిరసన దీక్ష చేపడతారు. 15వ తేదీన తెలంగాణ సాయుధ పోరాట వీరులను స్మరిస్తూ అన్ని మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తారు. అదే రోజున కిషన్‌రెడ్డి నాయకత్వంలో సికింద్రాబాద్ క్లాక్ టవర్ నుండి పరకాల అమరధామం వరకు బైక్ ర్యాలీ చేపట్టి.. అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈనెల 17న ఉదయం హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్‌బూత్ కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఆ రోజున పరేడ్ గ్రౌండ్స్‌లో అమిత్ షా ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం, బహిరంగ సభ నిర్వహిస్తారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు చేపడతారు. ఈ భేటీలో పార్టీ నేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, డీకే అరుణ, మురళీధర్‌రావు, ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, ఏపీ జితేందర్‌రెడ్డి, ఎం.రవీంద్రనాయక్, బూర నర్సయ్యగౌడ్, జి.విజయరామారావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

మూడు రథయాత్రలు.. మోదీ సభ..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్రంలో మూడు వైపుల నుంచి మూడు జోన్లుగా రథయాత్ర (బస్సుయాత్ర)లను ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో నిర్ణయించారు. కొమురంభీం పేరిట బాసర నుంచి హైదరాబాద్ వరకు (ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో) ఒక యాత్ర.. కృష్ణా యాత్ర పేరిట సోమశిల నుంచి హైదరాబాద్ వరకు (ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు) మరో యాత్ర.. గోదావరి పేరిట భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు (ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలు) మరోయాత్రను ప్రారంభించనున్నారు. ఈ మూడు యాత్రలు కూడా చివరిలో రంగారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటాయి. మొత్తం 19 రోజుల పాటు నాలుగు వేల కిలోమీటర్ల పొడవున ఈ రథయాత్రలు సాగనున్నాయి. రాష్ట్ర ముఖ్య నేతలైన కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ లేదా బండి సంజయ్‌ల ఆధ్వర్యంలో ఇవి సాగే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 14న హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభతో ఈ యాత్రలను ముగించాలని పదాధికారుల భేటీలో నిర్ణయించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా

- వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఎమ్మెల్యే రఘునందన్ సవాల్



కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కేయూ క్యాంపస్: కాకతీయ వర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించారని, పైగా తాము కొట్టలేదని వరంగల్ పోలీస్ కమిషనర్ సమర్థించుకోవటంపై బీజేపీ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. ఈ వ్యవహారంపై లైడిటెక్టర్ పరీక్షలు, హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణకు సిద్ధమేనా? అని సీపీకి సవాల్ విసిరారు. ఈ నెల 5న క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ ఆఫీస్ వద్ద విద్యార్థి నాయకులు ఆందోళన చేయగా పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ సమయంలో తమను పోలీసులు కొట్టారని విద్యార్థులు జడ్జి ఎదుట తెలిపారు. కాగా, ఆ విద్యార్థి నాయకులను శుక్రవారం రఘునందన్‌రావు కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో పరామర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదై ఉన్న వీసీపై విచారణ జరపాల్సింది పోయి, ఆయనతో కలసి సీపీ ప్రెస్‌మీట్ నిర్వహించటమేమిటని ప్రశ్నించారు. వీసీ, పీహెచ్‌డీ అవకతవకల వ్యవహారాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పోలీసుల, ప్రభుత్వ వైఖరికి నిరసనగా 12న వరంగల్ జిల్లా బంద్ చేపట్టినట్లు తెలిపారు. కాగా, పోలీసులు తమని అరెస్ట్‌చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించారంటూ విద్యార్థులు గవర్నర్ తమిళిసైని కలిసి ఫిర్యాదు చేశారు.

టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

దశల వారీగా పరీక్ష ఉంటుందని తెలిపారు.

గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లు..

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం నల్లగొండ, సంగారెడ్డిలో పరీక్ష కేంద్రాలుంటాయని ప్రభుత్వం పేర్కొంది. అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ళు, దివ్యాంగులకు పది సంవత్సరాల వయోపరిమితి సడలింపు ఇస్తారు. అయితే ఈసారి టీఆర్టీ ఫీజును రూ.200 నుంచి రూ.1,000కి పెంచారు. పరీక్ష ఆన్‌లైన్‌లో పెడుతున్న కారణంగా ఫీజు పెంచినట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 20వ తేది మధ్య ఆన్‌లైన్ లోనే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఉత్తీర్ణతకు ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు 60 మార్కులు తెచ్చుకోవాలి. టెట్ మార్కుల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టీఆర్టీలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రతి పోస్టుకు ముగ్గుర్ని ఎంపిక చేస్తారు. వారి మార్కులు ఇతర మెరిట్స్ ఆధారంగా అందులో ఒకరిని ఎంపిక చేస్తారు. కాగా పూర్తి సమాచారం ఈ నెల 20వ తేదీ నుంచి www. schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

రెండు నెలల వ్యవధేనా?

పాఠశాల విద్యాశాఖలో 22 వేల పోస్టులున్నాయని గత ఏడాది విద్యాశాఖ తెలిపింది. ఇందులో 13,086 పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ప్రస్తుతం టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నారు. దీనివల్ల కొన్ని ఖాళీలు ఏర్పడతాయి. వీటిని కూడా కలిపి ఎక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తారని నిరుద్యోగులు భావించారు. కానీ 5,089 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ జారీ చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మరోవైపు కేవలం 2 నెలల వ్యవధిలోనే పరీక్ష నిర్వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు కూడా ఆర్నెల్ల సమయం ఇస్తున్న సర్కార్, టీఆర్టీని ఇంత త్వరగా పెట్టడం ఏమిటని నిరుద్యోగులు అంటున్నారు.

జిల్లాల వారీగా ఖాళీల స్థితి

	స్కూల్ అసిస్టెంట్			భాషా పండితులు			వ్యాయామ టీచర్లు			సెకండరీ గ్రేడ్ టీచర్లు			మొత్తం
జిల్లా	ప్రభుత్వం	ఎల్బీ	మొత్తం	ప్రభుత్వం	ఎల్బీ	మొత్తం	ప్రభుత్వం	ఎల్బీ	మొత్తం	ప్రభుత్వం	ఎల్బీ	మొత్తం	
ఆదిలాబాద్	8	46	54	6	7	13	2	0	2	36	170	206	275
భద్రాద్రి కొత్తగూడెం	4	72	76	0	7	7	1	0	1	9	92	101	185
హనుమకొండ	11	10	21	3	2	5	3	4	7	5	16	21	54
హైదరాబాద్	116	0	116	57	0	57	22	0	22	163	0	163	358
జగిత్యాల	9	41	50	3	34	37	3	5	8	16	37	53	148
జనగాం	0	23	23	0	17	17	0	7	7	0	29	29	76
జయశంకర్ భూపాలపల్లి	0	12	12	0	17	17	0	7	7	1	37	38	74
జోగులాంబ గద్వాల	4	30	34	3	24	27	1	7	8	14	63	77	146
కామారెడ్డి	7	90	97	1	11	12	0	5	5	12	74	86	200
కరీంనగర్	9	13	22	6	12	18	3	4	7	33	19	52	99
ఖమ్మం	3	85	89	7	6	13	0	10	10	9	74	83	195
కొమురంభీం ఆసిఫాబాద్	7	42	49	1	23	24	1	1	2	24	190	214	289
మహబూబాబాద్	0	35	35	2	17	19	0	2	2	4	65	69	125
మహబూబ్ నగర్	4	19	23	5	14	19	4	3	7	18	29	47	96
మంచిర్యాల	1	35	36	2	14	16	1	2	3	13	45	58	113
మెదక్	8	62	70	1	27	28	0	1	1	14	34	48	147
మేడ్చల్ మల్కాజిగిరి	1	24	25	3	4	7	0	1	1	1	44	45	78
ములుగు	1	15	16	0	15	15	1	0	1	0	33	33	65
నాగర్ కర్నూలు	4	57	61	6	9	15	2	0	2	4	32	36	114
నల్లగొండ	12	74	86	4	21	25	1	5	6	15	87	102	219
నారాయణ్ పేట్	8	63	71	8	12	20	1	0	1	13	49	62	154
నిర్మల్	1	15	16	0	4	4	1	3	4	24	67	91	115
నిజామాబాద్	21	75	96	8	13	21	2	7	9	77	106	183	309
పెద్దపల్లి	3	27	30	0	5	5	1	0	1	0	7	7	43
రాజన్న సిరిసిల్ల	1	22	23	0	12	12	0	4	4	2	62	64	103
రంగారెడ్డి	1	47	48	0	25	25	0	6	6	10	107	117	196
సంగారెడ్డి	7	73	80	4	20	24	1	4	5	18	156	174	283
సిద్దిపేట	10	50	60	1	23	24	1	7	8	10	39	49	141
సూర్యాపేట	1	79	80	2	21	23	0	4	4	23	55	78	185
వికారాబాద్	5	97	102	0	12	12	0	0	0	15	62	77	191
వనపర్తి	2	41	43	1	8	9	1	4	5	3	16	19	76
వరంగల్	16	40	56	3	18	21	3	3	6	15	40	55	138
యాదాద్రి భువనగిరి	0	39	39	1	19	20	0	2	0	7	31	38	99
మొత్తం	285	1,454	1,739	138	473	611	58	108	164	608	1,967	2,575	5,089

దుఃఖాలలో ఉద్వేగం పొందనివాడు,
సుఖాలకోసం తహతహ పడనివాడు,
రాగ, భయ, క్రోధాలను విడిచినవాడు స్థితప్రజ్ఞుడు.
– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, 9 సెప్టెంబర్ 2023

సంపన్న దేశాల కర్తవ్యం


నేటి నుంచి ప్రారంభం కాబోయే రెండు రోజుల జీ–20 శిఖరాగ్ర సదస్సుకు ఢిల్లీ సర్వసన్నద్ధమైంది. ఈ చరిత్రాత్మక సమావేశాలకు వివిధ దేశాధినేతలతోపాటు తరలివచ్చే వారి మంత్రులు, ఉన్నతాధికార గణం, వేలాదిమంది సిబ్బందితో దేశ రాజధాని నగరం సందడిగా మారింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తదితరులు ఢిల్లీ చేరుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు జీ–20లో సభ్యదేశాలుగా ఉన్నాయి. భారత్‌కు అధ్యక్ష హోదా వంతులవారీగా వచ్చిందే కావొచ్చుగానీ, వచ్చిన సమయం అత్యంత కీలకమైనది. కరోనా మహమ్మారి పర్యవసానంగా ప్రపంచం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అంతో ఇంతో కోలుకుంటుండగా ఉక్రెయిన్‌లో రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం మరింత కుంగదీసింది. పైకి రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పోరుగా కనబడుతున్నా అక్కడ వాస్తవంగా తలపడుతున్నది అమెరికా, రష్యాలే. ఇటు అమెరికా–చైనాల మధ్య తీవ్ర వైరుధ్యాలున్నాయి. చైనాకూ మనకూ మధ్య ఉన్న సమస్యలు సరేసరి. సరిహద్దుల్లో ఏదో సాకుతో గిల్లికజ్జాలకు దిగటం, కొత్త మ్యాప్‌లు ముద్రిస్తూ కవ్వించాలని చూడటం చైనాకు రివాజైంది. ఈ సమస్యలేవీ జీ–20లో ప్రస్తావనకు రాకున్నా, ఎజెండాలో ఈ అంశాలే లేకున్నా, వాటి నీలినీడలు శిఖరాగ్ర సదస్సుపై పడకతప్పదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ సమావేశాలకు హాజరు కాబోరని ఆ దేశం ప్రకటించింది. ఉక్రెయిన్ విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్ నేపథ్యమే ఇందుకు కారణం. ఇక అమెరికాతోపాటు మనపైనున్న కంటగింపు పర్యవసానంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముఖం చాటేశారు. ఆయన బదులు పెద్దగా అధికారాలు లేని ప్రధాని లీ కియాంగ్‌ను ఆ దేశం పంపుతోంది.

ప్రపంచ ఆర్థిక, ద్రవ్య సంబంధ అంశాలతోపాటు మారిన కాలానికి అనుగుణమైన నియంత్రణ వ్యవస్థలను అమల్లోకి తీసుకురావటం, వాతావరణ సమస్యలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలపై విధించే పన్నులు, బహువిధ అభివృద్ధి బ్యాంకులను వర్తమాన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దటం వంటి అంశాలు జీ–20లో ప్రధానంగా చర్చకు రాబోతున్నాయి. వీటన్నిటిపైనా ఎంతవరకూ ఏకాభిప్రాయం కుదురుతుందో, శిఖరాగ్ర సమావేశాల అనంతరం సంయుక్త ప్రకటన వెలువడేందుకు ఏమాత్రం అవకాశం ఉంటుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. 'ఒకే భూమి – ఒకే కుటుంబం – ఒకే భవిష్యత్తు' మకుటంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సు విజయ వంతమైతే ఆ కీర్తిప్రతిష్ఠలు మనకే దక్కుతాయి. అయితే దేశాలు చీలికలు పేలికలుగా విడిపోయిన వర్తమాన యుగంలో అదెంతవరకూ సాధ్యమో చెప్పలేం. మారిన అంతర్జాతీయ పరిస్థితులు ఐక్యరాజ్యసమితి మొదలుకొని డబ్ల్యూహెచ్‌ఓ, డబ్ల్యూటీవో వరకూ అనేకానేక వేదికలపై ప్రతిబింబిస్తున్నప్పుడు జీ–20 వాటికి భిన్నంగా ఉండాలనుకోవటం అత్యాశే కావొచ్చు. కానీ సామరస్యత కోసం ప్రయత్నించటం కొనసాగాలి.

రష్యా, చైనా ఒక పక్క– అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి సంపన్న దేశాలు మరో పక్క మోహరించివున్న ప్రస్తుత వాతావరణంలో పేద దేశాల స్వరాన్ని గట్టిగా వినిపించాల్సిన చారిత్రక అవసరం ఎంతో ఉంది. ధనిక, బీద దేశాలకు సభ్యత్వం ఉండి, వాటిమధ్య సంభాషణలు సాగే అతి తక్కువ అంతర్జాతీయ వేదికల్లో జీ–20 ఒకటి. అగ్ర దేశాల పంచాయతీకే ఈ సంస్థ పరిమితమైతే పేద దేశాల సమస్యలకు చోటుండదు. పేద దేశాల సమస్యలు సాధారణమైనవి కాదు. ఇన్నేళ్లా అభివృద్ధి పేరుతో, లాభార్జనే ధ్యేయంగా ధనిక దేశాలు విచ్చలవిడిగా వినియోగించిన శిలాజ ఇంధనాల కారణంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగి భూగోళం వేడెక్కింది. ఇందువల్ల దక్షిణార్ధ గోళంలో ఉన్న పేద దేశాలకే అధిక నష్టం సంభవిస్తోంది. వచ్చే నవంబర్ నెలాఖరులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన దుబాయ్‌లో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) సదస్సు జరగబోతోంది. పర్యావరణ సమస్యలన్నీ అక్కడే చర్చించవచ్చునని ధనిక దేశాలు తప్పించుకునే ప్రయత్నం చేయొచ్చు. దీన్ని సాగనీయకూడదు. 2021లో రోమ్‌లో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు 'అర్థవంతమైన చర్యల ద్వారా భూగోళానికి ముప్పు కలగకుండా చూస్తామనీ, విదేశాల్లోని బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కర్మాగారాలకు ఆర్థిక సాయం అందకుండా చూస్తామ'నీ ధనిక దేశాలు హామీ ఇచ్చాయి. ఈ వాగ్దానంలో ధనిక దేశాల్లోని కర్మాగారాల ఊసు లేదు. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి రికార్డు స్థాయికి చేరింది. వర్తమాన సంవత్సరంలో ఈ రంగంలో పెట్టుబడులు ఎన్నడూ లేనంతగా 15,000 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని అంచనా. అంటే రోమ్‌లో చేసిన బాసలకు విలువే లేదన్న మాట. దీనిపై ప్రస్తుత సదస్సులో నిలదీయాలి. జీ–20 సభ్యత్వంలోనూ ఎన్నో తిరకాసులున్నాయి. నూతన ఆర్థిక శక్తిగా ఎదగటం మాట అటుంచి, కనీసం 20 ఉన్నత స్థాయి ఆర్థిక వ్యవస్థల్లో కూడా ఒకటిగా లేని అర్జెంటీనాకు సంస్థలో సభ్యత్వం ఉంది. పోర్చుగల్, ఈజిప్టు వంటి దేశాలకు చోటులేదు. ఒక సంస్థగా చెప్పుకోదగిన విజయాలు ఎందుకు సాధించలేదో, అందుకు అడ్డుపడుతున్నవేమిటో జీ–20 ఆత్మవిమర్శ చేసుకోవాలి. భవిష్యత్తరాలకు సురక్షితమైన భూగోళాన్ని అప్పగించాలంటే సంపన్న దేశాలుగా తాము చేయాల్సిందేమిటో అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలు ఆలోచించాలి. అంతర్జాతీయ సంబంధాలు ఛిద్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యే ప్రమాదం ఉంటుందని గుర్తెరిగి ధనిక దేశాలు బాధ్యతగా మెలగాలి.

నెత్తురంటిన ఆ చేతులెవరివి బాబూ?

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

కొన్నేళ్ల పాటు మావోయిస్టుగా గడిపిన అజ్ఞాత జీవితం, విప్లవ గాయకుడిగా, గ్రామాల్లో, నగరాల్లో బహిరంగ ప్రదర్శనలు ఇచ్చిన జీవితం, దశాబ్దాలుగా ఎదుర్కొన్న రాజ్య నిర్బంధం అనేవి గద్దర్ పాటను దాదాపు ప్రతి ఇంటికీ మోసుకెళ్లాయి. భారత దేశవ్యాప్తంగా విశిష్టమైన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక చిహ్నంగా ఆయన ఉండిపోయారు. ప్రభుత్వ ఏజెన్సీలు 1997లో ఆయనపై బుల్లెట్లు పేల్చాయి. దాదాపు 25 ఏళ్లపాటు వెన్నెముకలో దిగిన బుల్లెట్‌తోనే ఆయన జీవించారు. అలాంటి జీవితం మానవ చరిత్రలో కనీవినీ ఎరుగం. ఆ సమయంలో రాష్ట్రపాలకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు చేతులకు నెత్తురంటింది. శ్మశానంలో ఉన్న గద్దర్ దేహంలోని బుల్లెట్ దీనికి శతాబ్దాలపాటు సాక్షీభూతంగా నిలుస్తుంది.

2023 ఆగస్టు 6న ప్రజాగాయకుడు గద్దర్ అనూహ్య మరణం, కడసారి చూడడానికి తరలి వచ్చిన వేలాది ప్రజల మధ్య బౌద్ధ ఆచారాలతో జరిగిన ఆయన ఖననం... భారతీయ కమ్యూనిస్టులకు కొత్త దారి చూపాయి. గద్దర్ కమ్యూనిస్టు విప్లవ గాయకుడిగా, పాటల రచయితగా, కళాకారుడిగా సుపరిచితుడు. కొన్నేళ్ల పాటు మావోయిస్టుగా గడిపిన అజ్ఞాత జీవితం, విప్లవ గాయకుడిగా, గ్రామాల్లో, నగరాల్లో బహిరంగ ప్రదర్శనలు ఇచ్చిన జీవితం, దశాబ్దాలుగా ఎదుర్కొన్న రాజ్య నిర్బంధం అనేవి గద్దర్ పాటను దాదాపు ప్రతి ఇంటికీ మోసుకెళ్లాయి. ప్రభుత్వ ఏజెన్సీలు 1997లో ఆయనపై బుల్లెట్లు పేల్చాయి. ఆ సమయంలో రాష్ట్రపాలకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు చేతులకు నెత్తురంటింది. శ్మశానంలో ఉన్న గద్దర్ దేహంలోని బుల్లెట్ దీనికి శతాబ్దాల పాటు సాక్షీభూతంగా నిలుస్తుంది. గద్దర్ దేహాన్ని దహనం చేసివుంటే, అది గుర్తించలేని బూడిదగా మారిపోయేది. సజీవమైన చారిత్రక సాక్ష్యం మిగిలి ఉండేది కాదు. మావోయిస్టుగా జీవించినప్పటికీ, బౌద్ధ అంత్యక్రియల ద్వారా బౌద్ధ అంబేడ్కరిస్టుగా మరణించిన ఆయన, శాంతికి ప్రతినిధిగా, 25 సంవత్సరాల పాటు గాయపడిన దేహ బాధితుడిగా మనకు మిగిలిపోయారు.

దాదాపు 25 ఏళ్లపాటు వెన్నెముకలో దిగిన బుల్లెట్‌తో ఆయన జీవించారు. అలాంటి జీవితం మానవ చరిత్రలో కనీవినీ ఎరుగం. శరీరంలోని పలు అవయవాల్లో ఆరు బుల్లెట్లు దూరిన స్థితితో ఆయన మనగలిగారు. శరీరంలో ఆరు బుల్లెట్లు దూరినప్పటికీ బతికి, చివరి వరకూ శరీరంలో ఒక బుల్లెట్‌తో జీవించినట్టు యుద్ధంలో పోరాడిన ఏ సైనికుడి గురించీ మనకు తెలీదు. ఆ రకంగా మానవ చరిత్రలోనే గద్దర్ ఒక విశిష్ట వ్యక్తి. అలాంటి జీవితం ఆయన్ని అపార ప్రజాదరణ, ప్రేమాదరణలు కలిగిన మనిషిగా మార్చింది. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజన జరగడానికి ముందున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గద్దర్ పాడిన పాటలు, చేసిన ప్రదర్శనలు ఆయనకు ఎంతోమంది అభిమానులను సాధించిపెట్టాయి. ఆకలి, దోపిడీల నుంచి మానవ విముక్తి లక్ష్యం పట్ల ఆయన వహించిన నిబద్ధత... ఆయన్ని బాధామయ జీవితంలో గడిపేలా చేసింది.

అనంతరం 1996 నుంచి 2014 వరకు ప్రత్యేక రాష్ట్రంకోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఆయన వహించిన పాత్ర వల్ల ఆంధ్రా ప్రజలు ఆయన పట్ల అయిష్టత ప్రదర్శించి ఉండవచ్చు. అయితే, ఒక రచయితగా, కళాకారుడిగా గద్దర్ భారత దేశవ్యాప్తంగా విశిష్టమైన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక చిహ్నంగా ఉండిపోయారు.

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ ముందు అనేక తీవ్రమైన సైద్ధాంతిక అంశాలను లేవనెత్తి, 2012లో ఆ పార్టీ నుంచి విడిపోయారు. మార్క్స్, లెనిన్, మావోతోపాటు భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మహాత్మా పూలే, అంబేడ్కర్‌లను కూడా గుర్తించడం



ద్వారా మావోయిస్టు పార్టీ కులానికీ, వర్గానికీ వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందని గద్దర్ ప్రతిపాదించారు. భారతదేశంలో కులం ప్రతికూల పాత్ర గురించి పాటలు రాయడం, వేదికల మీద ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. దాంతో మావోయిస్టు పార్టీ గద్దర్ పనిని పార్టీ వ్యతిరేకమైనదిగా పరిగణించడమే కాదు... ఆయన అవగాహనను మార్క్సిజం కాదని ముద్రవేసి, ఆయన ప్రతిపాదనలను తిరస్కరించి, 2010లో షోకాజ్ నోటీసు ఇచ్చింది. విప్లవ పార్టీ తనను బహిష్కరించడం ఖాయమని గ్రహించిన గద్దర్ 2012లో మావోయిస్టు పార్టీకి రాజీనామా చేశారు. అయితే భారతీయ కుల–వర్గ దోపిడీకి అనుగుణంగా తన పార్టీ పంథాను మార్చడానికి గద్దర్ చేసిన ప్రయత్నం విస్మరణకు గురి కాకూడదు.

అంబేడ్కరైట్ నవయాన బౌద్ధమతం పట్ల తన ఆధ్యాత్మిక సామాజిక విధేయతను గద్దర్ బహిరంగంగా ప్రకటించారు. దళితుల, మహిళల అణచివేతపై అనేక పాటలు రాశారు. అతను ఒక యాంత్రిక మార్క్సిస్ట్, బౌద్ధ లేదా అంబేడ్కరైట్ కాదు. అత్యంత సున్నితత్వం కలిగిన మానవుడు.

భారతదేశంలోని కమ్యూనిస్టు నాయకులు వర్గపోరాటంతోపాటు సామాజిక సంస్కరణలను అవసరమైన అంశంగా ఎన్నడూ అంగీకరించలేదన్న విషయం అందరికీ తెలిసిందే. భారతీయ సాంఘిక సంస్కరణలో ఆధ్యాత్మిక సంస్కరణతో పాటు శ్రమకు గౌరవం, పురుషులతో స్త్రీల సమానత్వం కూడా భాగమై ఉన్నాయి. దానికి అంతిమ రూపం ఏదంటే కుల అసమానతలను, మహిళల అసమానతలను నిర్మూలించడం. అయితే, భారతీయ కమ్యూనిస్టులు ఆధ్యాత్మిక పరంగా తమను తాము నాస్తికులుగా ప్రకటించుకున్నారు. పైగా, ఆర్థిక నియతి వాదులుగా (ఆర్థికమే అన్నింటినీ నిర్దేశిస్తుంది అనే వాదం) వారు వర్గ ప్రశ్నలపైనే ప్రాథమికంగా దృష్టి పెట్టారు. కానీ వాస్తవానికి వారిలో ఎక్కువ మంది హిందువులుగానే మరణిస్తున్నారు. రోజువారీ జీవితంలో వారి నాస్తికత్వం ఎలాంటి సామాజిక సంస్కరణకు సంబంధించినదిగా లేదు. గద్దర్ తన మరణంతో వారికి ఒక పెద్ద సామాజిక, ఆధ్యాత్మిక సంస్కరణ కార్యక్రమాన్ని అందించారు.

అంబేడ్కర్ ఇలా అన్నారు: ''నేను అంటరాని వ్యక్తిని అనే కళంకంతో జన్మించిన దురదృష్టవంతుడిని. అయితే, ఇది నా తప్పు కాదు. కానీ నేను హిందువుగా మరణించను, ఎందుకంటే ఇది నా చేతుల్లో ఉంది.'' ఇలా ప్రకటించిన తర్వాతే ఆయన బౌద్ధుడు అయ్యారు, బౌద్ధుడిగా మరణించారు.

గద్దర్ అంటరాని వ్యక్తిగా జన్మించారు. అది ఆయన చేతుల్లో లేనిది. అనేక సాయుధ దళాలను కలిగి ఉన్న కమ్యూనిస్ట్ విప్లవ పార్టీలో పనిచేశారు. ఆయన వారి ప్రజా యుద్ధ నౌక. అయితే మరణ సమయంలో తన చేతుల్లో ఉన్న అధికారాన్ని ఉపయోగించి శాంతి సందేశంతో బౌద్ధుడిగా మరణించిన అంబేడ్కర్ జీవన సారాంశాన్ని గద్దర్ గ్రహించారు. తాను జీవితాంతం సమర్థించిన తుపాకులు ఆ అంటరానితనం నుండి విముక్తి చేయలేదు. అందువల్లనే గద్దర్ బౌద్ధుడయ్యారు, అంటరానితనం నుండి విముక్తి పొందారు. ముఖ్యంగా, బూటకపు ఎన్‌కౌంటర్లలో చిత్రహింసలు పెట్టి, వందలాది మృతదేహాలను తగులబెట్టిన ఆ రాజ్య వ్యవస్థకు వ్యతి రేకంగా పోరాడిన వ్యక్తిగా, తన శరీరాన్ని, బుల్లెట్‌ని దహనం చేసేస్తే ఆ తర్వాత తనను హింసించినట్లు ఎటువంటి ఆధారాలు మిగిలి ఉండ వని గద్దర్ గ్రహించారు.

ఆ మృతదేహాలను ఖననం చేసినట్లయితే, దశాబ్దాల తర్వాత కూడా వాటిని వెలికితీసి మళ్లీ పరీక్షించవచ్చు. అందువల్ల గద్దర్ తన శరీరంలోని బుల్లెట్‌తో పాటు ఖననం చేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. 1997లో చంద్రబాబు నాయుడి క్రూర పాలనకు నిదర్శనంగా ఆయన వెన్నులో బుల్లెట్ అలాగే ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చంద్రబాబు కబ్జా చేసిన పార్టీకి ఆయన మామ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ అని పేరు పెట్టారు. అదే సమయంలో గద్దర్ తెలుగు నేల అందించిన అత్యంత శక్తిమంతమైన తెలుగు రచయిత, గాయకుడు, సంభాషణకర్త.

గద్దర్ నివసించిన బస్తీలో మహాబోధి విద్యాలయం పేరుతో ఆయన స్థాపించిన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుల్లెట్‌తోపాటు ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. చంద్రబాబు ఆ సమాధి వద్దకు వెళ్లి, సాష్టాంగ నమస్కారం చేసి, తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1997 ఏప్రిల్ 6న ఏమి జరిగిందో కనీసం ఇప్పుడైనా నిజం చెప్పినట్లయితే, దేశం మొత్తం చంద్రబాబుని క్షమిస్తుంది. అలా పశ్చాత్తాపం ప్రకటించిన తర్వాత చంద్రబాబు తన జీవితాంతం కచ్చితంగా మనిషిగా జీవించగలరు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అభ్యర్థిని ఎన్నుకోవాలి



ముఖ్యమైన ఏ రాజకీయ పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించడం లేనందున, వాటిని మనం(బీజేపీ) అనుసరించాలని సూచిస్తున్నాను. యూఎస్ విధానంలో ఆశావహులు వివిధ అంశాల మీద చర్చలు జరిపాక, ఎంపికైనట్టుగానే మనం కూడా ప్రధానమంత్రి అభ్యర్థిని అలా ఎన్నుకోవాలి.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

పెరుగుతున్న ప్రాధాన్యం



జీ–20 శిఖరాగ్ర సమావేశాలకు ముందు రష్యా విదేశాంగ మంత్రి లవ్‌రోవ్‌కు, సమావేశం అయిన వెంటనే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇస్తోంది. గొప్ప అధికార పోటీదారులకు యుద్ధక్షేత్రంగా, సరితూనికగా భౌగోళిక రాజకీయాల్లో బంగ్లాదేశ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత ఇప్పుడు విస్మరించలేనిది.

– మైకేల్ కుగెల్‌మాన్, కాలమిస్ట్

నా సానుభూతి



మారిముత్తు (నటుడు, దర్శకుడు) అద్భుతమైన మనిషి. ఆయన మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎడబాటుకు గురైన ఆయన కుటుంబానికి హృదయపూర్వక సానుభూతి.

– రజనీ కాంత్, నటుడు

బాధాకరం



అజిత్ నైనన్ (కార్టూనిస్ట్) మనల్ని విడిచి వెళ్లడం బాధాకరం. ఇప్పుడు మనం జీవిస్తున్న కష్టకాలంలో ఆయన ఇల్లస్ట్రేషన్లు సూక్ష్మమైన లోచూపును అందిస్తాయి. ప్రగాఢ సానుభూతి.

– సీతారాం యేచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

ఇంత హడావుడా?



సాధారణ సమావేశాలను అసాధారణమైనవిగా కనబడేలా చేయడమే ఇండియా జీ–20 సమావేశాల నిజమైన ఉద్దేశం అని నేను అనుకుంటున్నాను.

– ప్రవీణ్ సహానీ, జర్నలిస్ట్

ఇకనైనా పర్మినెంట్ చెయ్యండి!

రాష్ట్రంలో నిత్యం శ్రమ దోపిడీకి గురౌతున్న ఏకైక యూనిఫామ్ ధరించిన వారు హోంగార్డ్స్. రాష్ట్రమొచ్చాక వీళ్ళ బతుకులు మరింత చీకటిమయం అయ్యాయనేందుకు కళ్లెదుట కనిపిస్తున్న ఇరవై వేల మంది హోంగార్డ్స్ జీవితాలే ప్రత్యక్ష ఉదాహరణలు. చాలీ చాలని జీతం, రేయింబవళ్ల డ్యూటీతో విలువ లేని బతుకులు ఈడ్చుకొస్తున్నారు వీరు.

హోంగార్డ్ వ్యవస్థను పర్మినెంట్ చేస్తామని ఎన్నోసార్లు అసెంబ్లీ వేదికగా స్వయంగా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. అయినా సరే నేటివరకు ఆ హామీ అమలు కాలేదు. పరిస్థితులు క్షీణించడంతో హోంగార్డులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందుకు సాక్షి విగత జీవిగా మారిన హోంగార్డ్ రవీందర్. పోలీసులతో కల్సి పోటీపడి ఉద్యోగ నిర్వహణ చేస్తున్నా సరే వీళ్ళకు సముచిత స్థానం కల్పించడంలో ప్రభుత్వాలు గత యాభై యేండ్లకు పైగా విఫలమౌతూనే ఉన్నాయి. తెలంగాణ వస్తే నౌకరీ పర్మినెంట్ అవుతుందనుకొన్నారు. కానీ జీవితాలే ఆవిరైపోతున్నాయి.



గతకాలం మిన్న వచ్చుకాలం కంటే' నేడు వీరికి బాగా సరిపోతుంది. ఒకనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, కారుణ్య నియామకాలు ఉండేవి. పోలీసు రిక్రూట్‌మెంట్ జరిగేది. సుమారు ఐదులక్షల రూపాయల వరకు ఆరోగ్య భద్రత ఉండేది. కుటుంబాలకు ఒక భరోసా ఉండేది. కానీ నేడు ధనిక రాష్ట్రమనీ, బంగారు రాష్ట్రమనీ చెప్పుకుంటున్న తెలంగాణలో వేలమంది హోంగార్డ్స్ చివరకు ఆత్మహత్యలను ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. ఈ అనిశ్చిత పరిస్థితి ఎవరి నిర్ణయాల వలన దాపురించింది? 'పొమ్మనలేక పొగబెడ్తున్నది' ఎవరనేది బుద్ధి జీవులైన వాళ్లూ, ప్రజాస్వామికవాదులూ, మేధావులూ ఆలోచన చేయాల్సిన తరుణం నేడు తెలంగాణలో ఆవిష్కృతమైనది. తెలంగాణ వచ్చాక వివిధ శాఖల్లో పనిచేసే వాళ్లనూ, ఐదారేళ్ల సర్వీసుకూడ పూర్తిగాని వాళ్ళనూ, గెజిటెడ్ హోదాలో కూడ పర్మినెంట్ చేస్తున్న ఈ ప్రభుత్వం... అంసెబ్లీ వేదికగా ఎన్నోసార్లు హమీ ఇచ్చి కూడా హోంగార్డుల పర్మినెంట్ వ్యవహా రాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు?

వీళ్ళేమైనా లక్షల రూపాయాల జీతాలు అడుగుతున్నారా? కేవలం కుటుంబం బతకడానికి భరోసాను కల్పించండని వాపోతున్నారు. ఎనిమిది గంటలైనా పనిగంటలు లేనివాళ్లు ఎవరెవరినో పర్మినెంట్ చేస్తున్న ప్రభుత్వం... ఇరవై నాలుగు గంటలూ నిరంతరం పనిచేస్తున్న ఈ హోంగార్డులను ఎందుకు పర్మినెంట్ చేయడం లేదు? గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే రోడ్లు ఎలాగైతే చెత్త, చెదారంతో కంపుకొడ్తాయో ఇవ్వాల పోలీసు శాఖలో హోంగార్డ్స్ లేకపోతే కూడా పరిస్థితి అదే. ఇది పచ్చినిజం.

తెలంగాణ రాష్ట్రం కొరకు నాడు అమరులు శ్రీకాంతచారీ, యాదయ్య లాంటోళ్ళు ఒంటిపైన పెట్రోల్ పోసుకుని తగలబడి తాము ఆరిపోయి కొత్త రాష్ట్రోదయానికి కారణమయ్యారు. రాష్ట్రమొచ్చాక అతి సామాన్య హోంగార్డు రవీందర్ బతుకు భరోసా కొరకు అదే హైదరాబాద్ నడిబొడ్డున తనపై పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుని అసువులు బాసిపోయాడు. దీనిని బట్టి ప్రస్తుత ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హోంగార్డులు అడుగుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. అలా అని శ్రమకు తగిన వేతనం కూడా కాదు. కేవలం తమను పర్మినెంట్ చేయమనీ, కారుణ్య నియామకాలు చేపట్టమనీ, తమ మీదనే ఆధారపడి బతుకుతున్న కుటుంబ సభ్యులకు ధైర్యం నింపండనీ వేడుకుంటున్నారు. హోంగార్డు రవీందర్ బలవ్మరణం దురదృష్టకరమైన సంఘటన. కనీసం ఈ ఘటనతోనైనా ప్రభుత్వం తమ మౌన వ్రతాన్ని వీడి మరొకరు బలికాకముందే శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తుందని ఆశిద్దాం

– వరకుమార్ గుండెపంగు, సామాజికవేత్త । 99485 41711

ఇంతకు మన దేశం పేరేంది?

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద సుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గి నయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''రాజకీయ కొల్వులు లేనోల్లకు శుభ వార్త'' అని యాద్గిరి అన్నడు.

''ఏంది గా వార్త?'' అని సత్నారి అడిగిండు.

''ఐదు రాస్ట్రాలల్ల ఎమ్మెల్యే కొల్వులకు నోటిఫికేషన్ వొస్తది.''

''ఏం సదువుకున్నోల్లకు గీ కొల్వులు దొర్కుతయి?''

''ఏం సదువుకున్నా పర్వలేదు. గని బిచ్చ మడ్గ రావాలె.''

''బిచ్చమడ్గొచ్చుడెందుకు?''

''బిచ్చ మడ్గొస్తెనే ఓట్ల బిచ్చమడ్గొస్తది.''

''ఇంకేం రావాలె?''

''తిట్ల రావాలె. ఒకటి జెప్పి ఇంకొకటి చెయ్యరావాలె. రంగు బూస్కోకుంటనే యాక్టింగ్ జెయ్య రావాలె.''

''గీ కొల్వు కోసం లంచమేమన్న ఇయ్యాల్నా?''

''కోట్ల రూపాయల లంచమిస్తెనే గీ కొల్వు దొరుక్తది. గదీ ఎవలెక్వ లంచమిస్తె గాల్లకే.''

''బీఆర్ఎస్ నూట పదిహేను మందికి ఎమ్మెల్యే టికిట్లు ఇచ్చింది. కాంగ్రెస్ ఎంతమందికి ఇచ్చింది?''

''కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఎవలకు ఇయ్యాల్నో, ఎవలకు ఇయ్యద్దో ఇంక జెప్పలేదు. గా కమిటి బూతద్దం బెట్టి జూస్తున్నా గా దాని పని గాలేదు. బీజేపీ డబల్ ఇంజన్ సర్కార్ అంటుంటె, కాంగ్రెస్‌ల కొందరు ఒకే కుటుంబంల డబల్ టికిట్లు అంటున్నరు. కాంగ్రెస్ సీనియర్ లీడర్లు ఆల్ల కొడ్కులకు టికిట్లు ఇయ్యాలంటున్నరు. నల్లగొండ ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి గాయిన పెండ్లాం పద్మావతికి కోదాడ టికిట్ ఇయ్యాలంటున్నడు. గామె ఎమ్మెల్యేగ పని జేసింది. 2018ల వెయ్యి ఓట్ల ఫరక్‌తోనే ఓడిపోయింది. గీపారి మిర్యాలగూడ టికిట్ తన కొడ్కు రఘువీరా రెడ్డికి ఇయ్యాలని జానారెడ్డి అంటున్నడు. నాగార్జున్ సాగర్ టికిట్ ఇంకో కొడ్కు జయవీరా రెడ్డికి ఇయ్యాలని గాయిన అంటున్నడు. గాయినకే గాకుంట గాయిన బిడ్డ త్రిషకు గుడ్క ఎమ్మెల్యే టికిట్ ఇయ్యాలని దామోదర్ రాజ నర్సింహ అంటున్నడు. గామె కొడ్కు సూర్యంకు పినపాక నియోజక వర్గం ఎమ్మెల్యే టికిట్ ఇయ్యాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అంటున్నది. మహబూబాబాద్ టికిట్ గాయిన కొడ్కుకు ఇయ్యాలని బల్రామ్ నాయక్ అంటున్నడు. కొండా సురేక తూర్పు వరంగల్ టికిట్ ఇయ్యమంటున్నది. గామె మొగుడు కొండా మురళి పరకాల టికిట్ అడుగుతున్నడు. జూబ్లీహిల్స్ టికిట్ విష్ణు వర్దన్ రెడ్డి గావాలంటున్నడు. గాయిన చెల్లె విజయారెడ్డి ఖైరతాబాద్ టికిట్ అడుగుతున్నది. ఒకే కుటుంబం రొండు టికిట్లు ఇయ్యొద్దని కాంగ్రెస్ల కొంత మంది అంటున్నరు. గని సోనియగాంది, రాహుల్ గాంది, గీ పారి ప్రియాంక గాంది గూడ పోటీ జేస్తదంటున్నరు. గాల్లు ఒకే కుటుంబమోల్లు గాదా అని కొందరు అడుగుతున్నరు.''

''మన దేశం పేరేంది?''

''ఇండియా.''

''కాదు భారత్ అంటున్నరు గదా!''

''జీ–20 మీటింగ్ అయ్యేటప్పుడు దావత్‌కు రమ్మని పారిన్ లీడర్లకు పంపిన పత్రికలల్ల ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని ఉన్నది. గా దాంట్ల ఇండియాకు బదల్ భారత్ అని చపాయించింద్రు. మోదీ గ్రీస్ దేసంకు బోయినప్పుడు గూడ ప్రైమినిస్టర్ ఆఫ్ భారత్ అని చపాయించింద్రు. దేసం పేరును బద్లాయించెతందుకు బీజేపీ సర్కార్ కోషిస్ జేస్తున్నదని అపొజిసన్ పార్టీలంటున్నయి. అపొజిసన్ పార్టీల కూటమి పేరు ఇండియా ఉండబట్కె దేసం పేరును బద్లాయించాలని సూస్తున్నరని కొందరంటున్నరు. దేసం పేరును బద్లాయిస్తె నోట్లన్నిటిని రద్దు జెయ్యాలె.''

''గట్లెందుకు జెయ్యాలె?''

''నోట్లన్నిటి మీద ఇండియా అని చపాయించి ఉంటది.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.



రచయిత సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

అలుపెరుగని పోరాటశీలి

'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి/ అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి' అంటూ ప్రజల గొడవను తన గొడవగా చెప్పినవాడూ, అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట/ సంపదలన్నీ ఒకచోట గంపెడు బలగం ఒకచోట అంటూ సమసమాజ నిర్మాణానికి కదం తొక్కిన ఉద్యమవీరుడూ, 'కోటిన్నర మేటి ప్రజల గొంతొక్కటి గొడవ ఒక్కటి/ తెలంగాణ నిలిచి గెలిచి ఫలించాలి భారతాన' అని స్వప్నించిన ప్రజాకవి కాళోజీ. నిజాం రాజ్యాన్ని ప్రతిఘటించడం దగ్గర నుండి నక్సలైట్లపై హింసను ఖండించే వరకు ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. ఆర్య సమాజ్ కార్యకలాపాలు, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ, భారత స్వాతంత్ర పోరాటం, హైదరాబాద్ విమోచన ఉద్యమం, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం, పౌర హక్కులు, తెలంగాణ ఉద్యమం... ఇలా ఈ గడ్డను తాకిన, శాసించిన ఏ ఉద్యమానికైనా కాళోజి తన రెండు చేతులతో ఆహ్వానం పలికి ఆవాహన చేసుకున్నాడు. ఉద్యమకారుడుగానే మాత్రమే కాక కవిగా, కథకుడిగా ఉద్యమాలకు ఆలంబనై, మూడుసార్లు జైలుకెళ్లాడు.



1914 సెప్టెంబర్ 9న ఇప్పటి కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని రెట్టిహళ్లి గ్రామంలో ఆయన జన్మించాక కుటుంబం అక్కడనుండి వరంగల్ జిల్లాలోని మడికొండకు వచ్చి స్థిరపడింది. ఆయనకు ప్రత్యేక ఆస్తి అంటూ ఏమీ లేదు. చిన్నప్పటినుండి అన్న రామేశ్వరరావు ఆయన అవసరాలను తీర్చుకుంటూ వచ్చాడు. అప్పట్లో తెలంగాణ గడ్డపై సమాంతరంగా సాగిన పలు ఉద్యమాలకు కాళోజీ ఇల్లు కేంద్రంగా ఉండేది.

కాళోజి లాంటి వ్యక్తులు అరుదుగా జన్మిస్తారు. ఒక కన్ను అన్యాయాన్ని చూసి సహించలేక నిప్పులు కురిపిస్తుంది, ఇంకొక కన్ను ప్రజల సంవేదనలను జీర్ణించుకోలేక కన్నీరు కారుస్తుంది. ఈ రెండు పార్శ్వాలు ఒకే వ్యక్తిలో ఉండటం బహుఅరుదు. అటువంటి అరుదైన వ్యక్తి కాళోజి. బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలని తెలంగాణ యాసలో కవిత్వాన్ని కథలను రాసిన కవి 1992వ సంవత్సరంలో భారతదేశంలో రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ పొందారు కాళోజి. నవంబర్ 13 2002వ సంవత్సరంలో వరంగల్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనను స్మరించుకోవడం అంటే ఆయన వ్యక్తిత్వాన్నీ, ఆయన వదిలి వెళ్లిన విలువలనూ గౌరవించడం, అంతకుమించి ఆచరించడం.

– ములుక సురేష్
(నేడు కాళోజి జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.దశమి రా 9.08 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆరుద్ర సా.5.26 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.5.48 నుండి 7.29 వరకు, అమృతఘడియలు: ఉ.6.51 నుండి 8.33 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.06.

ఆత్మహత్య చేసుకుంటాను..

- వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చేసిన హోంగార్డు
- సమస్యలతో తానుంటే ఎస్‌ఐ సస్పెండ్ చేయించారని ఆరోపణ
- జైలుకెళ్లి వచ్చినా ఆ హోంగార్డు తీరులో మార్పు రాలేదన్న ఎస్‌ఐ
- ఖమ్మం జిల్లా కల్లూరులో ఎస్‌ఐ ✘ హోంగార్డు


రాంబాబు

కల్లూరు: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన హోంగార్డు సిరసాని రాంబాబు(సస్పెన్షన్‌లో ఉన్నారు) తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా జిల్లా హోంగార్డుల వాట్సాప్ గ్రూప్‌లో శుక్రవారం మెసేజ్ పెట్టడం పోలీసు శాఖలో కలకలం సృష్టించింది. హైదరాబాద్‌లో హోంగార్డు రవీందర్ మృతి విషయం మరువకముందే.. ఈ మెసేజ్ పెట్టడం, విషయం ఆనోటా ఈనోటా బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. దీంతో సిరసాని రాంబాబుతో 'సాక్షి' మాట్లాడగా, హోంగార్డులు పని భారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, చాలీచాలని జీతంతో ఇబ్బందిపడుతున్నారని వాపోయాడు. కల్లూరులో భూమి విషయంలో అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొందరు తన తల్లిదండ్రులపై ఫిబ్రవరి 10న దాడి చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ సమయాన వేరే ప్రాంతంలో ఉన్న తాను ఫిబ్రవరి 28న ఎస్‌ఐ పి.రఘుతో కేసు విషయమై మాట్లాడితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమేకాక ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయించారని ఆరోపించాడు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు.

ఆరోపణల్లో వాస్తవం లేదు: ఎస్‌ఐ

సస్పెండ్ అయిన హోంగార్డు సిరసాని రాంబాబు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని కల్లూరు ఎస్‌ఐ పి.రఘు స్పష్టం చేశారు. భూమి అక్రమంగా ఆయనే ఆక్రమించాడని, ఇతర ఫిర్యాదులు కూడా ఉన్నాయన్నారు. గతంలో తోటి హోంగార్డును కొట్టి సస్పెండ్ అయ్యి జైలుకు వెళ్లి రాగా, కొంత కాలానికి విధుల్లో తీసుకున్నట్లు తెలిపారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోగా, మద్యం సేవించి విధులకు వస్తుండడంతో సస్పెండ్ చేశారని వెల్లడించారు.

హోంగార్డు రవీందర్ మృతి

- కాలిన గాయాలతో డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ఉన్నతాధికారుల వేధింపులతోనే రవీందర్ ఆత్మహత్య అంటూ భార్య సంధ్య ఆందోళన
- ఉస్మానియా ఆస్పత్రి వద్ద నిరసనకు దిగిన బంధువులు, హోంగార్డులు
- పలు రాజకీయ పార్టీల నేతల సంఘీభావం
- సాయంత్రం వరకు ఉద్రిక్తత.. ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమణ


రవీందర్ (ఫైల్)


రవీందర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జీతం కోసం వెళ్తే అధికారులు అవమానించారంటూ ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డు రవీందర్ డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గోషామహల్‌లోని హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయం వద్ద మంగళవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న రవీందర్‌కు 55 శాతం కాలిన గాయాలైన విషయం తెలిసిందే. ఆయనకు తొలుత ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందించగా.. మెరుగైన చికిత్స కోసం డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రవీందర్ భార్య సంధ్య, కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నాకు దిగడంతో రోజంతా ఉద్రిక్తత చోటు చేసుకుంది.

వేతనం కోసం వెళ్లి.. ఆందోళనకు గురై..

మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. హైదరాబాద్ పాతబస్తీలోని రక్షాపురం ప్రాంతానికి చెందిన రవీందర్ (38) చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నారు. తనకు జీతం రాకపోవడంతో రవీందర్ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయానికి వెళ్లి వాకబు చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేసే ఏఎస్సై నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ చందు చులకనగా మాట్లాడటంతో రవీందర్ ఆవేదనకు లోనయ్యారు. ఆ కార్యాలయం ముందే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.

ఆస్పత్రి వద్ద ఆందోళనతో..

పోలీసులు రవీందర్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించగా.. ఆయన భార్య, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. పోలీసు అధికారుల వేధింపులతోనే రవీందర్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధ్యులైన ఇద్దరు పోలీసులను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. తన భర్త మృతిపై కనీస సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించడం ఏమిటని, తన భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించారా? అనే సందేహాలు వస్తున్నాయని సంధ్య ఆరోపించారు. ఆమెకు సంఘీభావంగా రక్షాపురం బస్తీవాసులు, హోంగార్డులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దీనితో ఉద్రిక్తత నెలకొంది. చివరికి డీసీపీలు సునీల్‌దత్, కిరణ్ ఖేర్, ఏసీపీ బాల గంగిరెడ్డి తదితరులు సంధ్యతో మాట్లాడి.. త్వరలో డీజీపీ వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తామని, పోలీసు విభాగంలో ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో సంధ్య ఆందోళన విరమించారు. వైద్యులు పోస్టుమార్టం అనంతరం రవీందర్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. శనివారం రక్షాపురంలో అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

ఇద్దరు పోలీసులపై కేసు నమోదు

రవీందర్ ఆత్మహత్యపై భార్య సంధ్య చేసిన ఫిర్యాదు మేరకు షాహినాయత్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంధ్య ఆరోపణల మేరకు హోంగార్డ్స్ కమాండెంట్ కార్యాలయంలోని ఏఎస్సై నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ చందులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్ తెలిపారు.

రవీందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి: రాజకీయ పక్షాలు


ఉస్మానియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన రవీందర్ భార్య సంధ్యకు పలువురు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నేతలు మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, ఫిరోజ్ ఖాన్, సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తదితరులు ఆమెకు బాసటగా నిలిచారు.

- రవీందర్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, రూ.25 లక్షలు ఆర్థిక సాయం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నట్టు ప్రకటించారు. ఇక కేఏ పాల్ రూ.3.1 లక్షల చెక్కును సంధ్యకు అందించి ఓదార్చారు.
- హోంగార్డు రవీందర్ ఆత్మహత్య బాధాకరమని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ వేర్వేరు ప్రకటనల్లో ఆరోపించారు. హోంగార్డులకు సకాలంలో జీతాలిస్తే ఈ దుస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. రవీందర్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- హోంగార్డు రవీందర్ మృతికి కేసీఆర్ ప్రభుత్వమే కారణమని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. హోంగార్డులను రెగ్యులరైజ్ చేస్తామని కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని మండిపడ్డారు. రవీందర్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఆ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రమోషన్లలో సీనియారిటీ లొల్లి

డీఈవోలకు టీచర్ల ఫిర్యాదులు

- సీనియారిటీలో తప్పులున్నాయని ఆందోళన
- మల్టీజోన్‌తో హెచ్‌ఎం పదోన్నతులపై ఎస్‌ఏల అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతుల వ్యవహారం గందరగోళంగా మారుతోంది. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) నుంచి ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం)గా పదోన్నతి కల్పించే విషయంలో సీనియారిటీ తారుమారవుతోందని కొందరు టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో సీనియారిటీ రూపకల్పనలో తప్పులు దొర్లుతున్నాయని, దీనివల్ల కొందరు టీచర్లకు పదోన్నతుల్లో అన్యాయం జరిగే వీలుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను ఈ నెల 3 నుంచి మొదలుపెట్టింది. ఈ ఏడాది జనవరిలో బదిలీల కోసం 78 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి 1న కాకుండా, సెప్టెంబర్ 1కి కటాఫ్ పెంచడంతో మంగళవారం వరకూ మరో 7 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, పదోన్నతుల ప్రక్రియను ఎంఈవోలు, డీఈవోల పరిధిలో నిర్వహిస్తూ, వాళ్లే సీనియారిటీని రూపొందిస్తున్నారు.

జోనల్ సిస్టమ్‌తో సమస్యలు...

2022లో జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు మల్టీజోనల్ పరిధిలోకి వస్తారు. రెండు జోన్లుగా విభజించి, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మెదక్‌తోపాటు కామారెడ్డి, సిద్దిపేటను మల్టీజోన్-1లో చేర్చారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలతోపాటు సంగారెడ్డిని మల్టీజోన్-2 పరిధిలోకి తెచ్చారు. జోనల్ వ్యవస్థ లేనప్పుడు జిల్లా సీనియారిటీ ప్రాతిపదికగానే పదోన్నతులు కల్పించారు. అక్కడి పోస్టులు, ఖాళీలకు అనుగుణంగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ కారణంగా కొన్ని జిల్లాల్లో ఎక్కువ సర్వీసు ఉన్న వారికి పదోన్నతులు రాలేదు. కొన్ని జిల్లాల్లో తక్కువ సర్వీస్ ఉన్నా హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు వచ్చాయి. ఇప్పుడు మల్టీజోన్ వారీగా సీనియారిటీని నమోదు చేయాలంటే 19 జిల్లాల పరిధిలోని టీచర్ల ను మల్టీజోన్-1లో కి తేవాలి. 14 జిల్లా ల పరిధిలోని టీచర్లను మల్టీజోన్-2 పరిధిలోకి తేవాలి. ఇక్కడే సమస్య తలెత్తుతోందని, ఈ సమస్యలు అన్ని జిల్లాల్లోనూ ఉన్నాయని టీచర్లు అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఎక్సెల్ ఫార్మాట్‌లో సీనియారిటీ జాబితాలో పొరపాట్లు దొర్లుతున్నాయని టీచర్లు డీఈవోలకు ఫిర్యాదులు చేస్తున్నారు. మల్టీజోన్ల పరిధిలో మాదిరి సీనియారిటీ జాబితాలను విడుదల చేయడంతో ఈ గందరగోళం నెలకొన్నట్టు చెబుతున్నారు.

ఏడాది ఉన్నా వెళ్లాల్సిందేనా?

రాష్ట్రవ్యాప్తంగా రెండు మల్టీజోన్ల పరిధిలో 1,974 హెచ్‌ఎం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. సీనియారిటీని కొలమానంగా తీసుకుంటే దాదాపు వెయ్యి మందికిపైగా టీచర్లు మూడేళ్ల సర్వీస్‌లోపు ఉన్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్ల సీనియారిటీ ఉంటే బదిలీకి అవకాశం ఉండదు. కానీ ప్రమోషన్‌కు ఈ నిబంధన వర్తించదు. ప్రమోషన్ వచ్చాక మల్టీజోనల్ పరిధిలో ఉండే జిల్లాలోని పోస్టు ఎంత దూరం ఉన్నా వెళ్లాల్సిందే. ఈ కారణంగా సర్వీస్ తక్కువగా ఉన్న దాదాపు 800 మంది వరకూ పదోన్నతిని తిరస్కరించే వీలుంది. ప్రమోషన్, బదిలీ ఆర్డర్ వచ్చిన తర్వాత పదోన్నతిని తిరస్కరించే వీలుంది. అప్పుడు పాత చోటే పోస్టు ఇస్తారా? అనే సందేహాలు కలుగుతున్నాయని టీచర్లు అంటున్నారు. రిటైర్మెంట్ వయసులో హెచ్‌ఎం ప్రమోషన్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి చాలా మంది ఇష్టపడటం లేదు. ఈ కారణంగా 1,974 పోస్టులు పూర్తిస్థాయిలో ప్రమోషన్లతో భర్తీ చేయడం కష్టమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల జీవనం దుర్భరం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఉత్తరాలు చేరవేస్తూ సమాచారాన్ని పల్లెప్రాంత ప్రజలకు అందిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల జీవనం దుర్భరంగా తయారైందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయిన పల్లి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రుల నివాసంలో వినోద్‌కుమార్‌ను గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు వెంకటేశ్వర్లు, రైల్వే ఉద్యోగుల సంఘం నేత యాదవరెడ్డి కలిసి పలు అంశాలపై చర్చించారు. నవంబర్ 19 నుంచి మూడు రోజులపాటు హనుమకొండలో నిర్వహించనున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల మహాసభకు హాజరుకావాలని వినోద్‌కుమార్‌ను ఆహ్వానించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందు బాటులో ఉండే తపాలా ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, పెన్షన్లు ప్రజలకు అందజేయడంలో క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారని వినోద్‌కుమార్ తెలిపారు.

విజయభేరికి భద్రత కల్పించండి

- డీజీపీని కలిసిన కాంగ్రెస్ బృందం
- రవీందర్ ఆత్మహత్య కేసులో కేసీఆర్‌పై హత్యానేరం నమోదు చేయాలి: టీపీసీసీ చీఫ్ రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించనున్న 'విజయభేరి' సభకు భద్రత కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు డీజీపీ అంజనీకుమార్‌ను కోరారు. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అంజనీకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితర కాంగ్రెస్ అతిరథ మహారథులు, లక్షలాది మంది ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో తగిన భద్రత కల్పించాలని ఈ వినతి పత్రంలో పేర్కొన్నారు. డీజీపీని కలిసిన వారిలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, మల్లు రవి తదితరులున్నారు. రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జీతాలు రాక ఆత్మహత్య చేసుకున్న రవీందర్ ఘటన గురించి డీజీపీ అంజనీకుమార్‌తో మాట్లాడామని, ఇది రాష్ట్ర ప్రభుత్వం చేసిన హత్య కాబట్టి సీఎం కేసీఆర్‌పై హత్యానేరం నమోదు చేయాలని కోరినట్టు చెప్పారు. ఈనెల 16,17 తేదీల్లో తాజ్‌కృష్ణ హోటల్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు జరుగుతాయని, 17న విజయభేరి సభ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలకు భద్రత కల్పించాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆటంకాలు రాకుండా చూడాలని డీజీపీని కోరినట్టు చెప్పారు.

తన హయాంలోనే పార్టీకి ప్రాధాన్యత

తాను పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పెరిగిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. అధిష్టానంతో కొట్లాడి రాష్ట్ర నాయకులకు పదవులు తెస్తున్నానని, గతంలో ఎన్నడూ జరగని కార్యక్రమాలు ఈ రెండేళ్లలో జరిగాయన్నారు. శుక్ర వారం గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టి వెళ్లిపోతే ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు పెట్టకుండా ఇక్కడ పెడుతున్నారంటేనే తెలంగాణకు కాంగ్రెస్ ఎంతటి ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు.

రవీందర్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: సీఎం కేసీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ

రెండునెలలుగా జీతాలు లేక హోంగార్డు రవీందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అది ముమ్మాటి కీ ప్రభుత్వం చేసిన హత్యేనని టీపీసీసీ అధ్యక్షు డు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు రేవంత్ శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. కనీసం రవీందర్ ఆత్మహత్యపై ఒక్క మంత్రి, ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం దారుణమని, తెలంగాణ ప్రభుత్వ నిర్వాకం కారణంగానే హోంగార్డులు మనోవేదనను అనుభ విస్తున్నారని తెలిపారు. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని 2017లో అసెంబ్లీ సాక్షిగా సీఎం ఇచ్చిన హామీకే ఇప్పటివరకు దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. వెంటనే హోంగార్డుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయా లని, ఆత్మహత్యకు పాల్పడిన రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవా లని, రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కేసీఆర్‌కు రాసిన లేఖలో రేవంత్‌రెడ్డి కోరారు.

కాళోజీ స్ఫూర్తితోనే తెలంగాణ సాధన: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సమస్యలు, అన్యాయాలను తట్టుకోలేక ప్రజల కోసం తన గొడవను కవిత్వం ద్వారా సున్నితంగా ఆవిష్కరించిన కాళోజీ స్ఫూర్తి తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రగతిలో ఇమిడి ఉన్నదన్నారు. ఈ సంవత్సరం కాళోజీ పురస్కారాన్ని అందుకోనున్న ప్రముఖకవి జయరాజ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.

హోంగార్డులను స్టేషన్‌లోనే ఉంచండి

- డ్యూటీ లేని వారిని బయటికి వెళ్లనీయొద్దు
- పోలీస్ అధికారి ఆడియో వైరల్

సాక్షి, హైదరాబాద్: హోంగార్డు రవీందర్ మృతి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోంగార్డులకు పోలీస్ ఉన్నతాధికారులు వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. హోంగార్డులంతా డ్యూటీలోనే ఉండాలని, డ్యూటీ అయిపోయిన వారిని కూడా పోలీస్ స్టేషన్లకే పరిమితం చేయాలని హుకుం జారీ చేసినట్టు ఓ ఆడియో వైరల్ అయ్యింది. రవీందర్ మృతికి నిరసనగా ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తం అయినట్టు తెలిసింది. ఆదేశాలు మీరితే విధుల నుంచి బహిష్కరణకు గురవుతారని ఓ దశలో బెదిరింపు ధోరణిలో హెచ్చరించినట్టు తెలిసింది.

'రెస్ట్ ఉంది కదా.. ఇంటికి పోతాం అంటే కుదరదు'

'విధుల్లో ఉండే హోంగార్డులు, డ్రైవర్లు, ఆఫీసర్ల దగ్గర పనిచేసే వాళ్లయినా, డే డ్యూటీ చేసేవాళ్లు, ఇంకే డ్యూటీలో ఉండేవాళ్లయినా సరే ప్రతి ఒక్కరూ ఈ రోజు పోలీస్ స్టేషన్‌లోనే ఉండాలి. స్టేషన్ వదిలి బయటికి వెళ్లకూడదు. డ్యూటీ అయిపోయిన వాళ్లను కూడా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచండి..రెస్ట్ ఉంది కదా.. ఇంటికి పోతాం అంటే కుదరదు. ఎవరెవరైతే ఆబ్సెంట్‌లో ఉన్నారో వాళ్ల పేర్లు రాసి పెట్టండి. పది నిమిషాల తర్వాత మళ్లీ నాకు చెప్పండి. ఎవరైతే ఆబ్సెంట్ అవుతారో వాళ్లను మిస్‌కండక్ట్ కింద తీసుకోబడుతుంది. వాళ్ల ఉద్యోగానికి కూడా ఎఫెక్ట్ పడుతుంది. ఇది ఆఫీసర్ల ఇన్‌స్ట్రక్షన్. అందరికీ పేరు పేరున ఫోన్ చేసి తెలపండి. ఇది మీ రెస్పాన్సిబిలిటీ...' అని ఓ పోలీస్ అధికారి సెట్‌లో ఆదేశాలిస్తున్న ఆడియో ఒకటి శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లపై బహిరంగంగా చెప్పుకోలేకపోతున్నా...హోంగార్డులు అంతర్గతంగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కుట్రతోనే డీఎంకే వ్యాఖ్యలు: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాజకీయకుట్రలో భాగంగా, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి, మంత్రులపై ఉన్న అవినీతి, ఆరోపణల నుంచి తప్పించుకునేందుకే అధికార డీఎంకే గందరగోళం సృష్టిస్తోందని బీజేపీ నేత తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఉదయనిధిస్టాలిన్ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టాలిన్‌తో పాటు కేంద్రమాజీమంత్రి ఎం.రాజాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ...తాను యజ్ఞయాగాలకు కేరాఫ్ అని చెప్పుకునే సీఎం కేసీఆర్, ఉదయనిధి వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.



జై సియా రాం

భారత మూలాలున్న బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతులకు శుక్రవారం ఉదయం పాలం విమానాశ్రయంలో.. కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ చౌబే జై సియా రాం(జై శ్రీరాం) అంటూ స్వాగతం పలికారు. వారికి మంత్రి చౌబే రుద్రాక్షను, భగవద్గీత, హనుమాన్ చాలీసా ప్రతులను కానుకలుగా అందజేశారు.

వ్యాపారవేత్తలకు ఆహ్వానాల్లేవ్..

జీ20 ప్రత్యేక విందు కార్యక్రమానికి వ్యాపార దిగ్గజాలకు ఆహ్వానాలు వెళ్లాయన్న వార్తలపై కేంద్రం స్పందించింది. జీ20 స్పెషల్ డిన్నర్‌కు రావాలంటూ వ్యాపారవేత్తలను ఆహ్వానించలేదని స్పష్టం చేసింది. శనివారం జరిగే విందుకు బిలియనీర్లు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి 500 మందికి పైగా వ్యాపారవేత్తలు హాజరవనున్నారంటూ వస్తున్న వార్తలను తప్పుదోవపట్టించేవిగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వాణిజ్యవేత్తలెవరినీ ఆహ్వానించలేదని తెలిపింది.

యూపీఐని పరిచయం చేసేందుకు..

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డిజిటల్ ఇండియా' కార్యక్రమంపై జీ20 ప్రతినిధులకు ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంది. విదేశీ ప్రతినిధులు ఢిల్లీలో ఉండగా జరిపే కొనుగోళ్లకు గాను యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ద్వారా చెల్లింపులపై ఆసక్తి కల్పించేందుకు చర్యలు తీసుకుంది. దేశీయంగా రూపకల్పన చేసిన ఈ విధానంలో చెల్లింపులు ఎంత సులువో వారికి తెలియజేయడమే ఉద్దేశం. ఇందులోభాగంగా సుమారు వెయ్యి మంది విదేశీ ప్రతినిధుల ఫోన్ వ్యాలెట్లలో రూ.500 నుంచి రూ.1000 వరకు బ్యాలెన్స్ జమ చేయనుంది. ఇందుకోసం రూ.10 లక్షల వరకు ప్రత్యేకించింది.

ప్రత్యేకంగా వాతావరణ కేంద్రం

జీ20 సమావేశాలు జరిగే ప్రగతి మైదాన్‌కు సమీపంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అదనంగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచ నేతలు పాల్గొంటున్న కార్యక్రమం అయినందున ఈ వాతావరణ కేంద్రం ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు చేస్తుంది. గురువారం నుంచి ఆదివారం వరకు ఇది నిర్విరామంగా వాతావరణాన్ని పరిశీలిస్తుంటుంది. ఐఎండీకి చెందిన వెబ్‌పేజీ mausam.imd.gov.in/g20 ద్వారా వాతావరణ సూచనల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

స్ట్రీట్ ఫుడ్, మిల్లెట్స్‌తో ప్రత్యేక మెనూ

భారత్‌లో ఈ సీజన్‌లో ప్రజలు ఎక్కువగా ఇష్టపడే వంటకాలతో ప్రత్యేకంగా మెనూ సిద్ధమైంది. భారతీయ స్ట్రీట్ ఫుడ్ ఐటమ్స్‌తోపాటు మిల్లెట్లతో చేసిన ఆహార పదార్థాలకు ఇందులో స్థానం కల్పించారు. ఇంకా గులాబ్ జామ్, రసమలై, జిలేబీ వంటి స్వీట్లు కూడా అతిథులకు వడ్డిస్తారు. వడ్డించే సిబ్బందికి ప్రత్యేక యూనిఫాం రూపొందించారు. మెనూలో ఫలానావి ఉంటాయని అధికారులెవరూ స్పష్టంగా చెప్పనప్పటికీ, భారతీయ వంటకాల్లో వైవిధ్యాన్ని చాటేలా మెనూ ఉంటుందని భావిస్తున్నారు.

ప్రత్యేక టేబుల్ వేర్

ప్రపంచనేతలకు ఇచ్చే విందు కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. వారికి మరిచిపోలేని ఆతిథ్య అనుభూతి కల్పించేందుకు ఆహారపదార్థాలను వెండి, బంగారు పూత కలిగిన పాత్రల్లో వడ్డిస్తారు. విదేశీ నేతలు వివిధ హోటళ్లలో బస చేసినప్పుడు, రాష్ట్రపతి ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యే సమయంలో ఉపయోగించేందుకు 200 మంది కళాకారులతో 15 వేల వరకు సామగ్రిని తయారు చేయించారు. ఇందులో స్టీల్, ఇత్తడి లేదా రెండింటి మిశ్రమంతో తయారైన టేబుల్ సామగ్రికి వెండిపూత వేయించారు. విందు సమయంలో అతిథులకు బంగారు పూత వేసిన గ్లాసులలో డ్రింక్స్‌ను సర్వ్ చేస్తారు. ప్లేట్లు, స్పూన్లు తదితర వస్తువులను భారతీయ సంప్రదాయం ప్రతిబింబించేలా ఎంపిక చేశారు. జైపూర్, ఉదయ్‌పూర్, వారణాసిలతోపాటు కర్ణాటకలో వీటిని తయారు చేయించారు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీపై నిషేధం

జీ20 దృష్ట్యా ఈ నెల 8, 9, 10వ తేదీల్లో న్యూఢిల్లీలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఢిల్లీ పోలీసులు ఈ ప్రాంతంలో ఇప్పటికే ట్రాఫిక్ ఆంక్షలు ప్రకటించారు. క్లౌడ్ కిచెన్, ఫుడ్ డెలివరీలు, అమెజాన్ డెలివరీ వంటి వాణిజ్య సేవలపై ఎన్‌డీఎంసీ ప్రాంతంలో నిషేధం విధిస్తున్నట్లు స్పెషల్ పోలీస్ కమిషనర్ ఎస్ఎస్ యాదవ్ చెప్పారు. ఈ ప్రాంతంలో లాక్‌డౌన్ విధిస్తారన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అలాంటిదేమీ లేదన్నారు.

బియెన్‌వెన్యూ నుంచి బియెన్‌వెనిడో దాకా..

జీ20 శిఖరాగ్రానికి హాజరయ్యే జీ20 ప్రతినిధులు, విదేశీ అతిథులకు వారివారి భాషల్లోనే స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. జీ20 ఇతివృత్తం 'వసుధైక కుటుంబకమ్'ను జీ20 సభ్యదేశాలు, ఆహ్వానిత దేశాల భాషల్లో ముద్రించారు. దీంతోపాటు ఫ్రెంచిలో బియెన్‌వెన్యూ, టర్కిష్‌లో హోస్‌గెల్దినిజ్, జర్మన్‌లో విల్కొమెన్, ఇండోనేసియన్‌లో సెలామత్ దతంగ్, స్పానిష్‌లో బియెన్‌వెనిడో అంటూ స్వాగతాన్ని రష్యన్, మాండరిన్ భాషల్లో సైతం ముద్రించారు. దేశాల ప్రతినిధుల కోసం భారత్ మండపం కాంప్లెక్స్ 14వ నంబర్ హాలు ప్రవేశద్వారం వద్ద వీటిని ఏర్పాటు చేశారు.

ఖర్గేకు రాని విందు పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: జీ 20సదస్సులో భాగంగా శనివారం రాత్రి అతిథులకు ఇస్తున్న విందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పిలుపు రాలేదు. ప్రగతిమైదాన్‌లోని భారత మండపంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవ్వనున్న ఈ విందుకు ఖర్గేకు పిలుపు రాలేదని ఆయన కార్యాలయం ధ్రువీకరించింది. మాజీ ప్రధానులు దేవెగౌడ. మన్మోహన్ సింగ్. కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర కార్యదర్శులు, పలువురు పారిశ్రామిక వేత్తలు ఆహ్వానితుల్లో ఉన్నారు. అయితే కేబినెట్ హోదా ఉన్న రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఖర్గేకు ఆహ్వానం పంపకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎంలు నితీశ్‌కుమార్ , మమతా బెనర్జీ, కేజ్రీవాల్, భగవంత్‌మాన్, హేమంత్ సోరెన్‌లు విందుకు హాజరు అవుతున్నట్లు ప్రకటించారు. అనారోగ్య కారణంగా విందుకు హాజరుకావడంలేదని మాజీ ప్రధాని దేవెగౌడ ట్వీట్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా అనారోగ్య కారణాలతో విందుకు హాజరుకావడం లేదని సమాచారం.

నేతల బస

సదస్సుకు హాజరవుతున్న దేశాధినేతలందరికీ సెంట్రల్ ఢిల్లీలోని స్టార్‌హోటళ్లు, గురుగ్రామ్‌లో బస ఏర్పాట్లు చేశారు. సుమారు 35 వేల గదులు బుక్ చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఐటీసీ మౌర్య 14వ అంతస్తులో, చాణక్యపురిలోని తాజ్ ప్యాలెస్‌లో చైనా ప్రధాని లీ క్వియాంగ్, బ్రెజిల్ ప్రతినిధులు, షాంగ్రీలాలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్, క్లారిడ్జ్ హోటల్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఇంపీరియర్ హోటల్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్, ఒబెరాయ్ హోటల్‌లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, గురుగ్రామ్‌లోని ఒబెరాయ్ హోటల్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్, జేడబ్ల్యూ మారియట్, హయత్ రెసిడెన్సీల్లో ఇటలీ ప్రతినిధులు, లీ మెరిడియన్‌లో నెదర్లాండ్స్, నైజీరియా, యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు, లలిత్ హోటల్‌లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, గురుగ్రామ్ లీలీ హోటల్‌లో సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ బృందం బస చేయనుంది.

అతిథులకు స్వాగతం...


యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా


యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మైకెల్


అర్జెంటీనా అధ్యక్షుడు ఫెర్నాండెజ్


ఐరాస చీఫ్ గుటెరస్


దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా


అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు స్వాగతం పలుకుతున్న విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి వాణీ రావు, పక్కన ఆ శాఖ మంత్రి వీకేసింగ్


ఐఎంఎఫ్ డైరెక్టర్ క్రిస్టలినా నృత్యం


జపాన్ ప్రధాని కిషిదా


చైనా ప్రధాని లీ క్వియాంగ్


సింగపూర్ ప్రధాని లీ


బంగ్లా ప్రధాని హసీనా


ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్


ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసి


ఇటలీ ప్రధాని మెలోనీ


దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్

శిఖరాగ్ర భేటీకి శ్రీకారం

జీ20 కూటమి సదస్సుకు మొదలైన అధినేతల రాక

ఢిల్లీ డిక్లరేషన్‌పైనే అందరి దృష్టి

న్యూఢిల్లీ: అద్భుతమైన ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధనే పరమావధిగా సాగే జీ20 అగ్రరాజ్యాల కూటమి సమావేశానికి హస్తిన సర్వాంగ సుందరంగా ముస్తాబై సభ్య దేశాల అధినేతలకు సాదర స్వాగతం పలుకుతోంది. అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తదితర ప్రపంచ దేశాల ఆగమనంతో జీ20 శిఖరాగ్ర సదస్సు హడావిడి మరింత పెరిగింది. శనివారం సైతం మరికొందరు నేతలు విచ్చేస్తున్నారు. శుక్రవారం ఢిల్లీలో అడుగుపెట్టగానే బైడెన్‌తో మోదీ విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రపంచ శ్రేయస్సుకు పాటుపడతామని ప్రకటించారు. మానవ కేంద్రిత, సమ్మిళిత అభివృద్ధి దిశగా సదస్సు కొత్త బాటలుపరుస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం ప్రకటించారు. మరోవైపు ఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధమైందని, ఏకాభిప్రాయం సాధిస్తామని భారత్ ధీమా వ్యక్తంచేసింది. 9, 10 తేదీల్లో (శని, ఆదివారాల్లో) జరిగే సదస్సుకు హాజరయ్యే నేతల రాక, సాదర స్వాగతం, అతిథులకు ఆతిథ్యంతో ఢిల్లీలో కోలాహలం పెరిగింది. పసందైన వంటకాలు, భిన్న సంప్రదాయ వాయిద్యాలతో సంగీత విభావరి ఇలా పలు రకాల కార్యక్రమాలు, ప్రదర్శనలతో అధినేతలకు మరెప్పుడూ మరిచిపోలేని రీతిలో అద్భుతంగా ఆతిథ్యం ఇవ్వనున్నారు. వాతావరణ మార్పులు, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, ఆర్థిక అనిశ్చితి, మాంద్యం భయాలు వంటి కీలక అంశాలతో చర్చలు శిఖరాగ్రానికి చేరుకోనున్నాయి. ఎలాగైనా సరే సదస్సు ముగిసేనాటికి అందరి ఏకాభిప్రాయంతో సంయుక్త ప్రకటన విడుదల చేసేందుకు భారత్ శాయశక్తులా కృషిచేస్తోంది. నేడు మొదలయ్యే ఈ చర్చా సమరంలో నేతలు చివరకు ఎలాంటి వాగ్దానాలు చేస్తారో, ఏమేం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూద్దాం..!!

దుర్భేద్యమైన భద్రత

ముఖ్యనేతలంతా ఢిల్లీకి వచ్చేస్తున్న నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో ఢిల్లీలో భద్రతా బలగాలను మోహరించారు. చర్చలకు ప్రధాన వేదిక అయిన 'భారత్ మండపం ' కాంప్లెక్స్ వద్ద భద్రతను పోలీసులు, పారామిలటరీ, నిఘా వర్గాలతో కట్టుదిట్టం చేశారు. తొలిసారిగా ఇండియా ఈ సదస్సును నిర్వహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చేసేందుకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సదస్సు వివరాలను జీ20లో భారత షెర్పా అమితాబ్ కాంత్ శుక్రవారం ఢిల్లీలో వివరించారు. ' మన న్యూఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధం. దానిని ఇప్పుడు బహిర్గతం చేయలేం. ఎందుకంటే డిక్లరేషన్ తాలూకు ప్రతిపాదలను అధినేతలకు సమర్పిస్తాం. వారి సూచనలు, సవరణల తర్వాతే దానికి ఆమోదం లభిస్తుంది. ఆ తర్వాతే డిక్లరేషన్ ద్వారా సాధించబోయే విజయాలను వివరిస్తాం' అని అమితాబ్ చెప్పారు. ' ఐక్యరాజ్యసమితి తర్వాత అత్యంత క్రియాశీలకమైన కూటమిగా ఉన్న ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో చేర్చుకునేందుకు దాదాపు అందరినీ ఒప్పించడం భారతదేశ నిబద్ధతకు నిదర్శనం' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్ ఆగమనం మాకు సంతోషదాయకమే అని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైకేల్ అన్నారు. ఆఫ్రికన్ యూనియన్‌లో మొత్తంగా 55 దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

నేటి ప్రపంచానికి సరిపోయే నినాదమిది

మహా ఉపనిషత్తు నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు ఇతివృత్తం ' నేటి ప్రపంచానికి సరిపోయే నినాదమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. కాగా, చర్చల్లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రధానంగా ప్రస్తావించి చర్చించాలని బ్రిటన్ భావిస్తోంది. దీంతో ఈ చర్చలో భారత్ పాత్ర కీలకంగా మారనుంది. ' ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ, మానవ హక్కుల హననంపై ఇండియా తన నిర్ణయం వెలువరచాలని చర్చలో పట్టుబడతాం. మోదీతో, ఇతరులతో భేటీలను పుతిన్ దారుణ అకృత్యాలను ఆపేందుకు సాధనాలుగా వినియోగిస్తాం' అని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అధికార ప్రతినిధి చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో కూటమి సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలున్నా ఏకాభిప్రాయానికి ప్రయత్నిస్తామని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ చెప్పారు. కాగా, భారత్ తమకు వ్యతిరేకంగా జీ20 వేదికగా ప్రకటన చేయాలని జీ7 దేశాలు ఒత్తిడి చేస్తున్నాయని రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఆరోపించింది. డిజిటల్ మౌలిక వసతులు, వాతావరణ సంబంధ నిధులు, సుస్థిరాభివృద్ధి, శుద్ధ ఇంధనం వంటి అంశాల్లో జీ20 వేదికగా సానుకూల నిర్ణయాలు వెలువడతాయని అంతర్జాతీయ విశ్లేషకులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన కూటమి సారథ్య బాధ్యతల్ని భుజానికి ఎత్తుకున్న భారత్ అప్పట్నుంచీ దేశవ్యాప్తంగా భిన్న నగరాలు, వేదికలపై 200 సమావేశాలను నిర్వహించింది. ప్రపంచ జీడీపీలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల జనసంఖ్య జీ20 దేశాల్లోనే ఉంది. అందుకే ఈ సదస్సులో తీసుకునే నిర్ణయాలు పెను ప్రభావం చూపిస్తాయి.

జీ20 దేశాలు

అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, ద.కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా, యురోపియన్ యూనియన్

సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం

జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ తదితరులు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. సంప్రదాయ నృత్యాల నడుమ వీరికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టలినా జార్జియెవా విమానాశ్రయంలో డ్యాన్స్ చేశారు. భారతీయ సంస్కృతిపై క్రిస్టలినా చూపిన మక్కువను ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రశంసించారు. వచ్చే రెండు రోజుల్లో వివిధ దేశాల నేతలతో ఫలప్రదమైన చర్చలు జరిపేందుకు ఆసక్తితో ఉన్నట్లు ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శుక్రవారం భారత్‌కు వచ్చారు. ఆయన సతీమణి జిల్ బైడెన్ కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. బైడెన్‌కు చేసిన రెండు పరీక్షల్లోనూ నెగెటివ్‌గా రావడం పర్యటనను ఖరారు చేసుకున్నారు. ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాలకు విమానాశ్రయంలో కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజే, దర్శనా జర్దోష్ స్వాగతం పలికారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు కేంద్ర మంత్రి అశ్వినీ చౌబే, అర్జెంటీనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండెజ్‌కు కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్వాగతం పలికారు. కొమరోస్ అధ్యక్షుడు, ఆఫ్రికన్ యూనియన్ చైర్ పర్సన్ కూడా అయిన అజలి అస్సోమనీ, రష్యా విదేశాంగ మంత్రి లావ్రోవ్, ఒమన్ డిప్యూటీ ప్రధాని సయ్యిద్ ఫహద్, ఈజిప్టు అధ్యక్షుడు ఫతా ఎల్–సిసి, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, యూఏఈ ప్రెసిడెంట్ అల్ నహ్యాన్‌లకు కూడా ఘన స్వాగతం లభించింది. ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్‌కు అధికారులు స్వాగతం పలికారు. జీ20(గ్రూప్ ఆఫ్ 20)లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, తుర్కియే, యూకే, అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ)సభ్యులన్న విషయం తెలిసిందే.

బ్రిటిష్ కౌన్సిల్ విద్యార్థులతో సునాక్ ముఖాముఖి

శుక్రవారం యూకే ప్రధాని రిషి సునాక్ ఢిల్లీలోని బ్రిటిష్ కౌన్సిల్‌కు వెళ్లి సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'రక్షణ'లో బలీయ బంధం

- జీ20 సదస్సు కోసం భారత్‌కు విచ్చేసిన బైడెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- కీలక అంశాలపై ఒప్పందాలు ఖరారు !
- సంయుక్త ప్రకటన విడుదల


న్యూఢిల్లీ: భారత్, అమెరికా దేశాల మధ్య రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంయుక్తంగా ప్రకటించారు. జీ20 సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారం భారత్‌కు విచ్చేసిన బైడెన్‌ను ప్రధాని మోదీ ఢిల్లీలోని తన అధికారిక నివాసం 7, కళ్యాణ్‌మార్గ్‌కు సాదరంగా ఆహ్వానించారు. దాదాపు 50 నిమిషాలకుపైగా జరిగిన ఈ భేటీ సందర్భంగా ఇరువురు అగ్రనేతలు కీలకమైన అంశాలపై చర్చించి పలు రంగాలకు సంబంధించి ఒప్పందాలు ఖరారుచేశారు. అమెరికా నుంచి 31 అత్యాధునిక డ్రోన్ల కొనుగోలు, ఆధునిక జెట్ ఇంజిన్ల సంయుక్త తయారీపై రెండు దేశాలు అవగాహనకు వచ్చాయి. జీ20 సారథ్యం, అణుఇంధనంలో సహకారం, 6జీ, కృత్రిమ మేథ వంటి సంక్లిష్ట, అధునాతన సాంకేతికతల్లో పరస్పర సహకారం, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అమెరికా రక్షణ రంగ దిగ్గజం జనరల్ అటామిక్స్ సంస్థ నుంచి ఎంక్యూ–9బీ రకం 31 డ్రోన్లను కొనేందుకు భారత రక్షణ శాఖ పంపిన విజ్ఞప్తి లేఖకు బైడెన్ తన సమ్మతి తెలిపారు. అమెరికాలోని జీఈ ఏరోస్పేస్, భారత్‌లోని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హాల్)లు సంయుక్తంగా జీఈ ఎఫ్–414 జెట్ ఇంజన్లను భారత్‌లోనే తయారుచేసేందుకు ఇరునేతలు అంగీకరించారు. సాంకేతికత బదలాయింపు, జెట్ ఇంజన్ల తయారీకి పచ్చజెండా ఊపారు. 'జీ20 కూటమి అనేది ఏ విధంగా గొప్ప ఫలితాలను రాబట్టగలదన్న దానిని జీ20 సారథిగా భారత్ నిరూపించి చూపింది. సదస్సు తాలూకు ఫలితాలు ముందు మరిన్ని ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశిస్తాయి' అని బైడెన్ భారత్‌ను పొగిడారు. స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత ఇండో–పసిఫిక్ కోసం క్వాడ్ కూటమి అత్యావశ్యకమని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది భారత్‌లో జరిగే క్వాడ్(అమెరికా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియా) చతుర్భుజ కూటమి సదస్సుకు రావాలని బైడెన్‌ను మోదీ కోరారు. ' స్వేచ్ఛా, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, బహుళత్వం, సమాన అవకాశాలనే విలువలు రెండు దేశాల పౌరుల విజయానికి ఎంతో కీలకం. ఈ విలువలే రెండు దేశాల మైత్రి బంధాన్ని మరింత బలోపేతం చేశాయి' అని సంయుక్త ప్రకటనలో ఇరు దేశాలు పేర్కొన్నాయి. 'సదస్సు తుది నిర్ణయాలు సుస్థిరాభివృద్ధి, బహుపాక్షిక సహకారం, సమ్మిళిత ఆర్థిక విధానాల్లో ఏకరూపత సాధనకు తద్వారా పెను ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు దోహదపడతాయి' అని సంయుక్త ప్రకటన పేర్కొంది. బైడెన్‌తో చర్చలు ఫలప్రదమయ్యాయని అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఏఏ అంశాల్లో ఒప్పందం కుదిరిందంటే..

- ప్రపంచ వ్యాప్తంగా సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు బలోపేతం
- భారత్‌లో పరిశోధనాభివృద్ధి కోసం మైక్రోచిప్ టెక్నాలజీ సంస్థ దాదాపు 30 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టడం
- వచ్చే ఐదేళ్లలో అధునాతన మైక్రో డివైజ్‌ల కోసం 40 కోట్ల డాలర్ల పెట్టుబడి
- భారత్ 6జీ కూటమి, నెక్ట్స్ జీ కూటమి మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయూ)
- ఇండో–పసిఫిక్‌లో స్వేచ్ఛా వాణిజ్యం, రక్షణ కోసం మరింత సహకారం
- భద్రత, టెలీ కమ్యూనికేషన్స్ రంగాల్లో సహకారం
- సాంకేతిక రంగాల్లో కలిసి పనిచేయడం

బంగ్లా, మారిషస్ ప్రధానులతో మోదీ భేటీ

న్యూఢిల్లీ: జీ20 నేపథ్యంలో ఢిల్లీకి మొదటగా వచ్చిన నేతల్లో మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్ ఒకరు. ప్రధాని మోదీ మొట్టమొదటి సమావేశం మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్‌తోనే జరిగింది. గ్లోబల్ సౌత్ వాణిని వినిపించేందుకు కట్టుబడి ఉన్నామని ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నేతలు ప్రకటించారు. 'రెండు దేశాల నడుమ సంబంధాలు ఏర్పాటై 75 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ ఏడాదికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఫిన్‌టెక్, సాంస్కృతిక తదితర రంగాల్లో సహకారంపై చర్చించాం'అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'భారత్ దార్శనిక కార్యక్రమం 'సాగర్'లో మారిషస్ వ్యూహాత్మక కీలక భాగస్వామి. ద్వైపాక్షిక సంబంధాలను విస్తృతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు'అని పీఎంవో తెలిపింది. ప్రధాని మోదీ అనంతరం బంగ్లాదేశ్ ప్రధానమంత్రి హసీనాతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాల్లో సహకారం విస్తృతం చేసుకునేందుకు, రెండు దేశాల మధ్య కనెక్టివిటీతోపాటు వాణిజ్య సంబంధాల బలోపేతంపై చర్చించినట్లు అనంతరం ప్రధాని మోదీ తెలిపారు. 'గత తొమ్మిదేళ్లలో బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఎంతో బలోపేతమయ్యాయి. తాజాగా ప్రధాని హసీనాతో చర్చలు ఫలప్రదమయ్యాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కనెక్టివిటీ, సాంస్కృతిక రంగాలతోపాటు ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చారని పీఎంవో తెలిపింది.



జీ–20 ఆఫిషియల్ మొబైల్ యాప్‌లో దేశం అధికారిక నామం 'భారత్' అంటూ దర్శనమిచ్చిన నోట్

సభ్యదేశాలదే తుది నిర్ణయం

ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వంపై గుటెరస్

న్యూఢిల్లీ: ప్రపంచంలో సిసలైన దేశం అంటూ ఏదైనా ఉందంటే అది భారతదేశమేనని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఇండియాను 'విశ్వ దేశం(కంట్రీ ఆఫ్ ది వరల్డ్)'గా అభివర్ణించారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు శుక్రవారం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. ' అంతర్జాతీయంగా బహుళపక్ష వ్యవస్థలో భారత అత్యంత ముఖ్యమైన భాగస్వామి. అయితే ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇచ్చే ప్రక్రియలో నా పాత్ర ఏమీ లేదు. సభ్య దేశాలదే తుదినిర్ణయం' అని గుటెరస్ స్పష్టంచేశారు. 'ఐరాస భద్రతా మండలిలో, బహుపాక్షిక వ్యవస్థల్లో సంస్కరణలు తప్పనిసరి. అంతర్జాతీయ ఆర్థిక మౌలికస్వరూపం సైతం పాతదైపోయింది. ఇందులోనూ నిర్మాణాత్మకమైన సంస్కరణలు జరగాలి. అంతర్జాతీయ వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను అవి తీర్చాలి. యుద్ధాలు, సంక్షోభాలతో కాలాన్ని వృథా చేసుకోకూడదు. ఓవైపు పేదరికం, ఆకలి, అసమానతలు పెరుగుతుంటే మరోవైపు సహానుభూతి, సంఘీభావం తెలిపే గుణం తగ్గిపోతున్నాయి. మంచి కోసం అందరం కలిసికట్టుగా ముందడుగువేద్దాం' అంటూ జీ20 దేశాలను గుటెరస్ కోరారు. సమీప భవిష్యత్తులో ఉక్రెయిన్– రష్యా శాంతి ఒప్పందం వాస్తవరూపం దాలుస్తుందన్న నమ్మకం తనకు లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచం కోరుకునే గణనీయమైన మార్పుల సాధనకు భారత జీ20 సారథ్యం సాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ' ప్రపంచం ఒక వసుధైక కుటుంబంలా మనగలగాలంటే ముందుగా మనం ఒక్కటిగా నిలుద్దాం. ప్రపంచం ఇప్పుడు కీలకమైన మార్పు దశలో ఉంది. భవిష్యత్ అంతా భిన్న ధ్రువ ప్రపంచానిదే' అని ఆయన వ్యాఖ్యానించారు.

డిక్లరేషన్‌పై తొలగని ప్రతిష్టంభన

- చివరి రౌండ్ షెర్పా మధ్యవర్తిత్వ చర్చల్లోనూ దేశాల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- పర్యావరణ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం అంశాల్లో కుదరని సయోధ్య

జీ20 శిఖరాగ్ర సదస్సుకు సర్వం సిద్ధమై అగ్రరాజ్యాధినేతలు విచ్చేసి భేటీకి సిద్ధమవుతున్న వేళ ఢిల్లీ డిక్లరేషన్‌పై ఇంకా ప్రతిష్టంభన తొలగలేదు. శిఖరాగ్ర సదస్సులో దేశాధినేతల మధ్య విస్తృత స్థాయి చర్చలు పూర్తయ్యాక చివరి రోజున ఉమ్మడి తీర్మానం(ఢిల్లీ డిక్లరేషన్) విడుదల చేస్తారు. ఆ తీర్మానంలో ఏఏ అంశాలపై ఉమ్మడి నిర్ణయాలు ప్రకటించాలనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. డిక్లరేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై ఇప్పటికే ఆయా దేశాధినేతల తరఫున అధికారిక ప్రతినిధు(షెర్పా)లు పలుమార్లు కలిసికట్టుగా అంతర్గత చర్చలు జరిపారు. ఈ మంతనాల్లో ఇంతవరకు చెప్పుకోదగ్గ స్థాయిలో ఎలాంటి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోలేదు. శిఖరాగ్ర సదస్సులో అధినేతలు ఏమేం అంశాలు చర్చించాలనేది ముందే నిర్ణయం అయిపోతుంది. సదస్సు అత్యంత సాఫీగా సాగేందుకు వీలుగా ఆయా అంశాలపై అధినేతల నుంచి ఉమ్మడి నిర్ణయాలు వెలువడేందుకుగాను ముందే షెర్పాలు భారీ కసరత్తు చేస్తారు. సభ్య దేశాల అధినేతల అధికారిక ప్రతినిధులైన ఈ షెర్పాలు దౌత్యమార్గంలో అంతర్గతంగా ముందే అందరూ చర్చించుకుంటారు. దీంతో శిఖరాగ్ర సదస్సులో అధినేతలు నేరుగా కలిసి మాట్లాడేటపుడు ఆయా అంశాల లోతుల్లోకి వెళ్లరు. సూత్రప్రాయ అంగీకారం మాత్రమే తెలుపుతారు. మిగిలిన పని అంతా ముందే ఏర్పాటు చేసిపెడతారు కాబట్టి ఆతర్వాతి ప్రక్రియ సులువు అవుతుంది. అయితే, తాజాగా షెర్పాల మధ్య జరిగిన చివరి రౌండ్ చర్చల్లోనూ కొన్ని కీలక అంశాలపై సయోధ్య కుదరనే లేదు. వాటిల్లో పర్యావరణ మార్పు, ఉక్రెయిన్ యుద్ధం వంటి ప్రధాన అంశాలు ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని పేర్కొంటూ ఒక పేరాగ్రాఫ్‌లో భారత్ చేసిన ప్రతిపాదనలపై షెర్పాల చిక్కుముడి పడింది. ఉక్రెయిన్‌లో రష్యా ఆగడాలను అడ్డుకునేలా చర్యలు ఆ పేరాగ్రాఫ్‌లో లేవని అమెరికా, బ్రిటన్, యురోపియన్ యూనియన్లు వేలెత్తిచూపాయి. ఢిల్లీ డిక్లరేషన్‌లో ఉక్రెయిన్ యుద్ధం అంశంపై ఏకాభిప్రాయం తెలపాలంటే తమ డిమాండ్లు నెరవేర్చాలని అటు పశ్చిమ దేశాలు, ఇటు రష్యా-చైనా పక్ష దేశాలు పట్టుబడుతున్నాయి. దీంతో ఈ అంశంపై సమ్మతి సాధ్యపడలేదు. ఇలాంటి పరిస్థితి రాకూడదనే ముందుగానే జకార్తాలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌లు చర్చలు జరిపి డిక్లరేషన్ సంబంధ అంశాలపై చర్చించినా ఫలితం లేకపోయింది.

భారత నాయకత్వ ప్రతిష్టకు సవాల్

తొలిసారిగా జీ20 కూటమి సారథ్య బాధ్యతలు తీసుకున్న భారత్ ఈ సదస్సు తర్వాత ఎలాగైనా సరే ఉమ్మడి తీర్మానం ప్రకటించాలని చూస్తోంది. అయితే అటు పశ్చిమ దేశాలు, ఇటు రష్యా-చైనా పక్ష దేశాలు ఎవరి మంకుపట్టు వారు పట్టడంతో ఉమ్మడి తీర్మానం సాధ్యమయ్యేలా లేదు. అదే జరిగితే అంతర్జాతీయంగా భారత ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. సంయుక్త ప్రకటన సాధ్యం కాని పక్షంలో జీ20 అధ్యక్ష హోదాలో మోదీ కేవలం సారాంశ ప్రకటన విడుదల చేస్తారు.

వాతావరణ మార్పు: ఇదే అసలైన అవరోధం

చర్చల్లో ఏకాభిప్రాయానికి ప్రధాన అవరోధంగా వాతావరణ మార్పు విధానం నిలుస్తోంది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమక్రమంగా తగ్గించుకోవడం, పునరుత్పాదక ఇంధనాల వైపు మళ్లడం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు లక్ష్యాలను నిర్దేశించుకోవడం, గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను తగ్గించుకోవడం వంటి అంశాల్లో జీ20 సభ్య దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది షెర్పాల భేటీలో స్పష్టంగా కనిపించింది. 2030 కల్లా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాలను క్రమంగా పెంచుకోవాలని, 2035 ఏడాదికల్లా గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాల స్థాయిని తగ్గించుకోవాలని పశ్చిమ దేశాలు చేసిన ప్రతిపాదనలను భారత్, రష్యా, చైనా, సౌదీ అరేబియాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. శిలాజ ఇంధన ఆధారిత ఆర్థికవ్యవస్థ కలిగిన సౌదీ అరేబియా అయితే ఈ ప్రతిపాదలను ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పింది. జ్ఞానాధారిత రంగాలు, ఇతర సెక్టార్ల వైపు మళ్లేందుకు తమకు దశాబ్దాల కాలం పడుతుందని వాదిస్తోంది. వెలువడుతున్న కర్బన ఉద్గారాలు, ప్రకృతిలోకి శోషించబడుతున్న కర్బన ఉద్గారాల నిష్పత్తి సమంగా ఉండేలా అంటే కార్బన్ నెట్ జీరో(కర్బన స్థిరత్వం) సాధించేందుకు జీ7 దేశాలు తొందర పెడుతున్నాయి. శిలాజ ఇంధనాల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, వాటి ద్వారా వచ్చే విద్యుత్ సాయంతోనే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధిస్తామని ధీమాగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలు.. ఈ జీ7 దేశాల ప్రతిపాదనలను తప్పుబడుతున్నాయి. 'దశాబ్దాలుగా శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడేసి పారిశ్రామిక విప్లవంతో పశ్చిమ దేశాలు సంపన్న దేశాలుగా అవతరించాయి. ఇప్పుడు మాకు ఆ అవకాశం ఇవ్వండి. వాతావరణ మార్పుల మాటున అభివృద్ధిని అడ్డుకోకండి' అని భారత్‌సహా దేశాలు వాదిస్తు న్నాయి. 2020కల్లా వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పేద దేశాలకు ఏటా 100 బిలియన్ డాలర్ల నిధులను ఇస్తామన్న సంపన్న దేశాలు ఆ వాగ్దానాన్ని నెరవేర్చనేలేదు. ఎప్పటికల్లా సాయం చేస్తాయనేదీ స్పష్టంచేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో క్లైమేట్ పాలసీపై ఉమ్మడి నిర్ణయం ఆశించడం కష్టమే. ఇలాంటి తరుణంలో మొదలవుతున్న జీ20 సదస్సు క్లిష్టమైన కూడలిలో నిల్చుందనే చెప్పాలి. దేశ ప్రయోజనా లను పక్కనబెట్టి మానవాళి శ్రేయస్సు కోసం అగ్రనేతలు ఏ మేరకు ఉమ్మడి వాగ్దానాలు చేస్తారనేది బిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. జీ20లో ఏకాభిప్రాయం కుదరకపోతే త్వరలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగబోయే కాప్28 సదస్సులోనూ మేలైన ఫలితాలను ఆశించడం అత్యాశే అవుతుంది.

–సాక్షి నేషనల్‌డెస్క్



జీ20 మీడియా ఇంటర్నేషనల్ మీడియా సెంటర్ వద్ద సభ్య దేశాల జెండాల రెపరెపలు



జీ20 ఇతివృత్తంతో ఉన్న జెండాతో ఓ సాహసి స్కైడైవింగ్



జీ20 క్రాఫ్ట్స్ బజార్‌లో మగ్గం నేస్తున్న ఓ మహిళ

ఏకాభిప్రాయం సాధిస్తాం

ఢిల్లీ డిక్లరేషన్‌పై భారత్ ధీమా

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సుకు సంబంధించిన ఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధమైందని భారత్ ప్రకటించింది. ' ఢిల్లీ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం వస్తుందని ఆశిస్తున్నాం. ఈ దిశగా సంప్రదింపులు ముమ్మరంగా జరుగుతున్నాయి' అని భారత్ ప్రకటించింది. సదస్సుకు సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా వెల్లడించారు. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ మార్పులు వంటి అంశాల్లో సమ్మతి సాధ్యమయ్యేనా అన్న ప్రశ్నకు సరైన సమాధానం ఆయన చెప్పలేదు. ' ఆఫ్రికా యూనియన్‌కు జీ20 కూటమిలో సభ్యత్వం ఇవ్వాలా వద్దా అనే అంశంపై శనివారం జరిగే సదస్సులో నిర్ణయం తీసుకోవచ్చు' అని క్వాత్రా తెలిపారు. 'ప్రధాని మోదీకి గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రగాఢ విశ్వాసముంది. అందుకే ఆఫ్రికా యూనియన్‌ను కలుపుకుందామని జీ20 సభ్యదేశాలకు రాతపూర్వకంగా మోదీ విన్నవించుకున్నారు. ఢిల్లీ డిక్లరేషన్ అనేది గ్లోబల్ సౌత్‌కు, అభివృద్ధి దేశాలకు గొంతుకగా ఉంటుంది. జీ20కి భారత సారథ్యం సమ్మిళితంగా, లక్ష్య సాధకంగా, క్రియాశీలకంగా, నిర్ణయాత్మకంగా ఉంటుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు ' అని జీ20 షెర్పా అయిన అమితాబ్ కాంత్ చెప్పారు. ' భారత వైవిధ్య, సమాఖ్య నిర్మాణానికి గుర్తుగా ఇప్పటికే దేశవ్యాప్తంగా 60 నగరాలు, పట్టణాల్లో 220కిపైగా జీ20 సంబంధ సమావేశాలు జరిగాయని అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు. అగ్ర నేతలు పాల్గొనే సెషన్స్‌లు మూడు విడిగా జరుగుతాయి. వీటికి ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అని నామకరణం చేశారు. శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అగ్రనేతల గౌరవార్థం విందు ఇవ్వనున్నారు. జీ20 నేతలంతా రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి ఘన నివాళులు అర్పించనున్నారు. ప్రపంచ రాజకీయ భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితి, సమ్మిళిత వృద్ధి, ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణంలో పెను మార్పులు, గ్లోబల్ సౌత్ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర కీలక అంశాలు నేతల మధ్య భేటీలో చర్చకు రానున్నాయి. మోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్, జర్మనీ చాన్స్‌లర్ స్కోల్జ్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్ సహా ఇతర దేశాల నేతలు, ఈయూ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఓఈసీడీ, ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల చీఫ్‌లు హాజరుకానున్నారు.

కేంద్రం వైఖరిని సమర్థిస్తున్నాం

ఉక్రెయిన్ సంక్షోభంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



లండన్: రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరిని పూర్తిగా సమర్థిస్తున్నామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. విశాలమైన దేశం అయినందున ప్రపంచదేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం భారత్‌కు సహజంగానే ఉంటుందని చెప్పారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న వైఖరికి రష్యా నుంచి చమురు సరఫరాయే కారణమా అన్న మీడియా ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. 'రష్యాతో మాకు సంబంధాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విషయంలో ప్రభుత్వ, ప్రతిపక్షం వైఖరి భిన్నంగా ఉంటుందని నేను భావించడం లేదు'అని వివరించారు. రష్యా నుంచి దూరంగా తమవైపు భారత్‌ను లాక్కునేందుకు పశ్చిమ దేశాల నేతలు ప్రయత్నించారా అన్న ప్రశ్నకు రాహుల్ గాంధీ.. ''వాస్తవానికి భారత్‌కు రష్యాతో సత్సంబంధాలున్నాయి. అదేవిధంగా అమెరికాతోనూ సంబంధాలున్నాయి. భారత్ విశాల దేశం. పెద్ద దేశం కావడం వల్ల అనేక ఇతర దేశాలతో వివిధ స్థాయిల్లో సంబంధాలు కొనసాగుతున్నాయి. ఎవ్వరితోనైనా సంబంధాలు కొనసాగించే హక్కు భారత్‌కు ఉంది'అని రాహుల్ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ద్వారా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు విషయంలో ప్రతిపక్షం వైఖరిపై ఆయన..కశ్మీర్ అభివృద్ధిని కాంగ్రెస్ గట్టిగా కోరుతోంది. అక్కడ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తోంది'అని రాహుల్ వివరించారు. కశ్మీర్ అంశం పరిష్కారానికి అంతర్జాతీయ దౌత్యం అవసరమని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు రాహుల్ సూటిగా సమాధానమిచ్చారు. వాస్తవానికి కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. కశ్మీర్ మా సొంత విషయం. అందులో భారత్‌కు తప్ప మరెవ్వరి జోక్యం అవసరం లేదు'అని కుండబద్దలు కొట్టారు.

ఉప పోరులో మిశ్రమ ఫలితాలు

బీజేపీకి 3, ఇండియా కూటమికి 4 సీట్లు

లక్నో/అగర్తలా: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వెల్లడయ్యాయి. అధికార బీజేపీ మూడు, ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు నాలుగు సీట్లు గెలుచుకున్నాయి. ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్, త్రిపురలోని ధన్‌పూర్ సీట్లను బీజేపీ నిలబెట్టుకోవడంతోపాటు త్రిపురలోని బొక్సానగర్ స్థానాన్ని సీపీఐ నుంచి కైవసం చేసుకుంది. బెంగాల్‌లోని ధుప్‌గురిలో జరిగిన ముక్కోణపు పోటీలో టీఎంసీ అభ్యర్థి గెలిచారు. ఇక్కడ ఇండియా కూటమి అభ్యర్థి కూడా బరిలో ఉన్నప్పటికీ, బీజేపీ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చారు. ఇక కేరళలోని పుత్తుప్పల్లి సీటును ప్రతిపక్ష కాంగ్రెస్-యూడీఎఫ్ కూటమికి చెందిన చాందీ ఊమెన్ గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన దిగ్గజ నేత ఊమెన్ చాందీ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఊమెన్ చాందీ కొడుకే చాందీ ఊమెన్. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఇండియా కూటమిలోనివే అయినప్పటికీ ఇక్కడ పరస్పరం తలపడటం గమనార్హం. ఇండియా కూటమిలోని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) జార్ఖండ్‌లోని దుమ్రి సీటును నిలబెట్టుకుంది. యూపీలోని ఘోసి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఇండియా కూటమి బలపరిచిన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి బీజేపీకి చెందిన సమీప ప్రత్యర్థిపై గెలిచారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ ఉమ్మడి పోరు


బనశంకరి: వచ్చే లోక్‌సభ ఎన్నికలను బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఉమ్మడిగా ఎదుర్కొనున్నాయని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ప్రకటించారు. ఢిల్లీలో జేడీఎస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చలు జరిపారన్నారు. యడియూరప్ప శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అయిదు వరకు ఎంపీ స్థానాలను జేడీఎస్‌కు కేటాయించడానికి అమిత్ షా సమ్మతించారని తెలిపారు.

'లొకేషన్'తో ప్రైవసీ చిక్కులు!

నిరంతరం ఆన్ చేసి పెట్టవద్దంటున్న సైబర్ నిపుణులు

- అన్ని యాప్‌లకు లొకేషన్ పర్మిషన్లు ఇవ్వొద్దని స్పష్టీకరణ
- లేకుంటే మనం ఎక్కడున్నాం, ఎంత సేపు ఉన్నాం, ఎటు వెళ్తున్నామన్న డేటా ఆయా సంస్థలకు చేరిపోతుందని వెల్లడి
- అవసరమైతే యాప్‌ల వినియోగం తర్వాత ఆఫ్ చేసేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: 'లొకేషన్ పంపు.. నేను వచ్చేస్తా..' ఎవరినైనా కలవడానికి వెళ్తేనో, కొత్త ప్రదేశానికి వెళ్తేనో ఈ మాట తప్పకుండా వినిపిస్తుంది. ఎవరికైనా మనం ఎక్కడున్నామో అడ్రస్ చెప్పాలన్నా.. కొత్త ప్రాంతంలో నిర్దిష్టమైన ప్రాంతానికి వెళ్లాలన్నా ఈ లొకేషన్ ఫీచర్ ఎంతో ప్రయోజనకరం. పెద్దగా తికమక పడాల్సిన అవసరం లేకుండానే అవసరమైన ప్రదేశానికి చేరుకోవచ్చు. కానీ ఇది ఎంత సౌకర్యవంతమో అంతే స్థాయిలో ఇబ్బందికరం కూడా అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది మన ప్రైవసీని దెబ్బ తీస్తుందని.. మనం ఎక్కడున్నాం, ఎక్కడికి వెళ్తున్నాం, ఎక్కడ ఎంత సేపు ఉన్నామనే ప్రతి అంశం ఈ లొకేషన్‌తో తెలిసిపోతుందని స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు మనం ఏదైనా షాపింగ్ మాల్‌కు వెళ్లామా? సినిమా థియేటర్‌లో ఉన్నామా? ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్లామా? అన్న వివరాలు గూగుల్‌తో పాటు మన ఫోన్‌లోని వివిధ యాప్ సంస్థలకు చేరిపోతాయి. ఇది మన వ్యక్తిగత అంశాలను బహిరంగం చేయడమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల అవసరమైనప్పుడు మాత్రమే మన మొబైల్ ఫోన్లలోని లొకేషన్‌ను ఆన్ చేసుకోవాలని.. తర్వాత ఆఫ్ చేసి పెట్టడం వల్ల మనపై ఎవరూ నిఘా పెట్టకుండా ఉంటుందని వివరిస్తున్నారు.



నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలివీ..

→ మొబైల్ ఫోన్లలోని అన్ని అప్లికేషన్స్ (యాప్‌ల)కు లొకేషన్ సర్వీసెస్ అనుమతులు (పర్మిషన్) ఇవ్వొద్దు.

→ అపరిచిత, అనుమానాస్పద యాప్‌లకు మన లొకేషన్ యాక్సెస్ ఇస్తే.. అది మన వ్యక్తిగత భద్రతకు ముప్పుగా మారుతుంది.

→ కొన్ని యాప్‌లకు మనం ఇచ్చే పర్మిషన్లతో.. మన లొకేషన్ వివరాలు తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం, మన కదలికలపై నిఘా పెట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

→ లొకేషన్ ఆన్‌లో ఉండటంతో మనం ఎప్పుడు ఎక్కడ ఉంటున్నామన్న సమాచారం ఇతరులకు సులువుగా తెలిసే అవకాశం ఉంది.

→ లొకేషన్‌ను ఆధారంగా చేసుకుని కొందరు ఆకతాయిలు వేధింపులకు పాల్పడే ప్రమాదం ఉంటుంది.

→ మొబైల్‌లో ఎప్పుడూ లొకేషన్ ఆన్‌లో ఉండటం వల్ల బ్యాగ్రౌండ్‌లో ఈ యాప్ పనిచేస్తూ, బ్యాటరీలో చార్జింగ్ త్వరగా తగ్గుతుంది. మొబైల్‌లో డేటా కూడా త్వరగా అయిపోయే అవకాశం ఉంటుంది.

ఎన్నికల రిపోర్టింగ్ ఎలా..

గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ పోల్‌చెక్ ఎలక్షన్ అకాడమీ సారథ్యంలో జర్నలిస్టులకు శిక్షణ

Google News Initiative POLLCHECK 2023

సాక్షి, హైదరాబాద్: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'ద గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ ఇండియా ట్రైనింగ్ నెట్‌వర్క్' ఎన్నికలను కవర్ చేసే జర్నలిస్టుల కోసం 'గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ పోల్ చెక్ ఎలక్షన్ అకాడమీ 2023' మొదటి సెషన్ నిర్వహించింది. శుక్రవారం నగరంలోని సెయింట్ మేరీస్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన జర్నలిస్టుల నేతృత్వంలో పలు విషయాలపై ఆన్‌లైన్ వెరిఫికేషన్, వీడియో స్టోరీ టెల్లింగ్, డిజిటల్ సేఫ్టీ, న్యూస్ ఫర్ న్యూస్, మీడియా లిటరసీ, డేటా జర్నలిజం వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల రిపోర్టింగ్ నైపుణ్యాలపై జర్నలిస్టులను సన్నద్ధం చేసేందుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు సుధాకర్ రెడ్డి ఉడుముల డిజిటల్ ఇన్వెస్టిగేషన్, వెరిఫికేషన్‌పై కీలకోపన్యాసం ఇచ్చారు. ఇన్ ఓల్డ్ న్యూస్ సహ-వ్యవస్థాపకులు సంషే బిస్వాస్, మనోన్ వెర్పోట్ ఎన్నికల సమయంలో వీడియో స్టోరీ టెల్లింగ్‌పై వివరించారు. ఎన్నికల కవరేజీలో మొబైల్ జర్నలిజం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఎన్నికల సమయంలో కీలక సమాచారాన్ని ఎలా నివేదించాలనే అంశంపై ఈ సెషన్‌లో చర్చించారు.

టైరు పేలి.. మంటలు చెలరేగి..

- ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం
- ప్రమాద సమయంలో బస్సులో 26మంది
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



దగ్ధమవుతున్న బస్సు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం నార్కట్‌పల్లి-అద్దంకి రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ నుంచి 26 మంది నెల్లూరు జిల్లా ఏఎస్ పేటలోని దర్గాను దర్శించుకునేందుకు వేమూరి కావేరి ట్రావెల్ బస్సును బుక్ చేసుకుని గురువారం రాత్రి బయల్దేరారు. శుక్రవారం తెల్లవారుజామున మిర్యాలగూడ హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే బస్సు వెనుక టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. బస్సు రోడ్డుపై రాసుకోవడంతో మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కకు నిలిపాడు. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను బస్సు నుంచి దింపి వేశారు. బస్సులోని మూడు బకెట్లతో నీటిని చల్లినా మంటలు అదుపులోకి రాకపోగా.. క్షణాల్లో డీజిల్ ట్యాంక్‌కు మంటలు వ్యాపించి బస్సు మొత్తం కాలిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చేలోపు బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ బస్సు.. రోడ్డు పక్కన నిలిపిఉన్న ఉల్లిగడ్డల లోడు లారీ పక్కనే ఆగిపోయింది. దీంతో లోడుపై కప్పిన టార్పాలిన్‌కు మంటలు అంటుకుని ఆ లారీకి కూడా వ్యాపించాయి. అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 26 మందిని సకాలంలో కిందకు దింపడంతో ప్రాణ నష్టం తప్పింది. అనంతరం వీరందరినీ వేరే వాహనంలో పంపించారు.

పోలీసు స్టిక్కర్ తగిలించి.. గంజాయి తరలించి

- 58.5 కిలోల పట్టివేత
- పోలీసుల అదుపులో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్ రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ ఏజెన్సీ నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని బాలానగర్ ఎస్‌వోటీ, రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి అందించిన వివరాలివి. మహారాష్ట్ర బద్లాపూర్‌కు చెందిన ధీరజ్ మున్నాలా డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేస్తుంటాడు. అందులో సరైన ఆదాయం రాకపోవడంతో స్నేహితుడు ప్రశాంత్ సంజయ్ షిండేతో కలిసి విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించాలని నిర్ణయించాడు. ఇన్నోవా కారు అద్దెకు తీసుకొని ఇద్దరూ విశాఖ ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వినయ్ మండల్ ద్వారా కిలో రూ.3 వేల చొప్పున 58.5 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. వాటిని 39 ప్యాకెట్లుగా విభజించి కారులో పెట్టుకుని మహారాష్ట్రకు బయల్దేరారు. వీరు గంజాయి తరలిస్తున్నట్లు గురువారం సాయంత్రం బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు, రామచంద్రాపురం పోలీసులకు సమాచారం అందింది. దీంతో రామచంద్రాపురం పట్టణ పరిధిలోని ఇక్రిశాట్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న ధీరజ్ మున్నాలా జైస్వాల్, ప్రశాంత్ సంజయ్ షిండేలను అదుపులోకి తీసుకొని విచారించగా విషయం బయటపడింది. కాగా ఇన్నోవా వాహనానికి నంబర్ ప్లేట్ మార్చి, ముందు భాగంలో పోలీస్ స్టిక్కర్‌ను పెట్టుకొని గంజాయిని తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. దాంతో వారి వద్ద నుంచి రూ.11 లక్షల 70 వేల విలువైన 58.8 కిలోల గంజాయిని, ఇన్నోవా కారు, డూప్లికేట్ నంబర్ ప్లేట్, కొడవలి, మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ గడ్డ నుంచి గర్వించదగ్గ న్యాయకోవిదులు వచ్చారు..

- వారి వారసత్వాన్ని న్యాయవాదులు కొనసాగించాలి
- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి పిలుపు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిని సన్మానిస్తున్న హెచ్‌సీఏఏ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, హెచ్‌సీఏఏ ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, ప్రదీప్, దేవేందర్, నాగులూరి కృష్ణకుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఈ తెలంగాణ గడ్డ నుంచి దేశం గర్వపడేలా ఎందరో న్యాయకోవిదులు వచ్చారని, వారి వారసత్వాన్ని కొనసాగించాలని న్యాయవాదులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి పిలుపునిచ్చారు. తనకు 30 ఏళ్లకుపైగా ఈ కోర్టుతో అనుబంధం ఉందన్నారు. అంకితభావంతో పనిచేస్తే న్యాయవాదులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ఇటీవల సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ భట్టి మాట్లాడుతూ తన అన్న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయినప్పుడు తొలిసారి ఈ కోర్టుకు వచ్చానని, అప్పుడే న్యాయవాది కావాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. మొదటి కోర్టు హాల్‌లో ఎక్కువగా ఉండటంతో లభించిన గుర్తింపు కూడా హైకోర్టు జడ్జి కావడానికి దోహదపడిందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, పలువురు న్యాయమూర్తులతోపాటు బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, పీపీ రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, ప్రదీప్, దేవేందర్, నాగులూరి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామసుందర్, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు శుక్రవారం దర్శించుకున్నారు.



జస్టిస్ శ్యామసుందర్



జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు

సీఎం కేసీఆర్.. స్ట్రాంగ్ పొలిటీషియన్

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యలు

- పుదుచ్చేరిలో 20 మంది ఐఏఎస్‌లతో పనిచేయిస్తున్నా.. ఇక్కడ మాత్రం ఐఏఎస్‌లు రారు
- గవర్నర్‌గా ఐదో ఏడాదిలో అడుగిడుతున్న సందర్భంగా కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరించిన తమిళిసై



కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా స్ట్రాంగ్ పొలిటీషియన్ (బలమైన రాజకీయవేత్త). రాజకీయాల్లో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. గవర్నర్‌గా నా నాలుగేళ్ల పదవీ కాలానికి ముందు అలాంటి సీఎంను చూడలేదు. ఆయన్ను చూసిన తర్వాత ఎన్నో విషయాలు నేర్చుకున్నా. చాలా అంశాలను పరిశీలించా. నేర్చుకోవడానికి చాలా దొరికింది..' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. 'సీఎం కేసీఆర్‌తో పనిచేస్తే దేశంలో ఏ సీఎంతోనైనా పనిచేయగలుగుతా.., నా ఫోన్లను ట్యాప్ చేస్తున్నారు..' అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలకు కట్టుబడి ఉంటారా? అని జర్నలిస్టులు ప్రశ్నించగా ఆమె పైవిధంగా స్పందించారు. అప్పట్లో అనుమానాలుండడంతో అలా చెప్పినట్టు వివరించారు. తాను పదేపదే పాత వివాదాల్లోకి వెళ్లాలనుకోవడం లేదని, కొంత సత్సంబంధాలు అవసరమని అన్నారు. ప్రధాని రాష్ట్రానికి వస్తే సీఎం ఎందుకు వెళ్లరని ప్రశ్నించారు. కేంద్రంతో సత్సంబంధాలు అవసరమని అన్నారు. రాష్ట్ర గవర్నర్‌గా ఐదో ఏడాదిలో అడుగిడుతున్న సందర్భంగా శుక్రవారం రాజ్‌భవన్‌లో కాఫీ టేబుల్ బుక్‌ను ఆమె ఆవిష్కరించారు. జాతీయ విద్యా విధానంపై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు బదులిచ్చారు.

తెలంగాణలో కొన్ని పథకాలు చాలా భేష్

'తెలంగాణలో కొన్ని పథకాలు చాలా బాగున్నాయి. అయితే తెలంగాణ ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పాటైనందున, ఆ ఆకాంక్షలన్నీ నెరవేరేలా ప్రభుత్వం కష్టపడి పనిచేయాలి. రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య దూరాన్ని ఎన్నడూ చూడలేదు. రెండూ చాలా దగ్గరగానే ఉన్నాయి. ఎన్ని కిలోమీటర్ల దూరం ఉందో నేను కొలిచి చూడను. ప్రతి విషయంలో నేను వేలు పెట్టను. కొన్ని సార్లు ప్రభుత్వం నుంచి మద్దతు లభించి, మరి కొన్ని సార్లు లభించకపోయినా నా బాధ్యతలను నిర్వర్తిస్తున్నా. ప్రభుత్వం నుంచి నాకు ఆహ్వానం ఉంటే గౌరవించి వెళ్తా.

ఆర్టీసీ బిల్లుపై త్వరలో నిర్ణయం

విభేదాలతో బిల్లులను పాస్ చేయట్లేదన్నది పూర్తిగా అవాస్తవం. నేను బిల్లులన్నీ చదివి న్యాయ సలహా తీసుకుంటా. చిన్న లోపం ఉన్నా సరిచేయాలని కోరతా. కొన్ని బిల్లులు పాస్ అయ్యాయి. కొన్ని బిల్లుల్లో లోపాలుంటేనే పాస్ చేయలేదు. ఆర్టీసీ బిల్లుపై కొన్ని అనుమానాలుంటే నివృత్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరా. ఆ బిల్లు గురువారం న్యాయశాఖ నుంచి రాజ్‌భవన్‌కు తిరిగి వచ్చింది. పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటా. ప్రజల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే నా ధ్యేయం. నాకంటూ ఓ భావజాలం ఉన్నా వివక్షతో వ్యవహరించడం లేదు. ఒకవేళ నేను ప్రభుత్వంతో పోరాటం చేసినా అది ప్రజల కోసమే. నా సలహాలను సానుకూల దృక్పథంతో చూడాలి..' అని తమిళిసై సూచించారు.

కోర్టు కేసులతో కట్టడి చేయలేరు

'నేను సవాళ్లకు, ప్రతిబంధకాలకు భయపడను. కోర్టు కేసులు, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, కువిమర్శలతో నన్ను కట్టడి చేయలేరు. ఈ సవాళ్లను అధిగమించి రాజ్యాంగ పరిరక్షకురాలిగా నా విధులు, బాధ్యతలను నిర్వర్తిస్తా. ప్రజల విజయమే నా విజయం. ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం నా శక్తివంచన లేకుండా పనిచేస్తున్నా. తెలంగాణ ప్రజలతో నా బంధం అసాధారణమైనది. సవాళ్లు ఎదురైనా ఇక్కడి ప్రజలకు సేవ చేయాలని బలంగా కోరుకుంటున్నా. మళ్లీ క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించే విషయంలో దైవ నిర్ణయాన్ని అనుసరిస్తా. అయితే నాకు రిటైర్మెంట్ అనే పదం నచ్చదు. ప్రజాసేవను కొనసాగిస్తా. ఎక్కడున్నా తెలంగాణ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తా. నేను పుట్టింది, తెలంగాణ ఆవిర్భవించింది ఒకే రోజు..' అని గవర్నర్ గుర్తుచేశారు

పుదుచ్చేరిలో ప్రతినెలా ప్రజా దర్బార్

'నేను ఏ పనిని ప్రారంభించినా పుదుచ్చేరి సీఎస్ అన్ని రకాలుగా విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తారు. పుదుచ్చేరిలో 20 మంది ఐఏఎస్ అధికారులతో పనిచేయిస్తున్నా. అక్కడ ప్రతి నెలా 15న రాజ్‌భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తాం. అన్ని శాఖల అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడికి వచ్చే ప్రజలను కలుసుకుంటారు. ఇక్కడ అలా చేస్తే రాజకీయంగా చూస్తారు. తెలంగాణలో నేను ఎక్కడికైనా వెళ్తే ఐఏఎస్ అధికారులు రారు..' అని అన్నారు.

వైద్యం ప్రతి ఒక్కరికీ అందాలి

'తెలంగాణ వైద్య రంగానికి హబ్‌గా మారిందనడంతో నేను విభేదించను. రాష్ట్రం బాగానే పనిచేసింది. కానీ ఇంకా చేయాల్సినవి ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులోకి ఉండాలి. కొన్ని ఆస్పత్రులు మెరుగైనా, ఇంకా కొన్ని మెరుగు కావాల్సి ఉంది. నేను ఉస్మానియా వైద్య కళాశాలకు వెళ్లి చూస్తే చాలా సమస్యలు కనిపించాయి. ఆయుష్మాన్ భారత్, ఇతర గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రజలకు అనుకున్నంతగా చేరడం లేదు..' అని చెప్పారు.

పరిశీలనలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం

'గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని నిర్దిష్ట అర్హతలుంటే ఎలాంటి సంకోచం లేకుండా ఆమోదిస్తా. ఇందుకు కొన్ని అర్హత ప్రమాణాలుంటాయి. గతంలో సామాజిక సేవ కేటగిరీలో ఒకరి అభ్యర్థిత్వానికి అర్హతలు లేకుంటే ఆమోదించలేదు. ప్రభుత్వం అతని స్థానంలో మరొకరిని ప్రతిపాదిస్తే వెంటనే ఆమోదించా. ప్రతిపాదనల పరిశీలనకు కొంత సమయం కావాలి. తక్షణమే ఎవరూ ఆమోదించరు. జాప్యం చేయాలనేది ఉద్దేశం కాదు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి..' అని గవర్నర్ తెలిపారు.

సనాతన ధర్మంలో మంచి విషయాలూ ఉన్నాయి

'సనాతన ధర్మాన్ని గణనీయ సంఖ్యలో ప్రజలు అనుసరిస్తున్నారు. ఆ వర్గం వారిని అవమానించడం తగదు. సనాతన ధర్మం అంటే కేవలం కులాల విభజన మాత్రమే కాదు. ఇంకా చాలా మంచి అంశాలూ ఉన్నాయి. రాజకీయ ప్రయోజనం కలుగుతుందని 50 ఏళ్లుగా అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. దీపావళి, కృష్ణ జయంతి వంటి హిందూ పండుగలకు తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలపరు..' అని విమర్శించారు.

జమిలి ఎన్నికలు, 'భారత్' పేరుకు మద్దతు

జమిలి ఎన్నికలతో వ్యయం తగ్గుతుందని, పొదుపు చేసిన డబ్బుతో అన్ని రాష్ట్రాల్లో విద్యకు పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయించవచ్చని తమిళిసై అన్నారు. మహిళా బిల్లుకు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత ఎప్పటినుంచి మాట్లాడుతున్నారో తనకు తెలియదని, కానీ మహిళగా తాను ఎప్పటినుంచో ఆ బిల్లుకు మద్దతిస్తున్నానని చెప్పారు. దేశం పేరును భారత్‌గా మార్చే కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు మద్దతు తెలిపారు. తమిళంలో భారతదేశం అనే అంటారని చెప్పారు.

ఏపీ విద్యార్థులకు బంగారు భవిత

- నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రైమర్
- పుళ్ల, కొవ్వలి హైస్కూల్లో పాల్ ప్రాజెక్టు అమలు పరిశీలన



కొవ్వలి ఉన్నత పాఠశాల తరగతి గదిలో నోబెల్ గ్రహీత క్రైమర్ బృందం

భీమడోలు/దెందులూరు: ఏపీ ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని నోబెల్ అవార్డు గ్రహీత (అర్థ శాస్త్రం) ప్రొఫెసర్ మైకేల్ రాబర్ట్ క్రైమర్ చెప్పారు. విద్యారంగంలో పథకాలు, సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. వీటి సత్ఫలితాలు భవిష్యత్తులో ప్రతి ఒక్కరం చూస్తామని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న ఏలూరు జిల్లా భీమడోలు మండలం పుళ్ల, దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం షికాగోలోని దిల్ యూనివర్సిటీకి చెందిన ఎమిలీ క్యుపిటో బృందంలోని ఐదుగురు సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు, టీచర్లకు గణిత విద్యాబోధన, వాటిలోని మెళకువలను నేర్చుకునేందుకు అందజేసిన గణిత ట్యాబ్‌ల పనితీరును పరిశీలించారు. బైజూస్ ట్యాబ్‌లను 8వ తరగతి చిన్నారులు అర్థవంతంగా వినియోగించడం చూసి మెచ్చుకున్నారు. 8, 9 తరగతి గదుల్లోని చిన్నారులు గణిత ట్యాబ్‌ల వినియోగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.



విస్తరాకుల తయారీని పరిశీలిస్తున్న గవర్నర్

పల్లె పిల్లల్ని చదివిస్తే గౌరవ జీవనం: తమిళిసై

ఏజీవర్సిటీ (హైదరాబాద్): గ్రామీణ పేదలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందాలని.. పిల్లలను బాగా చదివించి గౌరవంగా బతకాలని గవర్నర్ తమిళిసై కోరారు. గవర్నర్ తమిళిసై గిరిజన ప్రాంతాలైన భద్రాచలం, ఆదిలాబాద్ జిల్లాల్లోని 6 గ్రామాలను దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ గ్రామాలకు చెందిన నిరుపేద గిరిజన గ్రామాల యువకులకు రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లోని రూరల్ టెక్నాలజీ పార్క్(ఆర్‌టీపీ)లో విస్తరాకుల తయారీపై శిక్షణ ఇప్పించారు. శుక్రవారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె యువకులతో ముచ్చటించారు. తమకు మెషీన్లతో పాటు ముడిసరుకులు, మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఎవరికేది ఇష్టమో గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలని అధికారులకు గవర్నర్ సూచించారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్



బాల్కొండ: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 72 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు 20 గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం1,091(90 టీఎంసీలు) అడుగులు కాగా.. అంతే స్థాయి నీటిమట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

బాబు ముఠా పరార్...

మొదటి పేజీ తరువాయి

మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తాలకు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేయడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. దీంతో చంద్రబాబు ఆదేశాలతో ఆయన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని హఠాత్తుగా విదేశాలకు పరారయ్యారు. మరో బినామీ యోగేశ్ గుప్తా ఆచూకీ తెలియడం లేదు.

ఆ ముగ్గురే కీలకం..

తన అవినీతి పాపాలు పండటంతో చంద్రబాబు రోజుకో ఎత్తుగడ వేస్తున్నారు. తాను అధికారంలో ఉండగా యథేచ్ఛగా సాగించిన అవినీతి వ్యవహారాలను కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఒక్కొక్కటిగా వెలికి తీయడంతో తప్పించుకునే దారి లేక సానుభూతి నాటకాలకు తెర తీశారు. రాజధాని అమరావతిలో తాత్కాలిక భవనాలు, పేదల టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో రూ.8 వేల కోట్లకుపైగా విలువైన కాంట్రాక్టుల కేటాయింపులో షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు ముడుపులు అందుకున్న వైనాన్ని ఆదాయపన్ను శాఖ ఆధారాలతో సహా వెలికి తీసిన విషయం తెలిసిందే. ఇందులో కీలక పాత్ర పోషించిన బాబు సన్నిహితులైన ముగ్గురు నిందితులే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో కూడా షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించినట్లు సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేటతెల్లం చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించారని నిగ్గు తేల్చింది. వారు ముగ్గురూ చంద్రబాబు సన్నిహితులేనని తేలడంతో నోటీసులు జారీ చేసింది. మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాలను ఈ నెల 11న, పెండ్యాల శ్రీనివాస్‌ను ఈ నెల 14న విజయవాడలో విచారణకు హాజరుకావాలని ఈ మెయిల్ ద్వారా నోటీసులు పంపింది. ఈ క్రమంలో ఆ ముగ్గురూ హఠాత్తుగా అదృశ్యం కావడం, ఇద్దరు నిందితులు ఏకంగా దేశం విడిచి పరారు కావడం ఈ కుంభకోణాలకు సూత్రధారి చంద్రబాబేనని స్పష్టం చేస్తోంది.

పాత్రలు ఫినిష్..!..: అక్రమ నిధులు తరలించేందుకు తాను ఏర్పాటు చేసుకున్న అవినీతి నెట్‌వర్క్‌ను కేంద్ర ఆదాయపన్ను శాఖ, సీఐడీ సిట్ ఛేదించడంతో చంద్రబాబుకు దారులు మూసుకుపోయాయి. అప్పటికే మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాల వాంగ్మూలాన్ని ఆదాయ పన్ను శాఖ నమోదు చేసింది. తాము చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్ ద్వారా ఆయనకు భారీగా ముడుపులు అందించినట్లు వాంగ్మూలంలో వారు అంగీకరించారు. ఈ నేపథ్యంలో అక్రమ ఆదాయంపై ఆదాయ పన్ను శాఖ సమాచారంతో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇంతలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తన సన్నిహితులు ముగ్గురికీ సిట్ నోటీసులు జారీ చేస్తుందని చంద్రబాబు ఊహించలేదు. దీంతో ఏ క్షణంలో ఏమైనా జరగవచ్చని ఆయన ఊహించారు. అందుకే తనను 2 రోజుల్లో అరెస్టు చేయవచ్చంటూ తాజాగా బాబు అన్నారు. తనను అరెస్టు చేస్తే రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలని ఆయన టీడీపీ శ్రేణులకు పరోక్షంగా సందేశమిచ్చారు. ఒకవైపు ఈ కుట్రలకు వ్యూహరచన చేస్తూనే మరోవైపు తన సన్నిహితులు మనోజ్ వాసుదేవ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, పెండ్యాల శ్రీనివాస్ సిట్ విచారణకు హాజరైతే అక్రమాల చిట్టా బద్దలవుతుందనే భయంతో వారిని విదేశాలకు పారిపోవాలని బాబు ఆదేశించినట్లు సమాచారం.

అమెరికాకు శ్రీనివాస్... దుబాయ్‌కి మనోజ్

చంద్రబాబు ఆదేశాలతో ఆయన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అప్పటికప్పుడే హఠాత్తుగా అమెరికాకు పరారయ్యారు. సిట్ నోటీసులు అందినట్లు ఆయన కుమార్తె తెలిపారు. నోటీసులపై ఆమె సంతకం కూడా చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో చంద్రబాబు పీఎస్ అందుబాటులో లేకుండా పోయారు. ఆ తరువాత అమెరికా వెళ్లిపోయారు. అంటే నోటీసులు అందడంతోనే పెండ్యాల శ్రీనివాస్ పరారైనట్లు స్పష్టమవుతోంది. ఇక మనోజ్ పార్థసాని దుబాయ్‌కి ఉడాయించారు. ఆయన ముంబై నుంచి దుబాయ్ వెళ్లిపోయారు. తనకు సీఐడీ నోటీసులు జారీ చేసిందనే విషయం తెలియగానే ఆయన అందుబాటులో లేకుండా పోయారు. అనంతరం హడావుడిగా దుబాయ్‌కి పరారయ్యారు. అక్కడ నుంచి ఆయన ఎక్కడకు వెళ్తారన్నది సన్నిహితులకు కూడా చెప్పకుండా అత్యంత గోప్యంగా ఉంచారు. మరోవైపు షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఆచూకీ తెలియడం లేదు. ఆయన ఎక్కడ ఉన్నారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. సీఐడీ నోటీసులు జారీ చేసిన వెంటనే చంద్రబాబు సన్నిహితులు ముగ్గురూ హఠాత్తుగా అదృశ్యం కావడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారన్న దానికి ఇదే తిరుగులేని నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజా పరిణామాలతో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సీఐడీ అధికారులు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు.

క్లుప్తంగా...

12న శ్రీవారి బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. అలాగే 11న తేదీన సిఫారసు లేఖలు స్వీకరించబోమని ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో స్వయంగా వచ్చే కాటేజీ దాతలకు మాత్రమే గదులు కేటాయించనున్నారు.

సీతమ్మ, గౌరవెల్లి ప్రాజెక్టుల వద్ద సీసీ కెమెరాలు

గోదావరి బోర్డు చర్యలు

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులు లేనందున గౌరవెల్లి రిజర్వాయర్, సీతమ్మసాగర్ బ్యారేజీ పనులను కొనసాగించకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) జారీ చేసిన ఆదేశాల అమలుకు గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చర్యలు చేపట్టింది. ప్రాజెక్టుల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పనులు కొనసాగించకుండా పర్యవేక్షించాలని ఎన్జీటీ ఆదేశించింది. ఎన్జీటీ ఆదేశాల అమలులో భాగంగా ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరి బోర్డు చైర్మన్ ముకేశ్‌కుమార్ సిన్హా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించనున్నారు. సమావేశానికి హాజరుకావాలని కరీంనగర్ ఈఎన్సీ శంకర్, కొత్తగూడెం సీఈ శ్రీనివాస్ రెడ్డిని గోదావరి బోర్డు కోరింది. సీసీ కెమెరాలను ఎక్కడ ఏర్పాటు చేయాలి? వాటి ఫుటేజీలను ఎక్కడ భద్ర పరచాలి? అన్న అంశాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

బీసీ సింహగర్జనకు 60 కులసంఘాల మద్దతు



సాక్షి, హైదరా బాద్: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ నెల 10న సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బీసీల సింహగర్జనకు రాష్ట్రంలో అరవై బీసీ కుల సంఘాలు మద్దతు తెలిపినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి బీసీ కుటుంబం నుంచి ఒకరు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పులివెందుల వెళ్లేందుకు సునీల్‌యాదవ్‌కు అనుమతి

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు (ఏ–2) సునీల్ యాదవ్ పులివెందుల వెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. సునీల్ తండ్రి కృష్ణయ్య మరణించడంతో అంతిమ సంస్కారాలకు రెండు రోజులు, దినకర్మలకు మరో రెండు రోజులు.. నాలుగు రోజులకు అనుమతిచ్చింది. ఈ నెల 9, 10, 17, 18న ఎస్కార్ట్ సాయంతో పులివెందుల వెళ్లి రావాలని ఆదేశించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

తనకు పూర్తిస్థాయి బెయిల్ ఇవ్వాలన్న సునీల్ యాదవ్ పిటిషన్‌లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో 2021 ఆగస్టు 2 నుంచి జైలులో ఉన్నానని, సీబీఐ చార్జిషీట్ కూడా దాఖలు చేసినందున బెయిల్ ఇవ్వాలని కోరుతూ సునీల్ యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున నయన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. సీబీఐ కీలక ఆధారంగా పేర్కొన్న గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం కాదని, అది సూచించిన సమయాలు తప్పు అని సీబీఐ కూడా ఒప్పుకుందని చెప్పారు. భారత జాతీయత అవసరం లేదు కానీ, వివేకా ఆస్తులకే వారసురాలన్నట్లు నర్రెడ్డి సునీత తీరు ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌లో తీర్పును రిజర్వు చేశారు.

క్షేమంగా ఒడ్డుకు చేరిన రైతులు

- ఆరు రోజులుగా వాగు అవతలే..
- మానేరు ఉధృతి పెరగడంతో అక్కడే చిక్కుకుపోయిన ముగ్గురు
- ఒడ్డుకు చేర్చిన అధికారులు



తాడు సాయంతో రైతులను ఒడ్డుకు చేర్చుతున్న పోలీసు సిబ్బంది

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆరు రోజులుగా వాగు అవతల చిక్కుకున్న ముగ్గురు రైతులు ఎట్టకేలకు క్షేమంగా అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని భీమునిమల్లారెడ్డిపేట రైతులకు గ్రామ శివారులోని మానేరువాగు అవతల దాదాపు 600 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వాగు దాటితేనే పొలాల వద్దకు చేరుకుంటారు. ఎప్పటిలాగే అదే గ్రామానికి చెందిన రైతులు అల్లాడి రాజం, మెతుకు ఎల్లయ్య, తిరుపతి గత శనివారం పొలం పనుల కోసం వాగు అవతలికి వెళ్లారు. ఆ సమయంలో మానేరువాగులో వరద తక్కువగా ఉంది. ఆ తర్వాత రోజు నుంచి వర్షం కురవడంతో వాగులో ప్రవాహ ఉధృతి పెరిగిపోయింది. వెంట తీసుకెళ్లిన బియ్యం, కూరగాయలు ఉండటంతో ఆరు రోజులపాటు అక్కడే పొలం పనులు చేసుకుంటూ గడిపారు. సరుకులు ఖాళీ అవడంతో ఇంటికొచ్చేందుకు వారు శుక్రవారం ఉదయం వాగు తీరానికి చేరుకున్నారు. వాగు ఉధృతి తీవ్రంగా ఉండటంతో గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ విషయం ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు తెలియజేయగా...ఆయన జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే గంభీరావుపేట ఎస్సై మహేశ్, తహసీల్దార్ భూపతి, మత్స్యశాఖ అధికారి ఫయాజ్‌తోపాటు డీఆర్ఎఫ్ టీమ్ మానేరువాగు తీరానికి చేరుకుని వారిని సురక్షితంగా ఒడ్డుకు రప్పించారు.

మంచంపై రోగిని ఉంచి.. వాగు దాటించి..

- పురుగు మందు ప్రభావంతో రైతుకు అస్వస్థత
- మంచంపై వాగు దాటించిన గ్రామస్తులు
- వంతెన లేక అష్టకష్టాలు



రైతును మంచంపై పడుకోబెట్టి వాగు దాటిస్తున్న గ్రామస్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్ గ్రామస్తుల రవాణా కష్టాలు తీరడం లేదు. మూడు రోజుల క్రితమే ఎనిమిది నెలల పసిగుడ్డుతో కుటుంబ సభ్యులు వరద దాటిన సంఘటన మరిచిపోకముందే.. మరోసారి గ్రామస్తులు సాహసం చేయాల్సి వచ్చింది. గ్రామానికి చెందిన మాలోత్ లక్ష్మణ్ శుక్రవారం పత్తి పంటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తుండగా అస్వస్థతకు గురై మందు ప్రభావంతో స్పృహ తప్పి పడిపోయాడు. సమీపంలోని రైతులు గమనించి అతన్ని వెంటనే ఇంటికి తీసుకెళ్లారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో కుటుంబ సభ్యులు కెరమెరి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. మార్గమధ్యలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లక్ష్మణ్‌ను మంచంపై పడుకోబెట్టి ఐదుగురు గ్రామస్తులు వాగు దాటించారు. అక్కడి నుంచి ఆటోలో కెరమెరి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యానికి ఉట్నూర్‌కు.. ఆ తర్వాత ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు లక్ష్మణ్‌ను ఐసీయూలో ఉంచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితేనే తమ బాధలు తీరుతాయని ఈ ప్రాంతీయులు స్పష్టం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చనిపోయిన మూడేళ్లకు సింగరేణి హాల్‌టికెట్



ప్రవీణ్

- మోటార్ మెకానిక్ ఉద్యోగం కోసం ఓ యువకుడు ఆరేళ్ల క్రితం దరఖాస్తు
- కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ మూడేళ్ల కిందటే ఓసీపీ–1 బ్లాస్టింగ్‌లో దుర్మరణం
- పాత జ్ఞాపకాలతో కన్నీటిపర్యంతమైన కుటుంబసభ్యులు

గోదావరిఖని(రామగుండం): ఓ యువకుడు చనిపోయిన మూడేళ్లకు పరీక్ష రాయాలంటూ తాజాగా శుక్రవారం అతడి ఇంటికి హాల్‌టికెట్ వచ్చింది. దీంతో ఆ కుటుంబం అతడి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటన గోదావరిఖనిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక రమేశ్‌నగర్‌కు చెందిన బండారి ప్రవీణ్ ఐటీఐ డీజిల్ మెకానిక్ పూర్తిచేశాడు. 2017లో సింగరేణిలో మోటార్ మెకానిక్ ఉద్యోగం కోసం నోటిఫికేషన్ వెలువడగా దరఖాస్తు చేసుకున్నాడు. అయితే దానికి సంబంధించిన పరీక్ష ఎప్పుడో ఆ సంస్థ ప్రకటించలేదు. దీంతో ఆర్జీ–3 ఏరియాలోని ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో ప్రవీణ్ కాంట్రాక్టు కార్మికుడిగా చేరాడు. మూడేళ్ల అనంతరం సింగరేణి ఓసీపీ–1లో ఓబీ బ్లాస్టింగ్ కోసం ఎక్స్‌ప్లోజివ్ నింపుతున్న క్రమంలో జరిగిన భారీ పేలుడులో ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. దుర్మరణం పాలైనవారిలో ప్రవీణ్ కూడా ఉన్నాడు. అయితే 2023 సెప్టెంబర్ 17న జరిగే మోటార్ మెకానిక్ రాత పరీక్షకు హాజరు కావాలని ప్రవీణ్ హాల్‌టికెట్‌కు సంబంధించిన మెస్సేజ్ అతడి తమ్ముడు అరుణ్ వాడుతున్న మొబైల్ ఫోన్‌కు వచ్చింది. అప్పట్లోనే సకాలంలో పరీక్షలు నిర్వహించి ఉంటే తన అన్న ప్రమాదంలో మృతి చెందేవాడు కాదని అరుణ్ కన్నీటి పర్యంతమయ్యాడు. హాల్‌టికెట్ చూసిన కుటుంబ సభ్యులు పాత జ్ఞాపకాలు నెమరేసుకుని కంటతడిపెట్టారు.

యూరియా కొరత.. రోడ్డెక్కిన రైతులు



నల్లగొండ జిల్లా హాలియాలో పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం ఉదయమే బారులు తీరిన రైతులు

పెన్‌పహాడ్, హాలియా: ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రైతులు రాస్తారోకో చేశారు. పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో వాటి ఎదుగుదల లేక.. దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి.. సరిపడా యూరియాను త్వరితగతిన సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనుముల మండలం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం ఎదుట శుక్రవారం యూరియా కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. అందరికీ అందక నిరాశతో వెనుదిరిగారు.

సాక్షి కరీంనగర్

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



ఎన్నికలకు రెడీగా ఉండాలి

ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని రాజన్న జోన్ డీఐజీ కె.రమేశ్ నాయుడు తెలిపారు.

- 12లో▸



ఈ నెలంతా పోషణ్ అభియాన్

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, మాతా, శిశు సంరక్షణపై ఈ నెలాఖరు వరకు పోషణ్ అభియాన్ నెల రోజులపాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
28.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీకి ముహూర్తం ఖరారు

- 15న వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- తరగతుల ప్రారంభానికి సన్నాహాలు



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 15న సీఎం కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 మెడికల్ కాలేజీలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ మెడికల్ కళాశాలను స్టార్ట్ చేయనున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఈవిద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేశారు. కౌన్సెలింగ్ ద్వారా 100 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మరోవైపు కళాశాల భవనం, తరగతి గదులు, ల్యాబుల నిర్వహణ కోసం కొత్తపల్లిలోని విత్తనాభివృద్ధి సంస్థ గోదాముల స్థలాన్ని కేటాయించారు. హాస్టల్, లైబ్రరీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కళాశాలకు అనుబంధంగా జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిని రెడీచేస్తున్నారు. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో మెడికల్ హబ్‌గా మారనుంది. హైదరాబాద్ మహానగరాలకు దీటుగా ఇక్కడే వైద్యం లభించనుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇటీవల కళాశాల, ఆసుపత్రి నిర్వహణకు సరిపడ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్, ఆఫీస్ సిబ్బందిని కళాశాలకు కేటాయించింది. కాగా.. ఈనెల 15 నుంచి పూర్తిస్థాయి తరగతులు ప్రారంభిస్తున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

పండుగలు ఘనంగా నిర్వహిస్తాం

- వినాయక చవితికి రూ.1.50 కోట్లు
- బతుకమ్మ, దసరాకు రూ.2.50 కోట్లు
- మేయర్ సునీల్‌రావు



కరీంనగర్ కార్పొరేషన్: వినాయక చవితి, బతుకమ్మ, దసరా పండుగలను నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. వినాయక చవితికి రూ.1.50 కోట్లు, బతుకమ్మ, దసరా పండుగలకు రూ.2.50 కోట్లు కేటాయించామన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నగరంలో ప్రతీ మండపంలో తొమ్మిది రోజుల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు ఇతర పనులు చేపడుతామన్నారు. బతుకమ్మ, దసరా వేడుకలను గొప్పగా నిర్వహిస్తామన్నారు. మానేరు డ్యాంకట్ట, చింతకుంట, కొత్తపల్లి, మానకొండూరు, మానేరు వాగు వేదభవన్, గార్లకుంట, తీగలగుట్టపల్లి, సీతారాంపూర్, రేకుర్తి పెంటకమ్మ చెరువు లాంటి ప్రతీ నిమజ్జనం పాయింట్ వద్ద ఏర్పాట్లు పూర్తిచేస్తామన్నారు.

మంత్రి గంగుల, వినోద్‌ల సహకరంతోనే అభివృద్ధి..

మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సహకారంతోనే నగర అభివృద్ధి జరుగుతుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. నగరంలోని 15వ డివిజన్ రాంనగర్‌లో రూ.3 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగసముద్రం జయలక్ష్మి, ఈఈ మహేందర్, డీఈ లచ్చిరెడ్డి, బీఆర్ఎస్ లీడర్లు దూలం సంపత్ గౌడ్, రాజు, వరాల నారాయణ, విద్యాసాగర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు



కరీంనగర్‌క్రైం: నగరంలోని భగత్‌నగర్‌లోని ఓ ఒక అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ పేలి బ్రహ్మానందం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. అతిగా సెల్‌ఫోన్ వాడకం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. అవసరం మేరకే ఫోన్ వాడాలని సీపీ సుబ్బారాయుడు సూచించారు.

కొత్త రైతులకు బీమా చిక్కులు!

- నూతన రైతు కుటుంబాలకు బీమాలో జాప్యం
- వీరందరి పేరిట బీమా సంస్థకు ప్రీమియం కట్టిన ప్రభుత్వం
- అయినా కొత్త రైతుల పేరిట జనరేట్ కాని ఇన్సూరెన్స్ ఐడీలు
- మరణించిన కొత్త రైతుకుటుంబాలకు బీమా చెల్లింపులో ఆలస్యం
- త్వరలో సమస్య పరిష్కారిస్తామంటున్న వ్యవసాయాధికారులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లా కొత్త రైతు కుటుంబాలకు రైతుబీమాలో కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవల తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా విరాసత్ విధానంలో భూములు పొందిన వారికి, కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి రైతులుగా మారిన వారి కుటుంబాలను ఇన్సూరెన్స్ కష్టాలు వెంటాడుతున్నాయి. వాస్తవానికి రైతు అకాల మరణం చెందితే.. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కేవలం రెండు వారాల్లో అంటే దాదాపు 14 రోజుల్లో రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. ఇందుకు సంబంధించి ప్రీమియం బీమా సంస్థకు ఏటా ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ, 2022 ద్వితీయార్థంలో కొత్తగా భూములకు యజమానులుగా మారిన వారికి తాజాగా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాస్తవానికి వీరందరినీ ప్రభుత్వం ఏనాడో యజమానులుగా గుర్తించింది. రైతు పేరిట పట్టాదారు పాసు పుస్తకం జారీ చేసి, ధరణిలో పేరు కూడా నమోదు చేసింది. కానీ, వీరికి ఇంతవరకూ ఇన్సూరెన్స్ ఐడీలు జనరేట్ కాకపోవడం గమనార్హం.

ఏంటీ సమస్య?

కొత్తగా వ్యవసాయ భూములకు యజమానులుగా మారిన రైతుల పేరిట ప్రభుత్వం బీమా సంస్థకు ఏటా ప్రీమియం చెల్లిస్తుంది. గతంలో బీమా సంస్థకు ప్రీమియం వివరాలు, రైతులకు సంబంధించి ఐడీని కాగితం రూపంలో రైతులకు అందజేసేవారు. ఏటా అదే ఐడీని రెన్యూవల్ చేసేవారు. రెండేళ్లుగా ఈ విధానం ఆన్‌లైన్ అయిపోయింది. దీంతో రైతుల ఇన్సూరెన్స్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు అవుతున్నాయి. రైతుకు అతడి పేరిట జనరేట్ అయిన ఐడీ నంబరు మాత్రం చెబుతున్నారు. ఒకవేళ ఆ రైతు ఆకస్మిక మరణం చెందితే.. సదరు ఐడీ ద్వారానే అతడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము వస్తుంది. తాజాగా ప్రభుత్వం రైతు పేరిట బీమా ప్రీమియం చెల్లించినా.. వారికి ఐడీలు జనరేట్ కావడం లేదు. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని సమాచారం. ఇలాంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. బీమా సంస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రైతులకు ఇంకా ఐడీలు జనరేట్ కాలేదని సమాచారం.

పదుల కుటుంబాల ఎదురుచూపు..

కొత్తరైతులుగా నమోదై ఏడాదిలోగా మరణించిన వారి సమస్యలు పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. సిరిసిల్లలో ఐదుగురు, పెద్దపల్లిలో 32 మంది, కరీంనగర్‌లో సుమారు 10 కుటుంబాలు జగిత్యాలలో ఐదు కుటుంబాలు పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అదే సమయంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు త్వరలో పరిహారం అందజేస్తామని స్పష్టంచేస్తున్నారు.

కల్వచర్లలో ఇలా..

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో కొత్తగా భూమికి యజమానిగా మారిన గోనె కొమురయ్య అనే రైతు పేరిట కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం ధరణిలో పేరునమోదు అయ్యింది. అనుకోకుండా కొమురయ్య ఆగస్టు 19న మరణించాడు. నిబంధనల ప్రకారం అతడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును రెండు వారాల్లోగా అందజేయాలి. కానీ, మూడు వారాలు గడుస్తున్నా ఇంతవరకూ చెక్కు అందలేదని మృతుడి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఇదేంటని ఆరా తీసిన గ్రామపెద్దలు.. అసలు కొమురయ్య పేరిట బీమా ఐడీ ఇంకా జనరేట్ కాలేదని తెలుసుకుని అవాక్కయ్యారు. కేవలం కొమురయ్యే కాదు.. కొత్త రైతులందరికీ ఇదే పరిస్థితి ఉందని తెలిసి ఆందోళన చెందుతన్నారు. అయితే, వ్యవసాయాధికారులు మాత్రం కంగారుపడాల్సింది ఏమీలేదని, కాస్త జాప్యమైనా బీమా సొమ్ము వస్తుందని భరోసా ఇస్తున్నారు.



గోనె కొమురయ్య(ఫైల్)

డ్రగ్స్ నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బి.గోపి, వేదికపై సీపీ సుబ్బారాయుడు

- కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ క్రైం: మాదకద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను గురించి ప్రజలతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బి. గోపి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నియంత్రణపై సీపీ ఎల్.సుబ్బారాయుడుతో కలిసి రివ్యూ నిర్వహించారు. యువత వ్యసనాల బారినపడితే జరిగే నష్టాలు వివరించారు. జిల్లాలో గంజాయి, గుడుంబా వినియోగం జరగకుండా చూడాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు వివరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా షాపుల్లో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, అడిషనల్ డీసీపీలు సి.రాజు(పరిపాలన), ఎ.లక్ష్మీనారాయణ (శాంతి భద్రతలు), ఆర్డీవో కె.మహేశ్వర్, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, సర్వర్, మాధవి, విజయకుమార్, ప్రతాప్, హరిశంకర్ (లీగల్ అడ్వైజర్), అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఓట్లపై త్వరగా చర్యలు తీసుకోండి

కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితాలో నమోదైన డబుల్ ఎంట్రీలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలోని డబుల్ ఎంట్రీలపై తీసుకునే చర్యలపై పలు సూచనలు చేశారు. క్లస్టర్ల వారీగా జాబితాలోని గుర్తించి చెక్ లిస్ట్ జాబితాను బీఎల్‌వోలకు ఇచ్చి ఇంటింటి సర్వే ద్వారా పరిశీలించి నివేదికను తయారు చేయాలన్నారు. ఒకే వ్యక్తి రెండు, అంతకు మించి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే ఓటరు నిర్ణయం మేరకు ఇతర పోలింగ్ కేంద్రం నుంచి ఓటు తొలగించాలన్నారు. ఈ ప్రక్రియ ఆదివారం సాయంత్రానికి పూర్తికావాలని ఆదేశించారు. ఇటీవల జారీచేసిన ఎస్ఎస్ఆర్‌లో గుర్తించిన బదిలీ, మార్పులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, సోలిపేట రాజు ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్ కుమార్, తహసీల్దార్ ఉయ్యాల రమేశ్, రాజేశ్, ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'చిట్ ఫండ్స్' సమస్యలు పరిష్కరిస్తాం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: చిట్‌ఫండ్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని.. ఉమ్మడి జిల్లా చిట్‌ఫండ్ వెల్ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి స్థలంతో పాటు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం రైస్‌మిల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్టర్డ్ చిట్ ఫండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి చీఫ్‌గెస్ట్‌గా హాజరయ్యారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను సమాన దృష్టితో చూస్తున్నామన్నారు. చిట్‌ఫండ్ అసోసియేషన్ బాధ్యులకు ఎల్లవేళలా సహకారాలు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200 మంది చిట్‌ఫండ్స్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదిస్తే.. రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానన్నారు. మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లారిశంకర్, చిట్‌ఫండ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి సత్యనారాయణ, రంజిత్ కుమార్, గౌరవ అధ్యక్షుడు రాజిరెడ్డి, వేణుమూర్తి, నర్సింగరావు, కోమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- లాస్ట్ జర్నీ

ఆరడుగుల స్థలం కోసం అష్టకష్టాలు!



మృతదేహాన్ని పొలాల వెంట తీసుకెళ్తున్న గ్రామస్తులు

- మానేరు వాగులో శ్మశానవాటిక
- ఇటీవల వర్షాలకు నీటమునిగిన వైనం
- అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్న కొండపాక గ్రామస్తులు

వీణవంక(హుజూరాబాద్): ఆ ఊరికి ఆరడుగుల జాగ కరువైంది. ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు అష్టకష్టాలు పడాల్సిందే. స్థలం ఉన్నవారు కార్యం కానిచ్చేస్తుండగా జాగా లేనివారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానేరు వాగులో శ్మశాన వాటిక నిర్మించగా వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో అంత్యక్రియలకు ఆ గ్రామస్తుల తిప్పలు అన్నీఇన్నీ కావు. రెండేళ్లుగా పొలాల వెంట కిలోమీటర్ల దూరం వెళ్లి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. వీణవంక మండలం కొండపాక గ్రామంలో శుక్రవారం గోద సమ్మక్క(55), జూకంటి లక్ష్మి (45) అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు చేద్దామనుకుంటే శ్మశానవాటిక వాగులో మునిగిపోయింది. మృతులకు సొంత జాగా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి భూమిలో అంత్యక్రియలు చేశారు. అరకిలోమీటర్ దూరం పొలాల వెంట మృతదేహాలను తీసుకెళ్లి అంత్యక్రియలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పొలాల వెంట పాడే మోసేందుకు నానా తంటాలు పడ్డారు.


మానేరు వాగు ఒడ్డున నిర్మాణం..

గ్రామ శివారులోని మానేరు వాగు ఒడ్డున ఉపాధి హామీ కింద రూ.11.50 లక్షలతో నాలుగేళ్ల క్రితం శ్మశాన వాటిక నిర్మించారు. రెండేళ్ల క్రితం వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వైకుంఠధామం వరదలో కొట్టుకుపోయింది. వారం క్రితం కురిసిన వర్షాలకు పూర్తిగా మునిగిపోయింది. వాగులో శ్మశానవాటిక నిర్మించడంపై గతంలో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.



కొండపాక వాగులో మునిగిన శ్మశానవాటిక

ఇబ్బందులు పడుతున్నాం



శ్మశానవాటిక వాగులో నిర్మించడంతో వర్షాలకు కొట్టుకుపోయింది. అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్నాం. వేరోచోట శ్మశానవాటిక నిర్మించాలని అధికారులు, పాలకవర్గానికి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

–పెద్దపల్లి ఐలయ్య, కొండపాక

ఖాళీ జాగాకు 100 ఇంటి నెంబర్లు!

ఖాళీగా ఉన్న ఈ స్థలం నగరపాలక సంస్థ రెండో డివిజన్ పరిధి వల్లంపహాడ్ శివారు లోనిది. ఇందులో ఇండ్లు ఉన్నట్లు మీకు కనిపిస్తున్నాయా? అదేంటి..! అంతా ఖాళీ స్థలం ఉంటే ఇండ్లంటారు? అవును నగరపాలకసంస్థ అధికారులు వంద ఇండ్లు ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాదండోయ్.. వాటికి ఇంటి నెంబర్లు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు.. రికార్డుల్లో చూపిస్తున్నారు.



వల్లంపహాడ్‌లోని ఖాళీ స్థలం ఇదే

- వల్లంపహాడ్‌లో భారీ స్కాం
- రూ.12 కోట్ల భూమికి హక్కులు
- చేతులు మారిన రూ.కోటి?
- బరితెగించిన బల్దియాలోని కొంతమంది ఉద్యోగులు

కరీంనగర్ కార్పొరేషన్:

కరీంనగర్ నగర పాలకసంస్థలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు ముడుపులు ఇస్తేచాలు ఏ పనైనా చేసిపెట్టేందుకు వెనకాడడంలేదు. తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమానో.. మరేమిటో గానీ.. ఏకంగా ఖాళీ స్థలంలో ఇండ్లున్నట్లు ఇంటి నెంబర్లు సృష్టించారు. అంతేకాదు.. అందినకాడికి దండుకొని భూ యజమాని.. మరికొందరికి రిజిస్ట్రేషన్ మార్గం ఈజీచేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఖాళీ జాగాకు ఇంటి నెంబర్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

నగరంలోని రెండో డివిజన్‌లో వల్లంపహాడ్ నుంచి దుర్శేడ్ వెళ్లే రోడ్డుకు అతి సమీపంలో ఓ రైతుకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కార్పొరేషన్‌లో విలీనం కావడం.. నగరం విస్తరించడంతో ఆ ఏరియాలో భూములు అత్యంత విలువైనవిగా మారాయి. ఫలితంగా కొన్ని సంవత్సరాలుగా తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. ఎకరం రూ. 5 నుంచి రూ. 6 కోట్లు పలుకుతోంది. దీంతో సదరు రైతు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూమిని అమ్మేందుకు సిద్ధమయ్యాడు. అయితే మోఖా మీద నాలుగు ఎకరాలు ఉన్నప్పటికీ..పహాణీలో మాత్రం రెండెకరాలే ఉన్నట్లు సూచిస్తోంది. మిగతా రెండెకరాలకు ఎలాంటి హక్కు పత్రాలు లేవు. దీంతో ఆ భూమిని కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో సుమారు రూ.12 కోట్లు విలువైన రెండు ఎకరాల భూమిని అమ్మిపెట్టేందుకు పెద్ద తలకాయలు రంగప్రవేశం చేశాయి. ఇంటి నెంబర్లతో స్థలాన్ని అమ్మాలనే మాస్టర్ ప్లాన్ వేశాయి. ఆలోచన వచ్చిందే తడవు.. నగరపాలకసంస్థ ఉద్యోగులు సంప్రదించి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందకుపైగా ఇళ్లు ఉన్నట్లు నెంబర్లు సృష్టించాయి.

ఇంటి నెంబర్‌కో లక్ష?

ఖాళీ స్థలంలో లేని ఇండ్లు ఉన్నట్లు నెంబర్లు సృష్టించేందుకు పెద్ద మొత్తం చేతులు మారాయనే ప్రచారం ఉంది. ఒక్కో ఇంటి నెంబర్‌కు రూ.లక్ష చొప్పున వందకుపైగా ఇంటినెంబర్లకు సుమారు రూ.కోటి ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంటి నెంబర్లతో భూములను విక్రయించే అవకాశం ఉండడంతో పెద్ద మొత్తంలో ముట్టచెప్పినట్లు సమాచారం. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో పరిశీలించి నెంబర్‌ను కేటాయించాల్సిన నగరపాలకసంస్థ ఉద్యోగులు ఖాళీ స్థలానికి ఇంటినెంబర్లు కేటాయించడం కలకలం సృష్టిస్తోంది. ఇదిలాఉంటే ...ఈ జాబితాలో ఒక్కరి పేరిటే 38 ఇంటి నెంబర్లు, అతని కుటుంబసభ్యుల పేరుమీద మరో 30 ఇంటినెంబర్లు జారీ చేయడం గమనార్హం.

పరిశీలిస్తాం...

వల్లంపహాడ్‌లో ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చిన వ్యవహారం ఇప్పటివరకు దృష్టికి రాలేదు. ఇంటి నెంబర్లు ఇచ్చారా? ఎప్పుడిచ్చారు? అవి నిబంధనలకు అనుగుణంగా ఇచ్చారా? లేదా? పరిశీలిస్తాం.

– అంజనేయులు, ఆర్‌వో, నగరపాలకసంస్థ

చెక్ చేస్తా...

వల్లంపహాడ్‌లోని ఖాళీ స్థలాల్లో ఇంటి నెంబర్లు కేటాయించిన సమాచారం దృష్టికి రాలేదు. దీనిపై ఒకసారి చెక్‌చేస్తా.

– ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, నగరపాలకసంస్థ

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతలకు బహుమతులు

విద్యానగర్(కరీంనగర్): 'రాఖీ'పురస్కరించుకొని గత నెల 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా ప్రకటించింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో ప్రయాణించిన వారి టికెట్లను ఈనెల 5న కరీంనగర్‌లో డ్రా తీసి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి గెలుచుకున్న కె. జయశ్రీ, ద్వితీయ బహుమతి చెంజర్ల కవిత, తృతీయ బహుమతి ఇందూషాలకు శుక్రవారం హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ అందజేశారు. రీజనల్ మేనేజర్ ఎస్.సుచరిత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. చందర్ రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) కె.సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కొత్తపల్లి(కరీంనగర్): నిర్మల్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన ఎం.వెంకటరమణ, జి.ప్రణయ్, ఎ.కార్తికేయ, ఎల్.నిక్షిత్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వారిని శుక్రవారం కళాశాలలో అభినందించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యతోపాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులున్నారు.

మున్నూరుకాపు న్యాయవాదుల సమ్మేళనం



కరీంనగర్‌క్రైం: మున్నూరుకాపు న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కరీంనగర్‌లోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు మున్నూరుకాపు న్యాయవాదుల అభివృద్ధి కోసం పలు సూచనలు చేశారు. అందరం సహాయసహకారాలు అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పూరెల్లి రాములు, చక్రధర్, గిన్నె సతీశ్‌కుమార్, హేమలత పటేల్, సీనియర్ న్యాయవాదులు ఉప్పుల అంజనీప్రసాద్, వంటల రత్నాకర్, పిన్నింటి అశోక్, ఎర్రం రాజిరెడ్డి, బోనాల మురళి, బి.వి.రమణ, ఎల్.రాజయ్య కొమ్ము రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభకు రండి



విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఈ నెల 10న నిర్వహించే ముస్లిం డిక్లరేషన్ సంకల్ప సభ తరలిరావాలని జేఏసీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ రసూల్, కరీంనగర్ జిల్లా కన్వీనర్ అజ్గర్ హుస్సేన్ కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ముస్లింలకు సంబంధించి డిక్లరేషన్ అంశాలను పొందుపరిచాలని డిమాండ్ చేశారు. జేఏసీ కరీంనగర్ కో–ఆర్డినేటర్ జమీల్ నజీబ్ అహ్మద్, కో–కన్వీనర్ మజీద్ అలీ ఇస్తహాక్, షఫీక్, కోర్ కమిటీ సభ్యులు సయ్యద్ మొత్తారొద్దీన్, అలీమొద్దీన్ పాల్గొన్నారు.

సెలవులో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్ సెలవులో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఈ నెల 12 వరకు సెలవులో ఉండనుండగా 13న తిరిగి విధుల్లో చేరనున్నారు. అప్పటివరకు ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ వ్యవహరించనున్నారు.

నెలాఖరు వరకు 'పోషణ్ అభియాన్'

- తల్లీబిడ్డల సంరక్షణకు చొరవ
- పెరటి తోటల పెంపకంపై దృష్టి
- రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు



పౌష్టికాహారంపై సూచనలిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కరీంనగర్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, మాతా, శిశు సంరక్షణపై ఈ నెలాఖరు వరకు పోషణ్ అభియాన్ మాసోత్సవం(నెల రోజుల పాటు) మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రోజువారీ ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. గతంలో అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని పిల్లలకు అక్కడే పౌష్టికాహారం అందించి, విద్యాబుద్ధులు నేర్పేవారు. ఇప్పుడు చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, పెరటి తోటల పెంపకం తదితర అంశాలపై ప్రచారం చేస్తున్నారు. 2018 నుంచి ఏటా సెప్టెంబర్‌లో పోషణ్ అభియాన్‌పై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమం

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల బరువు, ఎత్తును రోజువారీగా పరిశీలించి, పోషకాల లోపం ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నెల రోజుల పాటు పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి, వారు ఏం తింటున్నారు? ఎంత తింటున్నారు? ఎన్నిసార్లు తింటున్నారు? శరీరానికి ఏ రకమైన పోషకాలు అందుతున్నాయో తల్లిదండ్రులకు వివరించి చెప్పడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పోషక విలువలున్న ఆహార పదార్థాలు, ఆకుకూరలు, ప్రోటీన్స్, విటమిన్స్, ఇతర బలవర్ధకమైన ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమాచారం
ఐసీడీఎస్ ప్రాజెక్టులు 14
అంగన్‌వాడీ కేంద్రాలు 3,135
మూడేళ్లలోపు చిన్నారులు 1,03,035 మంది
3–6 ఏళ్లలోపు చిన్నారులు 76 వేల మంది
గర్భిణులు, బాలింతలు 39,417 మంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇఫ్కో, కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో ఆయా సెంటర్లకు ఉచితంగా కూరగాయల విత్తన ప్యాకెట్లు అందిస్తున్నారు. ఈ నెలాఖరులోగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పెద్ద ఎత్తున కూరగాయలు, ఆకుకూరల సాగుతోపాటు పండ్ల మొక్కలు నాటనున్నారు.

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయం



ఆరోగ్యవంతమైన సమాజం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టపరుస్తూ తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమాన్ని చేపడుతోంది. పోషణ్ అభియాన్ మాసోత్సవంలో భాగంగా పిల్లల ఎదుగుదల, తల్లీబిడ్డల క్షేమం తదితర వివరాలు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తాం. పిల్లలకు టీకాలు వేయడం, గర్భిణుల బరువు చూడటం, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం. చివరి వారంలో పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి, పోషకాల ఆవశ్యకతపై ఇంటింటా ప్రచారం చేస్తాం.

– సరస్వతి, మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి

బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒకే తాను ముక్కలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకే తాను ముక్కలని, పథకం ప్రకారమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, ప్రజల నడ్డివిరుస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెంచుతున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా, ఉన్నవాటిని ఊడగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఇండియా పేరు మార్చు, సనాతన ధర్మం అంశాలను తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉండటంతో కంటితుడుపు చర్యగా గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తానేమీ తక్కువ కాదన్నట్లు విద్యుత్, ఆర్టీసీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోందన్నారు. తొమ్మిదేళ్లలో ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా, కొత్తగా దళిత, బీసీ, మైనారిటీ బంధు అంటూ ఎన్నికల ముందు మరోసారి ప్రజలను మోసం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, గీట్ల ముకుంద రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యూ.శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

- మూడేళ్ల క్రితం అనారోగ్యంతో భార్య మృతి

తిమ్మాపూర్: భార్య చనిపోవడంతో మనస్తాపానికి గురై మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక.. మద్యం మానలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పర్లపల్లి గ్రామంలో జరిగింది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాలు.. పర్లపల్లికి చెందిన రాగుల సంపత్(45)భార్య మూడేళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి సంపత్ తాగుడికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు.

దొంగతనం కేసులో నోటీసులు

ఈ నెల 2న గ్రామంలోని ఆలయం హుండీ దొంగతనం విషయంలో సంపత్‌తోపాటు గ్రామానికి చెందిన మరోకరికి పోలీసులు అరెస్టు నోటీసులు ఇచ్చారు. తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. సంపత్ ఆత్మహత్య విషయంలో తండ్రి మరో నిందితుడిపై అనుమానం వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రమోద్‌రెడ్డి, తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులకు మృతిపై అనుమానాలను నివృత్తి చేశారు. భార్య మరణం, వ్యసనం, జీవితంపై విరక్తితో ఉరేసుకున్నాడని కేసు నమోదు చేశారు.

కోతుల దాడిలో కారోబార్‌కు గాయాలు



కారోబార్ మొగిలి భుజంపై గాయం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన కారోబార్ మొగిలిపై కోతులు దాడి చేశాయి. శుక్రవారం గ్రామంలో విధుల నిమిత్తం వీధుల్లో వెళ్తుండగా కోతులు దాడి చేసి గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్ ఏఆర్ విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎ.ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సుబ్బారాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ కొంతకాలంగా అధికారుల ఉత్తర్వులు పాటించకుండా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో విచారణ జరిపి, చర్యలు తీసుకున్నట్లు సీపీ తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో, చట్టానికి లోబడి పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తూ, అతిగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కరీంనగర్: కిషోర బాలికలకు రుతుస్రావ పరిశుభ్రతపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో జిల్లాలోని 75 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీల మహిళా ఉపాధ్యాయులకు శుక్రవారం స్వశక్తి కాలేజీలో రుతుస్రావ పరిశుభ్రత ఆవశ్యకత, ఆరోగ్య, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. ఆడపిల్ల ఆరోగ్యంగా, ఆనందంగా ఎదిగితేనే భవిష్యత్తు బంగారంలా ఉంటుందని తెలిపారు. యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి సమన్వయంతో వీడియోలు, ప్రజెంటేషన్ల ద్వారా శిక్షణ కార్యక్రమం చేపట్టగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా అతహర్, జిల్లా ఫ్లోరోసిస్ కార్యక్రమ అధికారి డాక్టర్ శిల్పారెడ్డి రుతుస్రావ సమయంలో ఇబ్బందులు, పరిశుభ్రత, తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. జిల్లాలో బేటీ బచావోబేటీ పడావో ద్వారా ఋతుస్రావ వ్యర్థాల బస్మీకరణ యంత్రాలు 38, వారధి ద్వారా 25 యంత్రాలను 63 పాఠశాలలకు సరఫరా చేశారని, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా సంక్షేమ కార్యాలయ జెండర్ స్పెషలిస్ట్ శైలజ, ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్త రమేశ్, ఎస్‌బీఎం వేణుప్రసాద్, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్లు కల్యాణి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్



రవికుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సుడా చైర్మన్

మానకొండూర్: తెలంగాణ ప్రభుత్వం గౌడ సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తోందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సుడా క్యాంపు కార్యాలయంలో గౌడ కులస్తులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వం గౌడ కులస్తులకు అందజేసిన పథకాలను వివరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఎంపీటీసీలు ఉండింటి సులోచన శ్యామ్సన్, పిట్టల కవితమధు, పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, ఉపసర్పంచ్ నెల్లి మురళి, నాయకులు కడారి ప్రభాకర్, తాళ్లపల్లి పర్శరాములు, అనీల్ గౌడ్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, మనోజ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ వర్సెస్ ఏబీవీపీ



ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకుల వాగ్వాదం



గాయపడిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్

- దాడి చేసుకున్న నాయకులు
- ఠాణాలో పరస్పరం ఫిర్యాదు

కరీంనగర్: ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో దాడి చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై ఏబీవీపీ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు తెలంగాణచౌక్‌కు చేరుకున్నారు. ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా అక్కడికి చేరుకున్న ఏబీవీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో తీవ్ర వాద్వాదం చోటుచేసుకొని, తోపులాట జరిగింది. ఇరువర్గాలవారు దాడి చేసుకోవడంతో పోలీసులు వచ్చి, అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్ తలపై బలమైన గాయమవడంతో ఆస్పత్రికి తరలించారు. ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

ఏబీవీపీ నాయకుల తీరు సరికాదు..

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ఏబీవీపీ నాయకులు దాడి చేయడం సరికాదని ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్, గిరిజన సంఘాల నాయకులు ఆర్.వెంకటేశ్, మచ్చ రమేశ్, తిరుపతినాయక్, మోహన్ నాయక్, సురేశ్, రవీందర్, ప్రశాంత్, ఆమని, సాత్విక, రత్నం రమేశ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై సైద్ధాంతికంగా పోరాడాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఏబీవీపీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇరువర్గాలపై కేసు

ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు.

వరలక్ష్మిని ఆమె భర్తే చంపాడు

- గొంతునులిమి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరణ
- అరెస్టు చేసిన పోలీసులు



వరలక్ష్మి–వరుణ్‌కుమార్ దంపతులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని సాయిబాలాజీనగర్‌లో ఉంటున్న వరలక్ష్మి(33)ని ఆమె భర్తే చంపినట్లు త్రీటౌన్ పోలీసులు తేల్చారు. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం మండలంలోని వీర్లపల్లికి చెందిన వరలక్ష్మికి, సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన సుత్రాల వరుణ్‌కుమార్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అతను ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి కరీంనగర్‌లోని సాయి బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వరుణ్‌కుమార్ మద్యానికి బానిసై, తన ఆస్తులు కరిగించేశాడు. చివరకు భార్య నగలు కూడా తాకట్టు పెట్టాడు. నిత్యం మద్యం మత్తులో భార్యతో గొడవ పడుతూ, హింసించేవాడు. ఈ నెల 5న రాత్రి దంపతుల మధ్య నగలు విడిపించే విషయంలో గొడవ జరిగింది. దీంతో వరుణ్‌కుమార్ కోపోద్రిక్తుడై, ఆమెను గొంతునులిమి చంపేశాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరేసి, ఆత్మహత్యగా చిత్రీకరించాడు. వరలక్ష్మి మృతిపై అనుమానం ఉందని, ఆమెను భర్తే హత్య చేశాడని, ఇందుకు అతని కుటుంబసభ్యులు సహకరించారని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో వరుణ్‌కుమార్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. శుక్రవారం అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును త్వరగా ఛేదించిన త్రీటౌన్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

నాడు తండ్రి.. నేడు తల్లి

- అనారోగ్యంతో ఇద్దరూ మృతి
- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు

శంకరపట్నం(మానకొండూర్): నాడు తండ్రి.. నేడు తల్లి అనారోగ్యంతో మృతిచెందగా వారి ఇద్దరు ఆడపిల్లలు అనాథలైన ఘటన శంకరపట్నం మండలంలోని ఎరడపల్లిలో విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనకం సంపత్–స్వరూప దంపతులకు ముగ్గురు కూతుళ్లు. కొన్నేళ్ల క్రితం సంపత్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తల్లి స్వరూప అన్నీ తానై, కూలీ పనులు చేస్తూ పిల్లలను సాకింది. సంపత్ అన్న భూమయ్య, కుటుంబసభ్యులు కలిసి పెద్ద కూతురు వివాహం జరిపించారు. ఈ క్రమంలో స్వరూప కూడా అనారోగ్యానికి గురై, శుక్రవారం చనిపోవడంతో ఇద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. రెండో కూతురు దహన సంస్కారాలు నిర్వహించగా గ్రామస్తులు కంటతడి పెట్టారు. మృతురాలి రెండో కూతురు ఐదోతరగతి, మూడో కూతురు మూడోతరగతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారిని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు.

బీజేపీకి మృత్యుంజయం రాజీనామా



మృత్యుంజయం

సిరిసిల్లటౌన్/కరీంనగర్‌టౌన్: బీజేపీకి మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం రాజీనామా చేశారు. శుక్రవారం సిరిసిల్లలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. పార్టీలో ప్రాథమిక సభ్యత్వం తప్ప మరే బాధ్యత లేని తాను బీజేపీలో ఉన్నానో లేనో తెలియదని.. ఒకవేళ ఉంటే ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి లేఖ పంపించారు. 2019లో పార్టీలో చేర్చుకున్న అప్పటి అధ్యక్షుడు బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తమిళనాడు అసెంబ్లీ, హైదరాబాద్ మున్సిపల్, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్స్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ, మునుగోడు ఉప ఎన్నికల్లో ఇన్‌చార్జిగా విధులు అప్పగించగా సమర్థంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు తదితర అంశాలను పరిశీలించి, తాను ఇక బీజేపీలో కొనసాగలేననే నిర్ణయానికి వచ్చానన్నారు. పార్టీ ఎస్టీ కమిటీలో సభ్యుడిగా, బోథ్ నియోజకవర్గ బాధ్యుడిగా తనకు అప్పగించిన విధులను మరొకరికి ఇవ్వాలని కిషన్‌రెడ్డిని లేఖలో కోరినట్లు తెలిపారు.

ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల వినూత్న నిరసన



ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి వాయినం ఇస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కరీంనగర్: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి వాయినం ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డీటీఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, ప్రభుత్వ పాఠశాలలో కొత్తూరు రాములు, కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ బండారి శేఖర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు దీప్తి, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జిలాని, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కనుకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో శుభ్రత చర్యలు



శుభ్రత పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టరేట్ ఏవో సుధాకర్

సాక్షి స్పందన

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు కలెక్టరేట్ ప్రాంగణంలో శుభ్రత చర్యలు చేపడుతున్నారు. ఇటీవల 'సాక్షి' మినీలో కలెక్టరేట్‌లో అసౌకర్యాలు, పిచ్చిమొక్కలపై ఫొటో కథనాలు ప్రచురితమయ్యాయి. వాటికి కలెక్టర్ బి.గోపి స్పందించి, కలెక్టరేట్ ద్వారం ఎదుట గల చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం భవనాల పైకి చేరిన తీగలు, పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రం చేశారు. రెండ్రోజుల్లో పూర్తి చర్యలు తీసుకుంటామని కలెక్టరేట్ ఏవో సుధాకర్ తెలిపారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి

కరీంనగర్‌సిటీ: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, సిప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అధ్యక్షత వహించగా కేశవపట్నం తహసీల్దార్ అనుపమ, సిప్ కాలేజీ నోడల్ ఆఫీసర్ పద్మావతిలు హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని, 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు వేయడం మన హక్కు అని, సరైన వ్యక్తికి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోడబ్ల్యూ లావణ్య, శకుంతల, సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ పద్మావతి

గురుకుల డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం 2023–24 విద్యాసంవత్సర కొత్త విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే ఏర్పాటు చేశారు. విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, కో–ఆర్డినేటర్ సుష్మ, ఎన్‌ఎస్‌ఎస్ పీవో లావణ్య, కల్చరల్ కమిటీ సెక్రటరీ కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్వర్టుకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న ఏఎంసీ చైర్మన్ మధు

కొత్తపల్లి: మండలంలోని బావుపేట శివారు కరీంనగర్–వేములవాడ ఫోర్‌లేన్ రహదారిపై పాత కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు శుక్రవారం మరమ్మతులు చేయించారు. కాగా, రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ నూతన కల్వర్టు పనులు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఉద్యోగ విరమణ హోంగార్డుకు సన్మానం



నర్సయ్యను సన్మానిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్ క్రైం: కరీంనగర్–2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహించిన దయ్యాల నర్సయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. అంకితభావంతో 36 ఏళ్లు పోలీస్ శాఖకు సేవలందించి, ఎటువంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందినందుకు సీపీ ఎల్.సుబ్బారాయుడు అభినందించారు. పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.5 వేల చెక్కు అందించారు.

నేటి లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ కోర్టులో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. యాక్సిడెంట్, దాడి, చీటింగ్, దొంగతనం, వివాహానికి సంబంధించిన కేసుల్లో ఇరువర్గాల వారు రాజీ చేసుకునే అవకాశముందని తెలిపారు. పిటీ, డ్రంకెన్‌డ్రైవ్ కేసులవాళ్లు నేరుగా కోర్టుకు హాజరై, జరిమానా చెల్లిస్తే కేసు కొట్టివేస్తారని పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ అధికారులను కలిసి, లోక్ అదాలత్‌లో అపరిష్కృత కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

11న హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మూడు ఆలయాల హుండీలను ఈ నెల 11న లెక్కించేందుకు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు పొందినట్లు ఈవో ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను ఉదయం 8.30 గంటలకు, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయ హుండీలను 10.30 గంటలకు, ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీలను మధ్యాహ్నం 12.30 గంటలకు లెక్కిస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



సామగ్రి అందించిన సంస్థల బాధ్యులు

కరీంనగర్: యూత్ ఫర్ సేవ, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని గంజి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం బ్యాగులు, జామెట్రీ బాక్స్‌లు, బుక్స్, పెన్నులు తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో భరోసా సంస్థ అధ్యక్షుడు ఎ.నాగరాజు, తాటిపెల్లి సతీశ్‌బాబు మల్యాల వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యాయులు తిరుపతి, అజయ్‌కుమార్, ఇంద్ర సరస్వతి, వినోద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి వరి సాగు

- తగ్గిన ఆరుతడి పంటల విస్తీర్ణం
- కరీంనగర్ మండలంలో ముగిసిన క్రాప్ బుకింగ్ సర్వే



పంటల వివరాలు సేకరిస్తున్న ఏఈవో

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో వరి సాగుకే రైతులు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. అధిక వర్షాలతో ఆరుతడి పంటల విస్తీర్ణం తగ్గిపోయి, వరిసాగు గణనీయంగా పెరిగింది. కరీంనగర్ మండలంలో వ్యవసాయాధికారులు చేపట్టిన పంటల విస్తీర్ణం గుర్తింపు సర్వే(క్రాప్ బుకింగ్) శుక్రవారంతో ముగిసింది. దీని ప్రకారం అన్నదాతలు అన్ని పంటల కంటే వరి పంటను లక్ష్యానికి మించి వేశారు.

12 వేల ఎకరాల్లో..

వానాకాలం సీజన్ తొలి దశలో కురిసిన అధిక వర్షాలకు పత్తి, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలను కోల్పోయిన పలువురు రైతులు వరి నాట్లు వేశారు. ఎస్సారెస్పీ నీటితోపాటు చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో గత నెలాఖరు వరకు నాట్లు వేయడం పూర్తి చేశారు. క్రాప్ బుకింగ్ సర్వే ప్రకారం వరి–12,850, పత్తి–1,979, కందులు–3.10, మొక్కజొన్న–34.38 ఎకరాల్లో సాగు చేశారు. వరి లక్ష్యం 10,837 ఎకరాలు కాగా అదనంగా 2 వేల ఎకరాల్లో పంట వేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.సత్యం తెలిపారు. మొత్తం 15,393.23 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు పేర్కొన్నారు.

అధిక వర్షాలతో తెగుళ్ల బెడద

గత జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లగా ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గరిష్ట విస్తీర్ణంలో సాగైన వరి పంట ఏపుగా పెరిగి, పచ్చదనం సంతరించుకుంది. అయితే మళ్లీ గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వరిని ఉల్లికోడు, కంకినల్లి, మొగిపురుగు, ఎండాకు, అగ్గితెగులు తదితర తెగుళ్లు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి నేలల్లోని పత్తిలో వర్షాలతో కలుపు మొక్కలు పెరిగాయి. నీటి నిల్వతో తెగుళ్లు తీవ్రమవుతున్నాయి. ఎర్ర నేలల్లోని పత్తి మాత్రం సమృద్ధి వర్షాలతో ఏపుగా పెరుగుతోంది. వరి, పత్తి పంటలను ఆశిస్తున్న వివిధ రకాల తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తెగుళ్ల నివారణకు సూచించిన క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలని చెబుతున్నారు.

మొక్కలు నాటుడు.. ఎదిగాక నరుకుడు



కరీంనగర్‌రూరల్: మొక్కలను నాటండి.. చెట్లను నరకండి అనే చందంగా ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి, హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటిస్తోంది. అయితే అధికారులు లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎక్కడపడితే అక్కడ నాటడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యుత్ తీగల కింద చిన్న మొక్కలు, పూల మొక్కలను నాటాలనే నిబంధన విస్మరించి, వేప, రావి మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం చెట్లుగా ఎదిగాయి. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో గురు, శుక్రవారాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో సిబ్బంది చెట్ల కొమ్మలను నరికివేశారు. అన్ని గ్రామాల్లో ఇలాగే చేస్తుండటంతో చెట్లన్నీ బోసిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యుత్ తీగల కింద పూల మొక్కలను మాత్రమే నాటేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న సత్యం

కరీంనగర్‌టౌన్: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం శుక్రవారం సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, హెల్త్ ఇన్స్రూ ఎక్స్‌గ్రేషియా, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

కరీంనగర్: ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పైడిపల్లి రాజు అధ్యక్షతన జరిగిన పార్టీ నగర సమితి హనుమాన్ నగర్, కట్ట రాంపూర్, కోతిరాంపూర్, గణేశ్‌నగర్ శాఖల కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ విలీన దినం జరపకుండా ఆనాటి ప్రభుత్వాలు అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. త్యాగధనుల స్మృతి చిహ్నాంగా ఉన్న బురుజులు శిథిలావస్థకు చేరాయని, కొన్నిచోట్ల కూలిపోతున్నాయన్నారు. వాటిని సుందరీకరించాలని కోరారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావుల విగ్రహాల సుందరీకరణకు అర్జీలు పెట్టినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. 11న బద్దం ఎల్లారెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పించి, వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి హాజరవుతారని తెలిపారు. నగరంలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. పార్టీ నగర శాఖ కార్యదర్శులు పైడిపల్లి రాజు, కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, న్యాలపట్ల రాజు, కసిబోజుల సంతోష్‌చారి, నునావత్ శ్రీనివాస్ నాయక్, కూన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: సబ్‌స్టేషన్లలో నెలవారీ విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు 33/11 కేవీ అంబేడ్కర్ నగర్, బ్యాంక్ కాలనీ, వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్లు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 33/11 కేవీ ఉజ్వలపార్కు, భగత్‌నగర్, సప్తగిరికాలనీ, పద్మనగర్, ఎస్సారార్ కళాశాల సబ్‌స్టేషన్ల పరిధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ టౌన్–1, 2 ఏడీఈలు ఎస్.నరేందర్, ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

కొత్తపల్లి, రూరల్ పరిధిలో..

విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు 33/11 కేవీ కొత్తపల్లి, రేకుర్తి, బొమ్మకల్, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, నగునూర్, శాతవాహన యూనివర్సిటీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

రాపిడో బైక్ యాప్ రద్దు చేయాలి

కరీంనగర్: ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టే రాపిడో బైక్ యాప్ రద్దు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గణేశ్‌నగర్ ఆటోస్టాండ్ అడ్డా–1 వద్ద శుక్రవారం ఆటోకు సంబంధించిన స్టిక్కర్ విడుదల చేశారు. రాపిడో బైక్ యాప్ వల్ల ఆటోలకు కిరాయిలు రావడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు, ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ చార్జీలు, పెనాల్టీలు తగ్గించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, అర్హులైన డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'కాంగ్రెస్‌ది లౌకికవాద నినాదం'

కరీంనగర్‌టౌన్: దేశంలో అన్ని కులాలను, మతాలను ఏకం చేస్తూ దేశాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎంతగానో తోడ్పాటుచ్చిందని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎన్నోసార్లు అనిశ్చితి వచ్చినా ఏ ఒక్క వర్గానికీ కాంగ్రెస్ కొమ్ముకాయలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఏదో ఒక అంశంపై సనాతన ధర్మం మీద దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటూ, లౌకికవాద నినాదంతో ముందుకెళ్తోందన్నారు. ప్రజలు తమ పార్టీని విశ్వసిస్తున్నారని తెలిపారు.

భాగ్యనగర్‌లో ఇంటింటా మట్టి సేకరణ



మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: దేశ స్వాతంత్ర్య సమరయోధులు, దేశ రక్షణ కోసం జరిగిన యుద్ధాల్లో మరణించిన వీర సైనికుల సంస్మరణార్థం ఢిల్లీలో నిర్మిస్తున్న అమృత్ వాటిక కోసం దేశవ్యాప్తంగా మట్టి సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 56వ డివిజన్ భాగ్యనగర్‌లో బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా మట్టి సేకరించి, సాయిబాబా మందిరంలో కలశ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, బూత్ అధ్యక్షులు ఆకారపు కర్ణాకర్ రెడ్డి, పత్యం రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన

కరీంనగర్ టౌన్: సరైన పద్ధతిలో శస్త్రచికిత్స చేయకుండా ఓ వివాహిత ప్రాణం పోయేలా చేశారంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి కిరణ్కుమార్, అనూష(24)కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఈ నెల 1వ తేదీన అనూష కడుపునొప్పితో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు కరీంనగర్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్ పూర్తి అవగాహన లేకుండా శస్త్రచికిత్స చేయడంతో బాధితురాలికి తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తొలుత నిమ్స్, తర్వాత గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ నిర్లక్ష్యం వల్లే అనూష చనిపోయిందంటూ బాధితులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రెండో ఠాణా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే, దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

రేపు ఓటర్ల అవగాహన సైకిల్ ర్యాలీ



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: ప్రజాస్వామ్యంలో ఓట్లు చాలా కీలకంగా వ్యవహరిస్తాయని, ఓటర్లలో చైతన్యం నింపడానికి, వారి పాత్రను తెలియజేయడానికి ఈ నెల 10న ఓటర్ల అవగాహన సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సైక్లింగ్‌తో ఎన్నో లాభాలున్నాయని, ఆరోగ్యంగా ఉండి, పనులు చురుగ్గా చేస్తారన్నారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు ర్యాలీని ప్రారంభిస్తామని, నగర పౌరులు సైకిళ్లతో వచ్చి, విజయవంతం చేయాలని కోరారు. సంఘం బాధ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర జీవనం



విద్యార్థులతో కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి

కొత్తపల్లి: పోషకాహారంతో ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందని సిద్దిపేట డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జి.మదన్‌మోహన్ తెలిపారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజులుగా నిర్వహిస్తున్న ×అల్ఫోర్స్ న్యూట్రీవిబిన్–2023₹ వేడుకలకు శుక్రవారం ముగిశాయి. ముఖ్య వక్తగా హాజరైన ఆయన ×మైండ్‌ఫుల్ డైట్₹ అనే అంశంపై మాట్లాడుతూ.. ఆరోగ్య అలవాట్లు, జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు, బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.సాయిప్రియ, కె.ఐశ్వర్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ వారోత్సవాల పోటీల్లో ప్రతిభ



సప్తగిరికాలనీ: ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన ఇన్సూరెన్స్ వారోత్సవాల్లో స్థానిక కోతిరాంపూర్ ప్రభుత్వ పాఠశాల సవరన్ విద్యార్థినులు సత్తా చాటారు. జి.ప్రణవి, ఎం.లాస్య డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు డ్రాయింగ్ మాస్టర్ కోడూరి సత్యనారాయణ తెలిపారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామమూర్తి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినంధించారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

శ్రావణ పూజలు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ఆలయాల్లో శ్రావణమాస చివరి శుక్రవార పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు, యువతులు ఒడిబియ్యం, పసుపుకుంకుమలు, గాజులు, వస్త్రాలు సమర్పించారు. వాయినాలు ఇచ్చుకున్నారు. చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో వ్రతాలు, కుంకుమార్చనలో పాల్గొన్నారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఒడిబియ్యం సమర్పించారు. ఈవో నాగుల అనిల్‌కుమార్, ఆలయ అధ్యక్షుడు కె.లక్ష్మీరాజం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధర్మమార్గంలో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్: అందరూ ధర్మమార్గంలో ముందుకు సాగాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం సనాతన ధర్మంపై చర్చ జరుగుతోందని, మన దేశంలోని అనేక సామాజిక రుగ్మతలకు ఏ ధర్మం కారణమో మేధావులు ప్రజలకు చెప్పాలని కోరారు. దేశంలోని అన్ని రుగ్మతలకు చరమగీతం పాడినప్పుడే అది సత్య ధర్మం అవుతుందన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యానగర్: మాతృభాషపై పట్టు సాధించాలని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని పాఠశాల సీబీఎస్‌ఈ సిలబస్ విద్యార్థుల కు మాతృభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ ప్రాంతానికైనా మాతృభాష జీవనాడి వంటిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ పొల్సాని సుధాకర్‌రావు, కార్యదర్శి రమాదేవి, అకాడమిక్ డైరెక్టర్ లలితాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పారమిత'లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రితేశ్ మెహతా జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. చిన్నారులు గోపికలు, చిన్నికృష్ణుని వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాదరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు పాత్రో, హరిప్రియ, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

15న ఆ 9 చోట్ల భారీ ర్యాలీలు

కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం సందర్భంగా వేలాదిమందితో ప్రదర్శనలు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న ఏకకాలంలో తొమ్మిది జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో కనీసం 15వేల నుంచి 20వేల మందితో భారీ ర్యాలీలు నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 15న జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలలో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. సీఎం కేసీఆర్ 15న ఏదో ఒక చోట కొత్త మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కామారెడ్డిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు. దేశంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లను కలిగి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

ఎస్ఈసీగా పార్థసారథి పదవీకాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా సి.పార్థసారథి పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి శుక్రవారం (సెప్టెంబర్ 8)తో ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియడంతో, ఆ రోజు నుంచే మరో ఏడాది ఎస్ఈసీగా కొనసాగిస్తూ సుల్తానియా ఆదేశాలిచ్చారు.


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నరోత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభి వృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏర్పుల నరోత్తమ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి హరీశ్ నియామక ఉత్తర్వులను నరోత్తమ్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు.. నరోత్తమ్ ధన్యవాదాలు తెలిపారు.

రోగాలను బట్టి పీజీ మెడికల్ సీట్లు!

ఆయా ప్రాంతాల్లో సంబంధిత స్పెషాలిటీలో ఓపీ మేరకు సీట్లు మంజూరు

- ఔట్ పేషెంట్ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్ల కేటాయింపు
- వారానికి 20 ప్రసవాలున్న కాలేజీకి రెండు గైనిక్ స్పెషాలిటీ సీట్లు
- జాతీయ మెడికల్ కమిషన్ కీలక నిర్ణయం.. ముసాయిదా విడుదల
- ఎండీలో కొత్తగా ప్రజారోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్
- కొత్తగా అందుబాటులోకి 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు



సాక్షి, హైదరాబాద్: ఆయా ప్రాంతాల్లో వ్యాధులు.. రోగుల సంఖ్య..అందుతున్న వైద్య సేవలను బట్టి మెడికల్ కాలేజీలకు పీజీ సీట్లు కేటాయించాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. అంటే ఏ ప్రాంతంలో ఎలాంటి రోగాలున్నాయో, ఆయా ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలకు ఆయా స్పెషాలిటీల్లో పీజీ మెడికల్ సీట్లు వచ్చే అవకాశం ఉంటుందన్నమాట. ఈ మేరకు కొత్త పీజీ మెడికల్ ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం.. మెడికల్ కాలేజీలో సంబంధిత స్పెషాలిటీ వైద్యంలో ఔట్ పేషెంట్ (ఓపీ)ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటేనే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేస్తుంది. ఉదాహరణకు ఒక మెడికల్ కాలేజీకి రెండు పీడియాట్రిక్ సీట్లు కావాలంటే సంబంధిత కాలేజీలో రోజుకు చిన్న పిల్లల ఓపీ కనీసం 50 ఉండాలి. ఒక ఆపరేషన్ థియేటర్ 24 గంటలు పనిచేస్తేనే రెండు పీజీ అనస్తీషియా సీట్లు ఇస్తారు. వారానికి 20 ప్రసవాలు జరిగితేనే రెండు గైనిక్ సీట్లు ఇస్తారు. ఇక సంబంధిత స్పెషాలిటీలో అదనంగా మరో సీటు కావాలంటే 20 శాతం ఓపీ పెరగాలి. సూపర్ స్పెషాలిటీకి సంబంధించి రెండు సీట్లుకేటాయించాలంటే ఆయా సూపర్ స్పెషాలిటీ విభాగంలో రోజుకు 25 ఓపీ ఉండాలి.

పడకల్లో 75% ఆక్యుపెన్సీ ఉండాలి

ఎన్ఎంసీ మరికొన్ని కొత్త నిబంధనలను కూడా ముసాయిదాలో చేర్చింది. మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ పడకల్లో 75 శాతం ఆక్యుపెన్సీ ఉండాలి. అల్ట్రాసౌండ్‌లు రోజుకు 30 జరగాలి. 10 సీటీ స్కాన్లు చేయాలి. రోజుకు మూడు ఎంఆర్ఐ స్కాన్లు తీయాలి. రోజుకు 15 శాతం మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. గతంలో ఇలాంటి నిబంధనలు లేవు. సంబంధిత స్పెషాలిటీలో నిర్దిష్ట ఓపీ సంఖ్యతో సంబంధం లేకుండా మౌలిక సదుపాయాలు, సర్జరీలు, అన్ని రకాల ఓపీలు, ఐపీలు, బ్లడ్ బ్యాంకు నిర్వహణ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు ఉన్నాయా లేవా? వంటివి మాత్రమే చూసి సీట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రధానంగా ఓపీని ప్రామాణికంగా తీసుకొని ఇవ్వాలని నిర్ణయించారు.

ఐసీఎంఆర్ ఆన్‌లైన్ కోర్సులు చదవాలి

ఎండీలో కొత్తగా 3 కోర్సులను ఎన్ఎంసీ చేర్చింది. ప్రజా రోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్‌లను ప్రవేశపెట్టింది. అలాగే సూపర్ స్పెషాలిటీలో ఉండే చిన్న పిల్లల గుండె, రక్తనాళాల కోర్సులను ఎత్తివేసి, సాధారణ గుండె, ఛాతీ, రక్తనాళాల సర్జరీలో చేర్చింది. సూపర్ స్పెషాలిటీలో ఉన్న ఛాతీ శస్త్రచికిత్స కోర్సును ఎత్తివేసి సాధారణ గుండె శస్త్రచికిత్సలో కలిపేసింది. అలాగే 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశ పెట్టింది. అవయవ మార్పిడి అనస్తీషియా, పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ, లేబొరేటరీ ఇమ్యునాలజీ, న్యూక్లియర్ నెఫ్రాలజీ, రీనాల్ పెథాలజీ, గ్యాస్ట్రో రేడియాలజీ, రక్తమార్పిడి థెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్, హిమటో ఆంకాలజీ, పీడియాట్రిక్ ఈ ఎన్‌టీ, స్పైన్ సర్జరీ కోర్సులు ప్రవేశపెట్టారు. పీజీ అయిపోయిన వా రు ఈ కోర్సులను చేసే సదుపాయం కల్పించారు. ఇక పీజీ చేసే ప్రతి విద్యార్థి మొదటి ఏడాది ఐసీఎంఆర్ నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరిగా చదవాలి. ఈ ముసాయిదాలోని అంశాలపై అభ్యంతరాలను 15వ తేదీలోగా తెలియజేయాలని ఎన్ఎంసీ కోరింది.

ఇలా అయితేనే ఉపయోగం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించాయి. అందువల్ల ఆయా మెడికల్ కాలేజీల్లో పీజీ మెడికల్ సీట్లను స్థానిక రోగాలను బట్టి కేటా యిస్తేనే ఉపయోగం ఉంటుంది. ఎన్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో శాస్త్రీయ మైనది. ఆయా ప్రాంతాల రోగులకు సంబంధిత వైద్యం అందుబాటులోకి వస్తుంది.

- డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

సర్టిఫికెట్ల తనిఖీకి ప్రత్యేక సెంటర్!

- గురుకుల అభ్యర్థుల కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- 2 వారాలు కొనసాగేలా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువుల నియామకాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పా ట్లు చకచకా చేస్తోంది. ఇప్పటికే అర్హత పరీక్షలన్నీ నిర్వహించిన బోర్డు... మెజార్టీ సబ్జెక్టు లకు సంబంధించి తుది కీలను సైతం విడుదల చేసింది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేట గిరీలకు సంబంధించి కోర్టు పరిధిలో కేసులుండటంతో ఆయా పరీక్షల తుది కీలను ఇంకా ఖరారు చేయలేదు. ప్రస్తుతం ఫైనల్ కీలు ఖరారు చేసిన సబ్జెక్టులకు సంబంధించి మెరిట్ జాబితాలను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

9210 పోస్టుల భర్తీకి..

గురుకుల విద్యా సంస్థల్లో ప్రధానంగా 9 విభాగాల్లో 9210 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐ ఆర్‌బీ 9 రకాల ప్రకటనలు జారీ చేసింది. ఇందులో 61 సబ్జెక్టుల్లో ఈ పోస్టులున్నాయి. ఈ క్రమంలో ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేస్తూ మెరిట్ జాబితాలు విడుదల చేస్తారు. 1:2 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ సెంటర్‌కు హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. తొలుత జిల్లాల వారీగా పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉండడం... మరోవైపు రెండు వారాల పాటు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తుండడంతో హైదరాబాద్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే సరిపోతుందని బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. ఈమేరకు పరిశీలన కేంద్రం ఏర్పాటు, నిర్వాహణపైన కసరత్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తేదీల ఎంపిక...

వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థి ముందుగా టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థికి అనుకూలంగా ఉన్న ఒక రోజును ఎంపిక చేసుకుని ఆమేరకు పరిశీలనకు హాజరు కావాలి. ఈనెల మూడో వారం నాటికి మెరిట్ జాబితాలు రెడీ చేసేలా బోర్డు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మెరిట్ జాబితాలు ఖరారైన తదుపరి వారంలోనే పరిశీలన ప్రక్రియ ప్రారంభించనుంది.

‘ధిక్కరణ’ వేయండి.. చర్యలు తీసుకుంటాం



వినాయక విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గతేడాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి హుస్సేన్‌సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారన్న ఆధారాలుంటే...ధిక్కరణ పిటిషన్ వేయాలని న్యాయవాది వేణుమాధవ్‌ను హైకోర్టు ఆదేశించింది. సరైన ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొలనుల్లో మాత్రమే పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్న మధ్యంతర ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నాయని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. పీఓపీతో తయారు చేసే విగ్రహాలపై నిషేధం ఎత్తివేయాలని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ ధూళ్‌పేటకు చెందిన తెలంగాణ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు హైకోర్టులో 2022లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. పీఓపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయలేదని, తాత్కాలిక కొలనుల్లో చేశామని తెలిపారు. ఈ క్రమంలో న్యాయవాది వేణుమాధవ్ వాదిస్తూ.. కోర్టు ఆదేశాలున్నా పీఓపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, విచారణను వాయిదా వేసింది.

కేటీఆర్‌తో ఎమ్మెల్యే చెన్నమనేని భేటీ

సాక్షి, హైదరాబాద్: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ శుక్రవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. గత నెల 21న ప్రకటించిన బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో చెన్నమనేని రమేష్‌కు అవకాశం దక్కక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రధాన సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా, దుబాయ్ పర్యటన ముగించుకుని 20 రోజుల తర్వాత రాష్ట్రానికి తిరిగి వచ్చిన కేటీఆర్‌తో రమేష్ తాజాగా సచివాలయంలో భేటీ అయ్యారు. వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల అనుమతులు, కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులైన రమేష్‌కి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గురుతరమైన బాధ్యత అప్పగించిన కేటీఆర్‌తో పాటు సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా చెన్నమనేని ధన్యవాదాలు తెలిపారు.

మేనేజ్‌మెంట్ వైద్య సీట్లకు మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వాస్త వంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒకసారి మాత్రమే చేసుకోవాలి. ఆ తర్వాత విడతల వారీగా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం తెలిపింది. పూర్తి వివరాలతో సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని వెల్లడించింది.



ఆలయంలో భక్తులు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో కుటుంబ సభ్యులతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న అనుబంధ మహాలక్ష్మీ ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు కుంకుమపూజలు చేసి, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లిశంకర్, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్‌లు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

రిమ్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



నీటి సరఫరా తీరును పరిశీలిస్తున్న కలెక్టర్



రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: ‘పడకేసిన వసతులు’ శీర్షికన ఈనెల 6న ‘సాక్షి’ మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాహుల్ రాజ్ స్పందించారు. రిమ్స్‌లో పడకలు సరిపోక రోగులు తిప్పలు పడుతున్నారు. ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురేసి ఉన్నారనే విషయాన్ని ప్రస్తావించగా.. స్పందించిన కలెక్టర్ శుక్రవారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, ఫీవర్ వార్డులతో పాటు ఇతర వార్డుల్లో కలియ తిరిగారు. అందుతున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో ఈనెలలో ఇప్పటివరకు 12 డెంగీ, రెండు మలేరియా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు వివరించారు. వారానికి రెండుసార్లు డ్రైడే పాటించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కలెక్టర్ వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఐజీ రమేశ్‌నాయుడు



పాల్గొన్న పోలీసు అధికారులు

- రాజన్న జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు
- ఎన్నికల నియమావళిపై శిక్షణ తరగతులు

కరీంనగర్‌క్రైం: ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని రాజన్న జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలని ఐదు నియోజకవర్గాల(కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుస్నాబాద్, హుజూరాబాద్)కు చెందిన ఎస్‌హెచ్‌వోలు, నోడల్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్ల శిక్షణలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని అంశాలు, విధులపై అవగాహన ఉండాలన్నారు. కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలల ముందుగానే గతంలో జరిగిన రెండు ఎన్నికల ఆధారంగా వొలటైల్ మ్యాప్‌ను పోలీస్ అధికారులకు అందుబాటులో ఉంచుతామన్నారు. దాని ఆధారంగా శాంతిభద్రతల చర్యలు తీసుకోవాలని సూచించారు. కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవి, అడిషనల్ డీసీపీలు రాజు, లక్ష్మీనారాయణ, ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, సర్వర్, మాధవి, విజయకుమార్, ప్రతాప్, హరిశంకర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తాతాజీ పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన కరీంనగర్ కలెక్టర్



డీఐజీకి పూలమొక్క అందిస్తున్న కలెక్టర్

రాజన్న జోన్ డీఐజీ రమేశ్‌నాయుడును కరీంనగర్ కలెక్టర్ బి.గోపి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.

260 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

సిర్పూర్(టి): మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం అర్ధరాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. మహారాష్ట్రలోని వీరూర్ గ్రామం నుంచి నిజామాబాద్‌కు రేషన్ బియ్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి రైల్వే గేటు వద్ద తనిఖీలు నిర్వహించారు. వే బిల్లు సరిగా లేని లారీని తనిఖీ చేయగా రూ.7.50లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని గుర్తించి పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వీరూర్ గ్రామానికి చెందిన మనోజ్ సర్దాకి చెందినవిగా ఒప్పుకున్నాడు. దీంతో మనోజ్‌ను విచారించగా గోండ్‌పిప్రి గ్రామానికి చెందిన అమూల్ బొమ్మకంటి వార్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. కాగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్, డీటీ శ్యాంలాల్, సీఎస్‌డీవో సిబ్బంది పంజాల బుల్లెట్, తరుణ్ పాల్గొన్నారు.

డీపీఆర్ సిద్ధం చేయాలి

- ఎంపీ సోయం బాపూరావు



అరుణ్‌కుమార్‌జైన్‌తో మాట్లాడుతున్న ఎంపీ

ఆదిలాబాద్: ఆదిలాబాద్–పటాన్‌చెరు రైల్వేలైన్ డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సో యం బాపూరావు రైల్వే జీఎంకు విన్నవించారు. హైదరాబాద్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆదిలాబాద్–ముథ్కేడ్ వరకు ఎలక్ట్రిఫికేషన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, ఆదిలాబాద్–పటాన్ చెరు 316 కిలోమీటర్ల నూతన రైల్వేలైన్ కోసం కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ రూ. 5,706 కోట్ల నిధులను మంజూరు చేసినందున, త్వరితగతిన ప్రాజెక్టు అంచనా ప్రతిపాదనలు పూర్తి చేయాలన్నారు. డీపీఆర్ సిద్ధం చేసి పంపితే పనులు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆదిలాబాద్, ఇచ్చోడ, నేరడిగొండ, నిర్మల్ మీదుగా బాల్కొండ, ఆర్మూర్, బోధన్, రుద్రూర్, పటాన్‌చెరు వరకు రైల్వే కనెక్టివిటీ పెరగనుందన్నారు. ఆదిలాబాద్ నుంచి ముథ్కేడ్ వరకు డబ్లింగ్ లైనుకు అనుమతి వచ్చిందని ఎంపీ తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కరీంనగర్ అర్బన్: ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించే కిశోర బాలికలకు రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి సూచించారు. శుక్రవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల, కేజీబీవీల మహిళా ఉపాధ్యాయులకు స్వశక్తి కాలేజీలో రుతుస్రావ పరిశుభ్రత–ఆవశ్యకత, ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి సమన్వయంతో వీడియోలు, ప్రజెంటేషన్లు, యానిమేషన్ల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా అతహర్, జిల్లా ఫ్లోరోసిస్ కార్యక్రమ అధికారి డాక్టర్ శిల్పారెడ్డి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పిల్లలు వాడిన ప్యాడ్స్ సురక్షితంగా తొలగించేందుకు యంత్రాలు ఉపయోగించాలని జిల్లా సంక్షేమ కార్యాలయ జెండర్ స్పెషలిస్ట్ శైలజ సూచించారు. గ్రామాల్లోని పాఠశాలల్లో స్వచ్ఛభారత్–యూనిసెఫ్ సమన్వయంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్త రమేశ్ పేర్కొన్నారు. ‘ఫ్లోరోసిస్’ వ్యాధి కారకాలు, జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై డాక్టర్ శిల్పారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం వేణుప్రసాద్, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్లు కళ్యాణి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారం

- భయాందోళనలో ప్రజలు



ఆనకట్ట ప్రాంతంలో పులి అడుగులు

బెజ్జూర్: కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం మత్తడి స్పిరంగ్ ఆనకట్ట పరిసరాల్లో పులి సంచరిస్తోంది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఆనకట్ట అటవీ ప్రాంతంలో రెండు మూడు రోజులుగా పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉండడంతో పంట పొలాలకు వెళ్లే రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ సమీపంలోని చేనుల్లో అడవిపందుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు రాత్రివేళ కాపలా కాస్తున్నారు. రాత్రివేళ పులి సంచరిస్తున్న క్రమంలో రైతులు వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పంట సాగు కోసం వేల రూపాయలు ఖర్చు చేశామని వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు పూత, కాతదశకు చేరుకున్న సమయంలో అడవి పందుల బెడద నుంచి రక్షించుకునేందుకు వెళ్తుండగా పులి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎఫ్‌బీవో దయాకర్‌ను సంప్రదించగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తామని, రైతులు జాగ్రత్తలు పాటించాలని, శబ్దాలు చేస్తూ వెళ్లాలని తెలిపారు.


రైమతి ఘురియా


సుబాసా మోహన్తా



చిరుధాన్యలక్ష్మికళ

కలెక్టర్ పిల్లలు కలెక్టర్, హీరో పిల్లలు హీరో, రాజకీయ నాయకుడు పిల్లలు రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటే, ఇక మధ్యతరగతి తల్లిదండ్రులు... తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని, తిని, తినక ఒక్కోరూపాయి పోగుచేసి, కష్టపడి చదివించి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే రైతన్నలు మాత్రం తమ పిల్లలు తమలా రైతులు కావాలని అస్సలు కోరుకోవడం లేదు. ''పెద్దయ్యాక రైతును అవుతాను'' అని కూడా ఎవరూ చెప్పరు. ''మేము వ్యవసాయం చేస్తాం, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాం. ఇప్పుడు ప్రపంచ దేశాధ్యక్షులు సైతం మేము చెప్పబోయేది ఆసక్తిగా వినబోతున్నారు అదీ వ్యవసాయం గొప్పతనం'' అని చాటిచెబుతున్నారు ఇద్దరు మహిళా రైతులు.

అవును గొప్పగొప్ప చదువులు చదివినవారి కంటే..తమ పూర్వీకుల నాటి నుంచి ఆచరిస్తోన్న పద్ధతులతో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టి తమవైపు తిప్పుకున్న రైతులకు జీ–20 సదస్సుకు ఆహ్వానాలు అందాయి. పెద్దపెద్ద డిగ్రీలు, హోదాలు లేకపోయినప్పటికీ.. కేవలం వ్యవసాయం చేస్తున్నారన్న ఒక్క కారణంతో ... ప్రపంచ దేశాధ్యక్షులు పాల్గొనే 'జీ–20 సమితి'లో పాల్గొనే అవకాశం ఇద్దరు మహిళా రైతులకు దక్కింది. ఒడిశాకు చెందిన గిరిజన మహిళా రైతులు 'రైమతి ఘురియా, సుబాసా మోహన్తా'లకు ఈ అరుదైన గౌరవం లభించింది. సంప్రదాయ, గిరిజన చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు పద్ధతులను జీ–20 వేదికపై ఈ ఇద్దరు ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

> జీ20 సదస్సుకు హాజరవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చిరుధాన్యాల సాగు, ఈ ధాన్యాల ప్రాముఖ్యత గురించి అందరికీ చెబుతాను. గిరిజన మహిళగా గిరిజన సాగు పద్ధతులను మరింత విపులంగా అందరికీ పరిచయం చేస్తాను.
> \- రైమతి ఘురియా

కోరాపుట్ జిల్లాలోని నౌగుడా గ్రామానికి చెందిన రైతే 36 ఏళ్ల రైమతి ఘురియా. భూమియా జాతికి చెందిన రైమతికి ముగ్గురు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తోంది. ఏళ్లపాటు వరిధాన్యాలు పండించే రైమతి... చిరుధాన్యాల సాగు మెళకువలు నేర్చుకుని మిల్లెట్స్ సాగు మొదలు పెట్టింది. అధునాతన సాంకేతికతను జోడించి పంటలో అధిక దిగుబడిని సాధిస్తోంది. సాగులోలేని 72 దేశీయ వరి రకాలు, ఆరు చిరుధాన్యాలతో కలిపి మొత్తం 124 రకాల ధాన్యాలను అంతరించిపోకుండా కాపాడుతోంది. మంచి దిగుబడితో సాధిస్తున్న రైతుగానే గాక, తోటి గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగులో సాయం చేస్తూ వారికీ జీవనోపాధి కల్పిస్తోంది. సంప్రదాయ పంటలైన వరి, మిల్లెట్ రకాలను పండిస్తూనే తన గిరిజన మహిళలెందరికో ఆదర్శంగా నిలుస్తూ... మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటమార్పిడి, అంతర పంటలు, సేంద్రియ పంటల్లో తెగులు నివారణ మెళకువల గురించి, స్కూలును ఏర్పాటు చేసి ఏకంగా 2500 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది. చిరుధాన్యాల సాగులో రైమతి చేసిన కృషికిగా గుర్తింపుగా అనేక ప్రశంసలు కూడా అందుకుంది. 2012లో జీనోమ్ సేవియర్ కమ్యునిటీ అవార్డు, 2015లో జమ్‌షెడ్జీ టాటా నేషనల్ వర్చువల్ అకాడమీ ఫెలోషిప్ అవార్డు, టాటా స్టీల్ నుంచి 'బెస్ట్ ఫార్మర్' అవార్డులే గాక, ఇతర అవార్డులు అందుకుంది.

చిరుధాన్యాల సాగులో అనుసరిస్తోన్న పద్ధతులు, దిగుబడి, తోటి రైతులను ఆదుకునే విధానమే రైమతిని జీ20 సదస్సుకు వెళ్లేలా చేసింది. ఈ సదస్సులో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు, ఈ ధాన్యాలతో చేసిన విభిన్న వంటకాలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గులను ప్రదర్శించనుంది. చిరుధాన్యాల సాగులో తాను ఎదుర్కొన్న పరిస్థితులు, అధిక దిగుబడి కోసం అవలంబిస్తోన్న విధానాలు వివరించనుంది. మిల్లెట్ సాగులో అనుసరించాల్సిన అధునాతన సాంకేతికత, దాని ఉపయోగాల గురించి ఎమ్ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ సెంటర్ ఇచ్చిన శిక్షణ సంబంధిత అంశాలను ప్రస్తావించనుంది.

> చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిచేస్తాయి. ఇవి అనేక రకాల వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఒకప్పుడు గిరిజనుల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. కానీ ఇప్పుడు పొలాల నుంచి దాదాపు కనుమరుగయ్యాయి. నేను ధాన్యాలు పండించడం మొదలు పెట్టిన తరువాత నన్ను చూసి చాలామంది రైతులు చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు. ఇతర రైతులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాను. వరికంటే చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు వస్తుండడంతో అంతా ఈ సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
> \- సుబాసా మోహన్తా

సుబాసా మొహన్తా

మయూర్‌భంజ్ జిల్లాలోని గోలి గ్రామానికి చెందిన చిరుధాన్యాల రైతే 45 ఏళ్ల సుబాసా మొహన్తా. తన జిల్లాలో ఎవరికీ చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఏమాత్రం లేదు. 2018లో ఒడిశా ప్రభుత్వం రైతులను చిరుధాన్యాల సాగు చేయమని మిల్లెట్ మిషన్‌ను తీసుకొచ్చింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితుల్లో ధైర్యం చేసి ముందుకొచ్చింది సుబాసా. ఏళ్లనాటి గిరిజన సాగుపద్ధతులను ఉపయోగిస్తూ రాగుల సాగును ప్రారంభించింది. అప్పటి నుంచి మిల్లెట్స్‌ను పండిస్తూ అధిక దిగుబడిని సాధిస్తోంది. ఇది చూసిన ఇతర రైతులు సైతం సుబాసాను సాయమడగడంతో వారికి సాగు పద్ధతులు, మెళకువలు నేర్పిస్తూ మిల్లెట్ సాగును విస్తరిస్తోంది. సుబాసాను ఎంతో మంది గిరిజన మహిళలు ఆదర్శంగా తీసుకుని చిరుధాన్యాలు సాగుచేయడం విశేషం. సుబాసా కృషిని గుర్తించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి.


గ్రామీణ మహిళలతో షెఫాలికా

మహిళా సాధికారతకు మార్గదర్శనం

పెద్ద ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కన్న షెఫాలికా పండా ఆ కలకు దూరమై పేదలకు దగ్గరైంది. మహాపట్టణం నుంచి మారుమూల పల్లె వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. తమ ఫౌండేషన్ తరఫున ఎంతోమందికి అండగా నిలబడింది. కష్టాలు, సమస్యల్లో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది.

'జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్' కన్వీనర్‌గా స్త్రీ సాధికారతకు సంబంధించి విస్తృత స్థాయిలో పనిచేసే అవకాశం షెఫాలికా పండాకు లభించింది...

కాలేజీ రోజుల్లో 'సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలని కలలు కనేది షెఫాలికా. అయితే ఒకానొక సంఘటనతో ఆమె కలల దారి మారింది. తమ బంధువు ఒకరు అనారోగ్యం పాలుకావడంతో, ఒడిషాలో సరియైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఢిల్లీకి తీసుకుపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి అసౌకర్యాల వరకు ఎన్నో సంఘటనలను దగ్గరగా చూసింది షెఫాలికా పండా.

'చదువుకున్న వారు, ఆర్థికంగా కాస్త మెరుగైన స్థితిలో ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే ఒడిశాలోని మారుమూల ప్రాంతాలలో ఉండే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?' అని ఆలోచించింది. ఆ ఆలోచనల ఫలితంగా సేవారంగంలోకి వచ్చిన షెఫాలికా ఎంతోమంది పేదలకు అండగా నిలబడింది.

బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లింది.

'నాయకుల ఎదుగుదలకు సంబంధించి అనుభవం అనేది కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎంత అనుభవం ఉంటే అంత బలం సమకూరుతుంది. సామాజిక సేవా రంగంలో పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు తేవాలనుకునేవారికి సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు దానిపై పని చేయడానికి చాలా ఓపిక కావాలి. సామాజిక సేవలో మా అత్తమ్మ 'ఇలా పండా' నాకు ఆదర్శం. ఎలాంటి ఆడంబరం లేకుండానే ఎన్నో సంవత్సరాలు సేవ చేసింది. ఎండనకా, వాననకా తిరిగినా ఆమె ముఖంలో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సామాజిక సేవ తన ఆరోగ్య రహస్యంగా చెప్పుకునేది. ఆమె చురుకుదనం, సామాజిక సేవాదృక్పథాన్ని చూసి ఎంతో మంది స్ఫూర్తి పొందారు. అందులో నేను ఒకరిని' అంటుంది షెఫాలికా.

'అవసరం ఉన్న చోట మేముంటాం' అనే నినాదంతో బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ట్రస్టీ, సీఈవోగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టింది.

'మహిళలపై ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణం అసమానత, లింగ వివక్షత. మహిళల జీవితాలు మారాలంటే ఆమె పిల్లల జీవితాల్లో కూడా మార్పు రావాలని బలంగా నమ్ముతాను' అంటుంది షెఫాలికా.



> అవకాశాలు దొరికేవారు, దొరకని వారు అని మహిళలకు సంబంధించి రెండు రకాల వర్గీకరణలున్నాయి. అవకాశాలు దొరికేవారు సులభంగానే విజయం సాధించి పెద్ద స్థాయికి చేరుకుంటారు. మరి దొరకని వారి పరిస్థితి ఏమిటి? సాంకేతిక, జీవన నైపుణ్యాలు, చదువు రూపంలో అలాంటి వారిని వెలుగులోకి తీసుకువచ్చి విజయపథంలోకి తీసుకువెళ్లడంపై, మహిళలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై జీ20 సదస్సు దృష్టి పెడుతుంది. జీ20 ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారవేత్తలు కావాలనుకునేవారికి, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంతో మేలు జరుగుతుంది. 30,000 మంది ఎంటర్‌ప్రెన్యూర్‌ల అనుభవాలు పాఠాలుగా ఉపయోగపడతాయి.
> \- షెఫాలికా, కన్వీనర్, జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటర్‌షిప్

* స్ఫూర్తి

చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ

మూసారాంబాగ్ సమీపంలోని సలీం నగర్‌లో తెల్లవారుజామున 'చెత్తబండొచ్చిందమ్మా' అని అరుస్తూ కనిపిస్తుంది జయలక్ష్మి. డిగ్రీ చదువుతూ తల్లి నడిపే చెత్తబండిలో సాయం చేస్తుంది జయలక్ష్మి. 'ఎదగాలనుకుంటే చెత్త నుంచి కూడా ఎదగొచ్చు' అంటుందా అమ్మాయి. తాను నివాసం ఉండే మురికివాడ పిల్లల కోసం ట్యూషన్లు చెబుతూ, వాలంటీర్‌గా పని చేస్తూ, ప్రతిష్ఠాత్మక 'గాంధీ - కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్'లో భాగంగా జూన్‌లో అమెరికా వెళ్లి వచ్చింది జయలక్ష్మి. చిన్న చితకా సవాళ్లకే డీలా పడుతున్న యూత్‌కు జయలక్ష్మి ఇచ్చే స్ఫూర్తి చాలానే ఉంది.

యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యు.ఎస్.ఐ.ఇ.ఎఫ్) వారి 'గాంధీ- కింగ్ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్' స్కాలర్‌షిప్ పొంది, అమెరికా వెళ్లి రెండు వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతితో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు మన దేశవ్యాప్తంగా 4 వేల అప్లికేషన్లు వచ్చాయి. వారిలో కేవలం 10 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆ పది మందిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో ఒకరు అరిపిన జయలక్ష్మి.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ సమీపంలో అతి పెద్ద మురికివాడ– సింగరేణి కాలనీలో ఉంటూ, చెత్త బండి లాగుతూ చదువుకుంటున్న ఈ అమ్మాయి ఇలా అమెరికా వరకూ చేరుకోవడం సామాన్యం కాదు. పోరాడే తత్వం, సాధించాలనే పట్టుదల ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. జయలక్ష్మిలోని అసాధారణమైన చొరవ, తపన ఆమెను ఇలా ముందుకు నడుపుతున్నాయి.


అమెరికాలో జయలక్ష్మి

ముగ్గుపిండి అమ్మే దళిత కుటుంబం

అరిపిన జయలక్ష్మిది రాయలసీమ ప్రాంతానికి చెందిన దళిత కుటుంబం. తండ్రి రామ్మోహన్, తల్లి హుసేనమ్మ చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని హైదరాబాద్ వలస వచ్చారు. వీరి ఇళ్లల్లో ముగ్గుపిండి అమ్ముకుని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే జయలక్ష్మి తల్లిదండ్రులు చెత్తబండి నడపడాన్ని ఉపాధి చేసుకున్నారు. 'అమ్మ ఒక బండి, నాన్న ఒక బండి నడుపుతారు. కాలనీ వాళ్లు నెలకు ఇంతని ఇచ్చే డబ్బులే మాకు జీవనాధారం. గవర్నమెంట్ నుంచి ఏమీ జీతం రాదు. చెత్త తీయడం చాలా కష్టమైన పని. నాన్న తానొక్కడే చెత్త తీయగలిగినా అమ్మకు కష్టమని నేను ఏడో క్లాస్ నుంచి ఇవాళ్టి వరకూ ఆమెకు తోడు వెళుతూనే ఉన్నాను. చెత్త సేకరించడం, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, డంపింగ్ యార్డ్‌లో పడేయడం అన్నీ చేస్తాను. ఇది చాలా దారుణమైన పని అని కొందరు అంటారు. కాని నా మటుకు నాకు ఇది అన్నం పెట్టే వృత్తి. నేను దానిని గౌరవిస్తాను. మా ఇంట్లో నేను కాకుండా అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. అందరూ మంచిగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని మా అమ్మ తపన. అంతవరకు ఈ పని చేయకతప్పదు' అంటుంది జయలక్ష్మి.


బండిలో చెత్త వేస్తున్న జయలక్ష్మి

ఎన్.జి.ఓ దృష్టిలో పడి

జయలక్ష్మి చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. కాలనీలోని సమస్యలపై మాట్లాడేది. స్కూల్లో ఒకసారి ఇలాగే మాట్లాడితే 'మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్' అనే ఎన్.జి.ఓ దృష్టిలో పడింది. పేదవర్గాల కోసం పని చేసే ఆ సంస్థ జయలక్ష్మిని తన కార్యకలాపాల్లో భాగం చేస్తూ ప్రోత్సహించింది.

'స్లమ్స్‌లో ఉండే పిల్లల వికాసం కోసం నేను పని చేశాను. హైదరాబాద్‌లో 56 స్లమ్స్ ఉంటే వాటిలో 21 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. మేమందరం మహిళా సంక్షేమ శాఖ దగ్గరకు వెళ్లి మాట్లాడి వాటిని సాధించాం' అంటుంది జయలక్ష్మి. ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకుని తన వాడ నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్న జయలక్ష్మి తన వాడలోని పిల్లలకు సాయంత్రాలు ట్యూషన్ చెప్తూ వారి చదువుకు మేలు చేస్తోంది. 'కోవిడ్ సమయంలో మా కాలనీలో నేను కార్యకర్తగా పని చేశాను. కోవిడ్ రాకుండా చాలా వరకు సక్సెస్ అయ్యాను' అంది.

ఐ.ఏ.ఎస్ కావాలని

'యువతకు నాయకత్వ లక్షణాలు ఉండాలి. హక్కుల కోసం పోరాడాలి. అమెరికాలో శాంతియుత పోరాటాల విజయగాథలను అధ్యయనం చేయగలగడం నా అదృష్టం. ఒక యువ ప్రతినిధిగా పోరాడుతూనే ప్రజల సేవ కోసం ఐ.ఏ.ఎస్ సాధించాలనుకుంటున్నాను. అందుకు కావలసిన సహాయం పొందగలననే అనుకుంటున్నాను. నాకు ఎంతమంచి పేరున్నా చెత్త అమ్మాయి అనే పిలుస్తారు కొందరు. వారి చేత ఉత్తమ అమ్మాయి అనిపించుకునేందుకు, లక్ష్యం లేని వారి బుర్రలే చెత్త అని నిరూపించేందుకు మరింత కష్టపడతాను' అంది జయలక్ష్మి.

\- సాక్షి ఫీచర్స్ డెస్క్

* సందర్భం


జి.వి. ప్రసాద్

పక్షులతో ప్రయాణం

ఛాయాచిత్ర ప్రేమికుడు జి.వి. ప్రసాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ

ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానం. పక్షులు, వన్యప్రాణుల ఫొటోలు తీయాలంటే, గంటల కొద్దీ వేచి చూడాలి. వాటి ప్రశాంతతకు భంగం కలగకుండా ఫొటోలు తీయడం కత్తిమీద సాములాంటిదే. పారిశ్రామికవేత్త, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్‌కి మాత్రం అది ఆట విడుపు. ఆయన దేశ విదేశాల్లో పర్యటించి తీసిన ఫొటోలతో ఇటీవల 'ది బర్డ్స్ అండ్ బిలీఫ్స్' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా... సాక్షితో సంభాషణ.



■ **ఔషధాల తయారీ రంగంలో తీరిక లేకుండా ఉండే మీకు, పక్షుల కోసం పర్యటనలు, ఫొటోగ్రఫీ హాబీ ఎప్పటి నుంచి?**

గత పది, పదిహేనేళ్లుగా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి, స్వయంగా తీసిన ఫొటోల సమాహారమే ఈ పుస్తకం. కొన్ని ఫొటోలతో పుస్తకాన్ని తీసుకురావాలని, మరికొన్నింటితో ప్రదర్శన ఏర్పాటు చేయాలని నా ఆలోచన. గతంలో రెండు పుస్తకాలు ప్రచురించాను. ఒకటి అలాస్కా మీద, మరొకటి స్పితి వ్యాలీ. ఇది మూడో పుస్తకం.

■ **'బర్డ్స్ అండ్ బిలీఫ్స్' లో మంచి కొటేషన్‌లు కూడా కనిపిస్తున్నాయి!**


నన్ను ప్రభావితం చేసే సూక్తులు కనిపించినప్పుడు, విన్నప్పుడు పుస్తకంలో రాసుకోవడం నాకు పాతికేళ్లుగా అలవాటు. వాటిలో కొన్నింటిని ఇందులో పొందుపరిచాను. ఈ పుస్తకం నా అభిరుచికి, జ్ఞాపకాలకు నిలువుటద్దం.

■ **ఇందులో ఏఏ ప్రదేశాల పక్షులున్నాయి?**

మనదేశంలో దక్షిణాదిలో హైదరాబాద్, ఉత్తరాది నుంచి భరత్‌పూర్, కాన్హా నేషనల్ పార్క్. ఆఫ్రికా ఖండంలో కెన్యా, టాంజానియా, బొట్సువానా, నార్త్ ఆర్కిటిక్, అంటార్కిటికా తదితర ప్రాంతాల పక్షుల ఫొటోలున్నాయి. అంటార్కిటికాలో పెంగ్విన్స్ కూడా తీశాను. నార్త్ అమెరికాలో అలాస్కా కూడా కవర్ చేశాను. ఈ ప్రాంతాలలో కనిపించే పక్షులతో పాటు క్షీరదాలు, ప్రకృతి ఫొటోలూ తీశాను. కానీ, ఈ పుస్తకాన్ని మాత్రం పక్షుల కోసమే కేటాయించాను.

■ **వలస పక్షులు భారీగా వచ్చే ఆంధ్రప్రదేశ్, పులికాట్ సరస్సుకు వెళ్లారా?**

వెళ్లాను, ఫ్లెమింగో ఫొటోలు తీశాను. కానీ ఈ పుస్తకంలో ప్రచురించలేదు.



■ **బర్డ్ వాచింగ్ కోసం విభిన్నమైన అనేక ప్రాంతాలను సందర్శించారు. మీకు బాగా నచ్చిన ప్రదేశం, సందర్భం, ఫొటో ఏది?**

అలాస్కాలో ల్యాండ్ స్కేప్‌లు, మంచినీటి సరస్సులు, ఉప్పు నీటి చెరువులు, పొరలు పొరలుగా పేరుకుపోయిన మంచు... మొత్తంగా చూస్తే ప్రకృతి అద్భుతంగా స్ఫూర్తిదాయంగా అనిపిస్తుంటుంది. పెద్ద ఎలుగుబంట్లు, బాల్డ్ ఈగల్స్, సాల్మన్ చేపలతోపాటు రకరకాల చేపలుంటాయి. సముద్రం నుంచి మంచి నీటి సరస్సుల వైపుకు గుంపులుగా వచ్చే చేపల్ని చూడడం వర్ణించలేనటువంటి అనుభూతి. అలాగే మరొకటి... ఆఫ్రికాలో ప్రాణులు వలస వెళ్లడం. వైల్డ్ బీస్ట్ పెద్ద సంఖ్యలో నదిని దాటుతున్న దృశ్యం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది.

■ **ఆర్నిథాలజిస్టు ఆశిష్, కెమెరా మెళకువలు నేర్పిన సురేశ్ చిత్తూరి గురించి మీ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు!**

ఆశిష్‌తో చాలా ఏళ్ల పరిచయం. వాళ్ల పిల్లలు, మా పిల్లలు క్లాస్‌మేట్స్. బర్డ్ వాచింగ్‌ను పరిచయం చేసింది ఆయనే. ఇక శ్రీనివాస హ్యాచరీస్ సురేశ్ చిత్తూరి కూడా నాకు మంచి మార్గదర్శి.

■ **ఎన్నిరకాల పక్షులను ఫొటో తీశారు?**

రెండువందలకు పైగా పక్షి జాతులను ఫొటో తీశాను.

■ **మీ పుస్తకంలో పాలపిట్ట, కాకి, కోకిల కనిపించాయి. కానీ రామచిలుక కనిపించలేదు! అలాగే కొల్లేటి కొంగలు, చిల్కా సరస్సులో విహరించే పక్షులను మేము తర్వాతి పుస్తకంలో చూడవచ్చా?**

రామచిలుకల ఫొటో తీశాను. కానీ, పుస్తకానికి ఫొటోల ఎంపికలో వదలిపెట్టాను. కొల్లేరు వెళ్లలేదు. చిల్కా సరస్సుకు వచ్చే ఏడాది వెళదామనుకుంటున్నాను.

శాస్త్రీయతకు గౌరవం

డాక్టర్ రెడ్డీస్ సంస్థలో 1990 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ ప్రసాద్ ఆ సంస్థ ఎదుగుదల, 66 దేశాలకు విస్తరణలో తనవంతుగా విశేషమైన కృషి చేశారు. సశాస్త్రీయమైన పరిశోధనల పరంపరలో ఆయనను వరించిన కొన్ని ప్రత్యేక గుర్తింపులు... పురస్కారాలివి.

- వైపీఓ గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డు– 2020
- వి. కృష్ణమూర్తి అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ బై ద సెంటర్ ఫర్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, 2019
- బౌండరీ బ్రేకర్ లీడర్ అవార్డ్, సీఈఓ అవార్డ్స్ 2018
- ఇండియా బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2015
- ఇండియాస్ బెస్ట్ సీఈవో బై బిజినెస్ టుడే, 2014
- ఇండియా టాలెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2014

■ **మీ నేపథ్యం మొత్తం హైదరాబాదేనా?**

లేదు, పాక్షిక హైదరాబాదీని. నాల్గవ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను. తర్వాత నెల్లూరులో 12వ తరగతి వరకు, రెండున్నరేళ్లు చెన్నై అన్నా యూనివర్సిటీ, ఆ తర్వాత చికాగోలో ఇలినాయిస్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పర్డ్యూ (Purdue University) యూనివర్సిటీలో పూర్తి చేసి హైదరాబాద్‌కి వచ్చాను.

■ **పుస్తకం విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని వన్యప్రాణుల సంరక్షణ కోసం విరాళమని ప్రకటించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపట్లేదని అనుకుంటున్నారా?**

ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. కానీ, ప్రభుత్వం ఒక్కటే అన్నింటినీ పరిష్కరించలేదు. వ్యక్తుల విరాళాలు చాలా ఉపయోగ పడతాయి. పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణ ముఖ్యమైన అంశం అని నేను మద్దతు ఇస్తున్నాను. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయిస్తున్నాం. పుస్తక విక్రయాలతో వచ్చే డబ్బు నాకవసరం లేదు. ఉచితంగా ఇస్తే పుస్తకం గౌరవం తగ్గిపోతుంది. అందుకే విక్రయాలను మంచి పనికి విరాళంగా ఇవ్వాలనుకున్నాను.

■ **అంజిరెడ్డి (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకులు)గారు చెప్పినట్లుగా మన కుండ నిండిన తర్వాత, అదనంగా వచ్చి పడుతున్న నీటిని మరొకరికి ఉపయోగపడేలా చేయాలి అనే సూత్రాన్ని పాటిస్తున్నారా? ఆయన నుంచి అలాగే మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?**

మా నాన్నగారు (గ్రీన్ పార్క్ హోటల్ వ్యవస్థాపకులు) చాలా డీటెయిల్ ఓరియెంటెడ్. మనం చేస్తున్న పని గురించి సూక్ష్మ స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెబుతారు. వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడేవారు. మా మామగారు (అంజిరెడ్డి) విజన్ చాలా విస్తృతమైనది. వారిద్దరినీ ఒకే 'ఫ్రేమ్'లో చెప్పాలంటే... 'అడవి అందులో చెట్లు' అని చెప్పవచ్చు. అంజిరెడ్డి గారి ద్వారా అడవిని చూస్తే, మా నాన్న గారి ద్వారా అందులో వృక్షాలను చూశాను.


■ **పాఠకులకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?**

'ప్రపంచంలోని ప్రతిదీ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మన ఆరోగ్యం అడవి ఆరోగ్యంతో ముడిపడి ఉంది. మన శ్రేయస్సు కోసం ప్రకృతి పరిరక్షణ తప్పనిసరి' అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ 'కొంతవరకైనా ప్రకృతితో మమేకమవుదాం' అనుకుంటే... ప్రకృతి పరిరక్షణ కోసం చేయగలిగిన చిన్న చిన్న పనులు అందరమూ చేయగలుగుతాం.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

నీ పెయిన్స్‌కి సహజ నివారణ ఇలా...

మన పెద్దవాళ్లు వృద్ధాప్యంలో కూడా ఎంతో బలంగా ఉండేవారు.. అయితే మారుతున్న జీవనశైలి కారణంగా వారిలో కూడా శరీర సమస్యలు వస్తున్నాయి. చాలా మంది వృద్ధుల్లో మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. దీంతోపాటు ఆధునిక జీవన శైలికి అలవాటు పడ్డ యువతలో కూడా ఇవే సమస్యలు వస్తున్నాయి. మోకాళ్లనొప్పుల కారణంగా నడవడానికి చాలామంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మోకాళ్ల నొప్పులు ఇతర సమస్యలకు కూడా దారి తీయొచ్చు. మోకాళ్ల నొప్పులను తట్టుకోలేక చాలామంది పెయిన్ కిల్లర్స్ అంటే నొప్పి నివారణిలను ఆశ్రయిస్తుంటారు. వీటివల్ల ఎన్నో దుష్ప్రభావాలు కలుగుతాయి. అందువల్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని సహజ చిట్కాలను తెలుసుకుందాం.



ఆర్థరయిటీస్, ఆస్టో ఆర్థరయిటీస్, రుమటాయిడ్ ఆర్థరయిటీస్ వంటి కొన్ని రకాల అనారోగ్య కారణాలతోపాటు సరైన దినచర్యను పాటించకపోవడం, తీసుకునే ఆహారాల్లో తగినన్ని పోషకాలు లేకపోవడం, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా కూడా మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. అయితే ఈ నొప్పులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని ఆ తర్వాత ఈ సమస్యల నుంచి శాశ్వతంగా ఉపశమనం పొందడానికి కొన్ని మార్గాలను అన్వేషిద్దాం.



కలబంద

ఆయుర్వేద నిపుణులు కలబందను ఔషధంగా భావిస్తారు. ఇందులో శరీరానికి కావాల్సిన చాలారకాల ఔషధ గుణాలు లభిస్తాయి. కాబట్టి తీవ్ర మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు నొప్పి ప్రభావిత ప్రాంతంలో ప్రతిరోజు అలోవెరా జెల్‌ను అప్లై చేసి సున్నితంగా మర్దన చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల సులభంగా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా మోకాళ్ల వాపులు కూడా తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు.



పసుపు

పసుపు యాంటీ బాక్టీరియల్‌గా పని చేస్తుంది. ఇందులో అనేక రకాల ఔషధ గుణాలు లభిస్తాయి. కాబట్టి దీనిని అన్నిరకాల వ్యాధులకు వినియోగించవచ్చని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు ప్రతిరోజు పసుపును వినియోగించడం వల్ల సులభంగా ఉపశమనం లభిస్తుంది. అయితే దీనిని వినియోగించే ముందు ఒక బౌల్ తీసుకుని అందులో ఆవాల నూనెను వేసి.. ఒక టీ స్పూన్ పసుపును వేసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ప్రభావిత ప్రాంతంలో అప్లై చేస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది.



అల్లం

మోకాళ్ల నొప్పుల నివారణకు ఉపయోగించే మందులలో అల్లాన్ని బాగా ఉపయోగిస్తారు. కొన్ని అల్ల ముక్కలను తీసుకుని వాటిని గ్లాసు నీళ్లలో వేసి బాగా మరగబెట్టాలి. మనం తీసుకున్న నీటి పరిమాణం సగానికి తగ్గిందని నిర్ధారించుకున్న తర్వాత స్టవ్ మీదినుంచి దింపి గోరువెచ్చగా అయిన తర్వాత వడకట్టి తాగాలి. రుచికి తేనె, నిమ్మరసం వంటివి కలుపుకోవచ్చు.



కర్పూర తైలం

తీవ్ర మోకాళ్ల నొప్పుల కారణంగా బాధపడేవారు కర్పూరం నూనెను కూడా వినియోగించవచ్చని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు అన్ని రకాల నొప్పుల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి. దీనిని వినియోగించాలనుకునేవారు ముందుగా కర్పూరం నూనె తీసుకుని బౌల్‌లో పోసుకుని గోరువెచ్చగా చేయాలి. ఆ తర్వాత ఈ నూనెను ప్రభావితం ప్రాంతంలో అప్లై చేసి 15 నిమిషాల పాటు బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల సులభంగా తీవ్ర మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

చింతగింజల పొడి

మోకాళ్లలో గుజ్జు అరిగిపోవడం వల్ల వచ్చే నొప్పులు తగ్గాలంటే కాస్తంత చింతగింజల పొడిని వేడినీళ్లలో వేసి బాగా మరగబెట్టి వడకట్టి తాగుతుండాలి. అలాగే దీనిలో పాలు కలపకుండా బెల్లం పొడి వేసి పాయసంలా చేసుకుని కూడా తాగచ్చు.

నల్లేరు కాడలతో తయారు చేసిన పచ్చడిని, బెండకాయలను, గోరుచిక్కుడు కాయలను ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల మోకాళ్ల నొప్పుల నుంచి సహజ ఉపశమనం లభిస్తుంది.

ఏదైనా గాయం వలన కానీ మెడికల్ కండిషన్ వలన కానీ మీరు రోజూ చేసే పనులన్నీ బట్టి కానీ మోకాళ్ళ నొప్పులు సహజంగా వచ్చే అవకాశం ఉంది.

ఎక్కువగా మోకాళ్ల నొప్పులు ఉంటే కచ్చితంగా డాక్టర్ సలహా తీసుకోవాలి. మోకాళ్ళ నొప్పులు తగ్గాలంటే అల్లం, పసుపు బాగా పని చేస్తాయి. ఒక గ్లాసు నీళ్ల తీసుకుని అందులో అల్లం, పసుపు వేసి 15 నిమిషాల పాటు ఆ నీటిని మరిగించండి. తర్వాత ఈ జ్యూస్ తీసుకున్నట్లయితే మోకాళ్ళ నొప్పులు తగ్గే అవకాశం ఉంది.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువగా ఉంటే కనక హీట్, కోల్డ్ కంప్రెస్ అంటే కాపడం పెట్టవచ్చు. హీట్ కంప్రెస్‌ని నొప్పి ఎక్కువ ఉంటే మాత్రం వాడకూడదు. ఎందుకంటే ఇంకా నొప్పి కలుగుతుంది. ఆర్థరైటిస్‌తో బాధపడే వాళ్ళకి వేడినీటి కాపడం బాగా పనిచేస్తుంది. ఆటలు సమయంలో గాయాలైనప్పుడు కోల్డ్ కంప్రెసర్ బాగా తోడ్పడుతుంది.

ఎప్సం సాల్ట్‌ని స్నానం చేసే నీళ్లలో వేసుకుని స్నానం చేస్తే ఉపశమనం లభిస్తుంది.



అరకప్పు ఆపిల్ సైడర్ వెనిగర్‌ని ఒక గ్లాసు నీళ్లలో వేసుకుని తాగితే మోకాళ్ళ నొప్పులు బాగా తగ్గుతాయి. రాత్రి నిద్రపోయేటప్పుడు తాగితే చాలా చక్కగా ఈ చిట్కా పనిచేస్తుంది.

బరువు నియంత్రణ

సాధ్యమైనంత వరకు మన వెయిట్ మానేజ్ చేసుకుంటూ ఉండాలి. ఎక్కువ బరువు పెరగడం వల్ల మోకాళ్ల పైన భారం పడి, మోకాళ్ళ నొప్పులు పెరిగే అవకాశం ఉంది. అందుకని బరువుని మేనేజ్ చేసుకుంటూ మోకాళ్లపై ఒత్తిడి పడకుండా చూసుకోవాలి. బరువు తగ్గడం కోసం వ్యాయామాలు కూడా చేసుకోవచ్చు.

మీకు తెలుసా?

స్నానానికి వేడినీళ్లా? చన్నీళ్లా?



కొందరు చన్నీళ్ల స్నానమే మంచిదంటారు. మరికొందరు వేడి వేడి నీళ్ల వల్ల హానికారక క్రిములన్నీ తొలగిపోయి ఆరోగ్యం సమకూరుతుందనుకుంటారు. ఈ రెండూ అపోహలే. స్నానానికి నీళ్లు మరీ చల్లగా ఉండకూడదు. మరీ వెచ్చగా ఉండకూడదు. గోరువెచ్చని నీళ్లతో స్నానమే ఆరోగ్యం. ఇక బలహీనంగా ఉన్నవాళ్లు, వయసుపైబడిన వృద్ధులు మరీ ఎక్కువ చన్నీళ్ల స్నానం కాని, మరీ ఎక్కువ వేణ్ణీళ్లతో కానీ స్నానం చేయద్దు.

ఒకవేళ మీరు మీ వృత్తిరీత్యా వేరే ఊళ్లలో ఉండటం వల్ల వేణ్ణీళ్లు పెట్టుకోవడం సాధ్యం కావడం లేదా? ఇలా మరీ చన్నీళ్ల స్నానమే చేయడం తప్పకపోతే... స్నానం చేసే వ్యవధిని వీలైనంత కుదించండి. నీళ్లు ఎంత చల్లగా ఉంటే... స్నానం వ్యవధి అంతగా తగ్గాలి. చన్నీళ్లతో స్నానం చేసే అలవాటు ఉన్నవారు... స్నానానికి ముందర చల్లటి నీళ్లు తాగకండి.

చన్నీళ్లు గానీ లేదా వేణ్ణీళ్లు గానీ... వాటితో స్నానం చేశాక ఒకవేళ తలనొప్పి లేదా జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తే... అవి (చన్నీళ్లు / వేణ్ణీళ్లు) మీకు అంతగా సరిపడవని గుర్తించి, ఆ మేరకు గోరువెచ్చని నీటికి షిఫ్ట్ అవడం మంచిది.

గ్రీన్ టీ తాగుతున్నారా? అయితే ఇది మీ కోసమే!



బరువు తగ్గాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనుకునే వారు చాలామంది తమ ఆహారంలో భాగంగా గ్రీన్ టీ తీసుకుంటారు. ఎందుకంటే ఇది మన శరీరానికి చాలా ప్రయోజనాలను అందిస్తుంది. అయితే రోగ్యానికి మంచిదని అధికంగా తీసుకోవడం వల్ల మన శరీరంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. గ్రీన్ టీ ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో కాలేయ సమస్యలు వస్తాయని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రీన్ టీ తీసుకునేటప్పుడు గర్భిణులు, పాలిచ్చే తల్లులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాలేయ వ్యాధులు ఉన్నవారు గ్రీన్ టీ తీసుకోకపోవడమే మంచిది. గ్రీన్ టీ తాగేవారికి ఇతర మందులతో రియాక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల మీరు ఇప్పటికే ఏవైనా ఇతర మందులు వాడుతున్నట్లయితే ఒకసారి వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే మీరు దీన్ని మీ ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.

గ్రీన్ టీ అధికంగా తీసుకోవటం వల్ల తలనొప్పి రావచ్చు. ఇది రక్తపోటును అమాంతం తగ్గించే అవకాశం ఉంది. ఇది అశాంతిని కలిగిస్తుంది. నిద్రలేమికి కారణం అవుతుంది. జీర్ణవ్యవస్థకు చికాకు కలిగిస్తుంది. భయాన్ని, ఆందోళనను కలిగిస్తుంది.గ్రీన్ టీ తీసుకున్న తర్వాత ఏవైనా సైడ్ ఎఫెక్ట్స్ గమనించినట్టయితే... మీరు వెంటనే మీ వైద్యుడిని సంప్రదించాలి.

ఆరోగ్యానికి ఆవ పెట్టండి!



వంటలు మరింత రుచిగా రావడం కోసం పోపు పెట్టడం తెలుగువారి అలవాటు. ఈ పోపులో ఎక్కువగా వినియోగించే వాటిల్లో ఆవాలు ఒకటి. ఆవాలు ఆహార పదార్థాలకు రుచిని ఇవ్వడమే శరీరానికి చాలా రకాలుగా సహాయపడతాయి. ఇందులో ఉండే ఔషధ గుణాలు అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ప్రస్తుతం చాలామందికి వీటిని తినడమే తప్ప వీటివల్ల కలిగే లాభాలు ఏంటో తెలియదు. ఆవాలను తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

పోపులో వేసే దినుసులలో ఎవరైనా సరే ముందుగా చెప్పేది ఆవాలనే. ఈ ఆవాల వల్ల ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం ఉంది. వాటిలో గాయాలు తొందరగా మానడం ముందుగా చెప్పుకోవచ్చు. ఈ గాయాలు తగిలిన చోట ప్రతి రోజు ఆవాల పొడిని అప్లై చేయడం వల్ల తొందర్లోనే మంచి ఫలితాలు పొందుతారు. ఆధునిక జీవనశైలి కారణంగా చాలామందిలో దంతాల సమస్యలు వస్తున్నాయి. తరచు దంతాల నొప్పితో బాధపడేవారు ఆవాలను నీటిలో మరిగించి ఆ నీటిని పుక్కిలించి ఉమ్మెయ్యడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి. అంతేకాకుండా దంతాల నొప్పి నుంచి సులభంగా లభిస్తుంది.

ఆవాలు శ్వాస కోసం సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగించేందుకు సహాయపడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తరచుగా ఇలాంటి సమస్యలతో బాధపడే వారు ఒక టీ స్పూన్ ఆవాల పొడిలో, ఒక టీ స్పూన్ ఆవాలను కలుపుకొని తీసుకోవడం వల్ల సులభంగా శ్వాస కోసం వ్యాధులనుంచి ఉపశమనం కలుగుతుంది. ఆవాలు కీళ్ల నొప్పుల నుంచి కూడా ప్రభావంతంగా ఉపశమనం కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. కీళ్ల నొప్పుల కారణంగా నడవలేకపోతున్నవారు ఒక టీ స్పూన్ ఆవాలు నూనె ఓ చిన్న గిన్నెలో తీసుకొని అందులోనే ఒక టీ స్పూన్ ఆవాల పొడి, కర్పూరం వేసి పేస్టులా తయారు చేసి ప్రభావిత ప్రాంతంలో అప్లై చేయడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. ఆవపిండితో తయారు చేసిన ఆహారాన్ని రోజూ తినడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా.. జీర్ణ క్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

డేట్ సెట్ గురూ..



'సలార్'లో ప్రభాస్

సినిమా సెట్ అనుకున్నప్పుడే చూచాయగా రిలీజ్ డేట్ కూడా సెట్ చేస్తుంటారు మేకర్స్. అలా కాకపోయినా షూటింగ్ సగం పూర్తయ్యాక సెట్ చేస్తారు. వన్ ఫైన్ డే ఆ డేట్‌ని అధికారికంగా ప్రకటిస్తారు. కానీ.. సెట్ చేసిన డేట్‌కి కొన్ని సినిమాలు విడుదల కాకపోవచ్చు. సాంకేతిక కారణాలు, ఇతర కారణాల వల్ల వాయిదా పడుతుంటాయి. అలా ప్రస్తుతం అరడజను చిత్రాల దాకా వాయిదా పడ్డాయి. ఏ సినిమా కారణం ఆ సినిమాది. ఇక అనుకున్న డేట్‌కి రాకుండా కొత్త డేట్ సెట్ చేసుకుని సిల్వర్ స్క్రీన్ పైకి రానున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

● ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సలార్'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అందులో భాగంగా 'సలార్: పార్ట్ 1–సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెలాఖరులో ప్రభాస్ ఫ్యాన్స్‌కి, సినిమా లవర్స్‌కి పండగే. అయితే ఈ సినిమా రిలీజ్ వాయిదా వేస్తున్నారంటూ వార్తలు షికారు చేస్తున్నాయి. గ్రాఫిక్స్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో విడుదల వాయిదా పడనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. అయితే 'సలార్' రిలీజ్ వాయిదాపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అనేదానిపై పాన్ ఇండియా స్థాయిలో చర్చ జరుగుతోంది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ సినిమాని దీపావళి కానుకగా నవంబర్‌లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. ముందుగా అనుకున్నట్లు ఈ నెల 28న సినిమాని విడుదల చేస్తారా? లేదా అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాలి. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు.

***



'స్కంద'లో రామ్, శ్రీలీల

● రామ్ పోతినేని హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'స్కంద' కూడా ముందు అనుకున్న తేదీకి కాకుండా వేరే తేదీకి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే తాజాగా మేకర్స్ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఈ నెల 15న కాకుండా 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అయితే సినిమా విడుదల తేదీ ఎందుకు మార్చాల్సి వచ్చిందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

***



'చంద్రముఖి-2'లో కంగన

● రజనీకాంత్ హీరోగా జ్యోతిక టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'చంద్రముఖి' (2005). పి. వాసు దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు 18 ఏళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'చంద్రముఖి 2'. తొలి భాగానికి దర్శకత్వం వహించిన పి. వాసునే రెండో భాగాన్ని తీశారు. అయితే సీక్వెల్‌లో హీరో, హీరోయిన్ మారారు. రాఘవ లారెన్స్ హీరోగా, కంగనా రనౌత్ టైటిల్ రోల్‌లో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే తాజాగా ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఈ నెల 15న కాకుండా 28న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాల వల్లే విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా 'చంద్రముఖి 2'ని తెలుగులో రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు.

***



'ఆదికేశవ'లో వైష్ణవ్ తేజ్

● వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా విడుదల కూడా వాయిదా పడింది. తొలుత ఈ చిత్రాన్ని జూలైలో రిలీజ్ చేయాలనుకున్నారు.. చేయలేదు. ఆ తర్వాత ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఆ తర్వాత అది కూడా వాయిదా పడి చివరికి నవంబర్ 10వ తేదీకి ఫిక్స్ అయింది. ఫారిన్‌లో కొంత షూటింగ్ బ్యాలెన్స్ ఉండటం వల్లే విడుదల వాయిదా వేస్తున్నట్లు 'ఆదికేశవ' చిత్రబృందం ప్రకటించింది.

***



'టిల్లు స్క్వేర్'లో సిద్ధు

● సిద్ధు జొన్నలగడ్డ, నేహా శెట్టి జంటగా విమల్ కృష్ణ దర్శకత్వం వహించిన 'డీజే టిల్లు' (2022) సినిమా సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపొందింది. ఈ చిత్రానికి డైరెక్టర్, హీరోయిన్ మారారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించారు. 'డీజే టిల్లు'ని నిర్మించిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ మూవీని కూడా ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే విడుదల వాయిదా పడింది. ''టిల్లు స్క్వేర్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. క్వాలిటీ ఔట్‌పుట్ కోసం విడుదల వాయిదా వేయక తప్పడం లేదు. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అంటూ మేకర్స్ ప్రకటించారు.

***



'పెద కాపు'లో విరాట్ కర్ణ

● 'నారప్ప' వంటి హిట్ మూవీ తర్వాత శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు–1'. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా నటించారు. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని తొలుత ఆగస్టులో విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించినా, వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు? అనేదానిపై తాజాగా చిత్ర యూనిట్ స్పష్టత ఇచ్చింది. ఈ నెల 29న 'పెదకాపు –1' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పబ్ రంజన్!



● కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి

'ప్రతి తండ్రి నన్ను చూసి నేర్చుకోవాల. అమ్మ పాలిచ్చి పెంచుద్ది, అయ్య మందిచ్చి ఓదార్చాల. చెప్పు నాన్న ఏం తాగుతావు?' (గోపరాజు రమణ). 'బీర్ ఓకే' (కిరణ్ అబ్బవరం) అనే సంభాషణలతో మొదలవుతుంది 'రూల్స్ రంజన్' ట్రైలర్. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రూల్స్ రంజన్'. నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీకృష్ణ వేమూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'మా ఆఫీస్‌లో వీకెండ్స్ వస్తే నన్ను ఏమంటారో తెలుసా.. మనోరంజన్ కాదు.. పబ్ రంజన్ అంటారు (కిరణ్ అబ్బవరం), 'ఈ రూల్స్ రంజన్ పంబ్ రంజన్‌గా ఎందుకు మారాడు? (మరో పాత్రధారి) అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. మెహర్ చాహల్, వెన్నెల కిశోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, వైవా హర్ష, అన్నూ కపూర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అమ్రిష్ గణేష్, సహనిర్మాత: రింకు కుక్రెజ.


కోట బొమ్మాళి పాట



● శ్రీకాంత్, రాహుల్ విజయ్

మలయాళ హిట్ ఫిల్మ్ 'నాయట్టు' (2021)కు తెలుగు రీమేక్‌గా 'కోట బొమ్మాళి పీఎస్' చిత్రం రూపొందుతోంది. శ్రీకాంత్ మేకా, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తేజ మార్ని దర్శకత్వంలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో ఉన్న శ్రీకాకుళం ఫోక్ సాంగ్‌ను ఈ నెల 11న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ''పూర్తి స్థాయి ఫోక్ సాంగ్‌గా రానున్న ఈ పాట ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్.

ద్రోహి వస్తున్నాడు



● సందీప్, క్రిష్, విజయ్ పెందుర్తి

సందీప్ కుమార్ బొడ్డపాటి, దీప్తి వర్మ జంటగా విజయ్ పెందుర్తి దర్శకత్వంలో రూపొందిన ఫిల్మ్ 'ద్రోహి'. 'ది క్రిమినల్' అనేది ఉపశీర్షిక. శ్రీకాంత్ రెడ్డి, విజయ్ పెందుర్తి, ఆర్. రాజశేఖర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు క్రిష్ మాట్లాడుతూ– ''ఈ సినిమా లుక్, గ్లింప్స్ ప్రామిసింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాకు పని చేసిన అందరికీ ఈ చిత్రం మంచి పేరు తీసుకు రావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ప్రేక్షకులు మెచ్చే అన్ని థ్రిల్లర్ అంశాలున్న చిత్రం ఇది. ఈ నెలలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు దర్శక–నిర్మాతలు. డెబి, 'షకలక' శంకర్, నిరోజ్, శివ, మహేశ్ విట్టా కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనంత్ నారాయణ.

ఓ విద్యార్థిని పోరాటం



● సదానంద్ శారద, ముఠా గోపాల్, శ్రీమాన్ గుమ్మడవెల్లి

శాన్వీ మేఘన, కౌశిక్ బాబు జంటగా శ్రీమాన్ గుమ్మడవెల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేనే సరోజ: ఉరఫ్ కారం చాయ్'. గాళ్స్ సేవ్ గాళ్స్ కాన్సెప్ట్ ఆధారంగా ఎస్ 3 క్రియేషన్స్ పతాకంపై రచయిత డా. సదానంద్ శారద నిర్మించిన చిత్రం ఇది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన శాసన సభ్యులు ముఠా గోపాల్ మాట్లాడుతూ– ''ఉన్మాదులను ఎదిరించే కాలేజీ విద్యార్థిని పాత్రలో శాన్వీ మేఘన పవర్‌ఫుల్‌గా నటించారు. ఓ సామాజిక అంశాన్ని తీసుకుని ఈ తరహా సినిమాను నిర్మించిన దర్శక–నిర్మాతలను అభినందిస్తున్నాను. ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఆడపిల్ల మీద దాడి చేసే ఉన్మాదులకు, వివక్ష చూపించేవారికి తాగిస్తాం కారం చాయ్ అంటూ గుణపాఠం చెప్పేలా సరోజ పాత్ర ఉంటుంది. కుటుంబసమేతంగా చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు శ్రీమాన్ గుమ్మడవెల్లి. ''ఆలోచనాత్మక సంభాషణలు.. శాన్వి వీరోచిత పోరాటాలు, ఆర్. ఎస్. నంద హాస్యం.. ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలు'' అన్నారు రచయిత, నిర్మాత సదానంద్ శారద.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
333	93
66,599	19,820

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాని రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,776	▲	37
డోజోన్స్	34,596	▲	39
ఎఫ్‌టీఎస్ఈ 100	7,478	▲	36
డాక్స్	15,740	▲	22
షాంఘై	3,117	▼	6
నికాయ్	32,607	▼	384

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,171	▼	18
బంగారం (22 క్యారట్)	58,934	▼	18
వెండి (కిలో)	71,017	▼	153

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.39	84.06
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.32	105.69
€	యూరో	ఒకటి	87.65	90.76
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.67	57.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.06	54.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.07	61.98
SAR	సౌదీ రియాల్	ఖాతాబదిలీ	21.16	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాబదిలీ	21.69	23.48
¥	చైనా యువాన్	ఖాతాబదిలీ	10.18	12.25

హాల్‌మార్కింగ్ మూడో దశ షురూ..

- కొత్తగా 55 జిల్లాల చేరిక
- ఇప్పటికే 288 జిల్లాల్లో అమలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బంగారు ఆభరణాలు, కళాఖండాలకు తప్పనిసరి హాల్‌మార్కింగ్ మూడవ దశ అమలులోకి వచ్చింది. సెప్టెంబర్ 8న నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 16 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 55 జిల్లాల్లో తప్పనిసరి హాల్‌మార్కింగ్ కొత్తగా అమలు చేస్తారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదు, తెలంగాణ నుంచి నాలుగు జిల్లాలు ఉన్నాయి. పుత్తడి స్వచ్ఛతను హాల్‌మార్కింగ్ ద్వారా ధ్రువీకరిస్తారు. హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ 2021 జూన్ 16 వరకు స్వచ్ఛందంగా ఉంది. ప్రభుత్వం దశలవారీగా తప్పనిసరి గోల్డ్ హాల్‌మార్కింగ్‌ని అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2021 జూన్ 23 నుంచి మొదలైన తొలి దశలో 256 జిల్లాలు, 2022 ఏప్రిల్ 4 నుంచి ప్రారంభమైన రెండవ దశలో 32 జిల్లాలను చేర్చారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) రెండు దశల్లో తప్పనిసరిగా హాల్‌మార్కింగ్‌ని విజయవంతంగా అమలు చేసింది. తాజా నోటిఫికేషన్‌తో తప్పనిసరి జాబితాలో చేరిన జిల్లాల సంఖ్య 343కు చేరింది.

26 కోట్లకుపైగా ఆభరణాలు...


ప్రతిరోజూ 4 లక్షలపైచిలుకు బంగారు ఆభరణాలు హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్‌తో (హెచ్‌యూఐడీ) తయారవుతున్నాయి. ఇప్పటి వరకు 26 కోట్లకుపైగా ఆభరణాలు హెచ్‌యూఐడీ అందుకున్నాయి. తప్పనిసరి హాల్‌మార్కింగ్‌ను అమలు చేసినప్పటి నుండి నేటి వరకు నమోదిత నగల వ్యాపారుల సంఖ్య 34,647 నుండి 1,81,590కి పెరిగింది. అస్సేయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రాలు 945 నుండి 1,471కి చేరాయి. వినియోగదార్లు బీఐఎస్ కేర్ యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్‌తో ఆభరణం ప్రామాణికత, స్వచ్ఛతను ధ్రువీకరించుకోవచ్చు. బీఐఎస్ కేర్ యాప్ డౌన్‌లోడ్స్ సంఖ్య 2021-22లో 2.3 లక్షలు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 12.4 లక్షలకు దూసుకెళ్లింది. రెండేళ్ల వ్యవధిలో బీఐఎస్ కేర్ యాప్‌లో 'వెరిఫై హెచ్‌యూఐడీ' హిట్స్ కోటికి పైగా నమోదయ్యాయని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



సోమవారం నుంచి తాజా గోల్డ్ బాండ్ స్కీమ్

న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్ కొత్త ఇష్యూ ఈ నెల 11న (సోమవారం) ప్రారంభం కానుంది. 15వ తేదీ వరకూ అందుబాటులో ఉండే ఈ స్కీమ్ ఇష్యూ ధర గ్రాముకు రూ.5,923. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే, రూ.50 డిస్కౌంట్ లభిస్తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది రెండవ విడత బాండ్ల జారీ. జూన్ 19న వెలువడిన మొదటి విడత బాండ్ జారీలో ధర గ్రాముకు రూ.5,926. గోల్డ్ బాండ్లు- షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీ-మ్యాట్ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

ఇష్యూ ధర గ్రాముకు రూ. 5,923





వృద్ధికి ఆర్‌బీఐ పెద్దపీట

- అక్టోబర్ 7 నాటికి ఐ-సీఆర్ఆర్ విధానం నుంచి పూర్తిగా బయటకు...
- బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా దాదాపు లక్ష కోట్లు!

ముంబై: వృద్ధే లక్ష్యంగా బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ-సీఆర్ఆర్) విధానం నుంచి అక్టోబర్ 7 నాటికి దశల వారీగా పూర్తిగా వైదొలగాలని నిర్ణయించింది. దీనితో బ్యాంకింగ్ వ్యవస్థలో దాదాపు రూ. లక్ష కోట్ల అదనపు నిధుల లభ్యత, ప్రస్తుత స్థాయిలోనే వడ్డీరేట్ల కొనసాగింపు వంటి సౌలభ్యతలు ఒనగూరే అవకాశం ఏర్పడుతుంది. రూ.2000 నోట్ల ఉపసంహరణ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతను వెనక్కు తీసుకోడానికి, తద్వారా ద్రవ్యోల్బణం కట్టడిలో ఉంచడానికి ఐ-సీఆర్ఆర్ నిర్వహించాలని బ్యాంకింగ్‌కు ఆగస్టు 10వ తేదీన ఆర్‌బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష సందర్భంగా ఆదేశించింది. ఈ సందర్భంగా ఆర్‌బీఐ కీలక ప్రకటన చేస్తూ... బ్యాంక్ మొత్తం డిపాజిట్‌లో లిక్విడ్ క్యాష్ రూపంలో ఆ బ్యాంక్ నిర్వహించాల్సిన నగదుకు సంబంధించిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని యథాతథంగా 4.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అయితే రూ.2,000 నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి రావడం, ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి అందిన డివిడెండ్ వంటి చర్యల వల్ల వ్యవస్థలో ఏర్పడిన అధిక ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) తగిన స్థాయి వరకూ వెనక్కు తీసుకోడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా మూడు నెలలకుపైగా కాలానికి (రూ.2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన తేదీ 2023 మే 19వ తేదీ నుంచి 2023 జూలై 28 వరకూ) ఎన్‌డీటీఎల్ (నెట్ డిమాండ్, టైమ్ లయబిలిటీ) ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ-సీఆర్ఆర్)10 శాతంగా అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల వ్యవస్థ నుంచి దాదాపు రూ.లక్ష కోట్లు వెనక్కు మళ్లుతున్నట్లు కూడా సూచన ప్రాయంగా తెలిపింది. తాజాగా ఈ నిధులను మళ్లీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వదులుతున్నట్లు ఆర్‌బీఐ వర్గాలు పేర్కొన్నాయి.

మూడు దశల్లో...

అమలైన ఐ-సీఆర్ఆర్‌లో 25 శాతం సెప్టెంబర్ 9న విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. సెప్టెంబర్ 23న మరో 25 శాతం, పెండింగ్‌లో ఉన్న 50 శాతం అక్టోబర్ 7న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 'ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఐ-సీఆర్ఆర్'ను దశలవారీగా నిలిపివేయాలని ఒక సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. చలామణి నుండి కరెన్సీని ఉపసంహరించుకున్న తేదీ మే 19న చెలామణిలో ఉన్న మొత్తం రూ. 2,000 కరెన్సీ నోట్లలో 93 శాతం బ్యాంకింగ్‌కు తిరిగి వచ్చినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

ఏపీలో ప్యానాసోనిక్ మరో రూ.300 కోట్లు

వారణాసి: స్విచ్‌లు, స్విచ్ బోర్డుల తయారీలో ఉన్న ప్యానాసోనిక్ ఎలక్ట్రిక్ వర్క్స్ ఇండియా సామర్థ్యం పెంపునకు ఆంధ్రప్రదేశ్‌లో మరో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 'శ్రీ సిటీ ప్లాంటులో తొలి దశలో ఇప్పటికే రూ.300 కోట్లు వెచ్చించాం. 2026 నాటికి మరో రూ.300 కోట్లు ఖర్చు చేస్తాం. ఎగుమతుల కోసం ఈ కేంద్రాన్ని వినియోగించుకుంటాం. తొలుత మధ్య ప్రాచ్య, ఆఫ్రికా దేశాలకు ఉత్పత్తులను సరఫరా చేస్తాం' అని ప్యానాసోనిక్ ఎలక్ట్రిక్ వర్క్స్ ఇండియా పవర్ బిజినెస్ యూనిట్ డైరెక్టర్ రాజేశ్ నంద్వానీ వెల్లడించారు. శ్రీ సిటీ, డామన్, హరిద్వార్ ప్లాంట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 62 కోట్ల యూనిట్లు ఉంది. 2025 నాటికి 70 కోట్లు, 2030 కల్లా 100 కోట్ల యూనిట్లకు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన ఈ సంస్థకు భారత్‌లో 8,900 పైచిలుకు సిబ్బంది ఉన్నారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-9-2023	
విశాఖ	500-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	495-00
8-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455-00
వరంగల్	457-00

రిలయన్స్ నుంచి ఏఐ సూపర్ కంప్యూటర్స్

ఎన్‌వీడియాతో భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, యూఎస్ టెక్నాలజీ దిగ్గజం ఎన్‌వీడియా చేతులు కలిపాయి. ఇరు సంస్థలు కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేస్తాయి. ఇటీవలే ఎన్‌వీడియా ఫౌండర్, సీఈవో జెన్సెన్ హ్యా భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. భారత్‌లో 2004లో అడుగుపెట్టిన ఎన్‌వీడియాకు హైదరాబాద్, గురుగ్రామ్, పుణే, బెంగళూరులో డెవలప్‌మెంట్ సెంటర్స్ ఉన్నాయి. మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,800 పైచిలుకు ఉంది. 'విస్తృత, వేగవంతమైన వృద్ధి కోసం డేటా వినియోగం నుండి సాంకేతిక మౌలిక సదుపాయాలను సృష్టించే దిశగా భారత్ ముందుకు సాగుతున్నప్పుడు.. డిజిటల్ వృద్ధిలో ఎన్‌వీడియాతో కలిసి అభివృద్ధి చేసే కంప్యూటింగ్, టెక్నాలజీ సూపర్ సెంటర్లు మన దేశానికి జియో మాదిరిగా ఉత్ప్రేరక వృద్ధిని అందిస్తాయి' అని ఈ సందర్భంగా రిలయన్స్ సీఎండీ ముకేశ్ అంబానీ అన్నారు.



19,800 స్థాయి పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 333 పాయింట్లు
- ఆరో రోజూ 'బుల్' పరుగులు

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు రెండు శాతం మేర రాణించడంతో స్టాక్ సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలను ఇన్వెస్టర్లు విస్మరించారు. దేశీయం నెలకొన్న సానుకూలతతో సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 333 పాయింట్లు ఎగసి 66,599 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 501 పాయింట్లు ఎగసి 66,767 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 93 పాయింట్లు బలపడి 19,820 వద్ద స్థిరపడింది. బ్యాంకులు, ఫైనాన్స్, ఇంధన, ఆటో షేర్లు లాభపడ్డాయి. కమోడిటీస్, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆర్‌బీఐ లిక్విడిటీ నిర్ణయం బ్యాంకింగ్‌కు లాభించింది. గత ట్రేడింగ్ సెషన్‌లో జీవితకాల కనిష్టానికి పతనమైన రూపాయి స్వల్పంగా రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో 21 పైసలు బలపడి 83.02 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ ఈ వారం మొత్తం 878 పాయింట్ల ర్యాలీతో బీఎస్ఈలో రూ.8.5 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.



టీపీజీ పెట్టుబడులు కలిగిన ఆర్ఆర్ కేబుల్ ఐపీవో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానుండగా.. ఒక్కో షేరుకు రూ.983-1,035 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. ఇష్యూ 15న ముగియనుంది. ఐపీవో రూపంలో సమీకరించే నిధుల్లో రూ.136 కోట్లతో రుణ భారం తగ్గించుకోనుంది.

నాట్కో ఫార్మాపై యూఎస్‌లో దావా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్యాన్సర్ చికిత్సలో వాడే పొమాలిడోమైడ్ జనరిక్ డ్రగ్‌కు సంబంధించి యూఎస్‌లో యాంటీట్రస్ట్ దావాలో కంపెనీతో పాటు ఇతర ఔషధ తయారీ సంస్థలను ప్రతివాదులుగా పేర్కొన్నట్లు నాట్కో ఫార్మా శుక్రవారం వెల్లడించింది. సెల్జీన్ కార్పొరేషన్, బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్, బ్రెకన్‌రిడ్జ్ ఫార్మాస్యూటికల్‌తోపాటు పలు కంపెనీలను లూసియానా హెల్త్ సర్వీస్, ఇండెమ్నిటీ కంపెనీ ప్రతివాదులుగా పేర్కొంది. ఈ విషయం ఎటువంటి అర్హత లేనిదని భావిస్తున్నట్లు నాట్కో ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది.

సాక్షి స్పోర్ట్స్



అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ

2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు మొదలయ్యాయి. బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన దక్షిణ అమెరికా జోన్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా 1-0తో ఈక్వెడార్ జట్టును ఓడించింది. 83 వేల మంది ప్రేక్షకులు హాజరైన ఈ మ్యాచ్‌లో ఆట 78వ నిమిషంలో కెప్టెన్ మెస్సీ చేసిన గోల్‌తో అర్జెంటీనా ఆధిక్యంలోకి వెళ్లింది. 176 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మెస్సీకిది 104వ గోల్ కావడం విశేషం. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో మెస్సీకిది 29వ గోల్. 29 గోల్స్‌తో లూయిస్ స్వారెజ్ (ఉరుగ్వే) పేరిట ఉన్న రికార్డును మెస్సీ సమం చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కొలంబియా 1-0తో వెనిజులాపై గెలుపొందగా... పరాగ్వే-పెరూ మ్యాచ్ 0-0తో 'డ్రా' అయింది. 2026 ప్రపంచకప్‌ను అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. మొత్తం 48 దేశాలు బరిలోకి దిగుతాయి.

బోపన్న జోడీ రన్నరప్‌తో సరి

- యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ ఫైనల్లో పరాజయం
- 'హ్యాట్రిక్' టైటిల్ సాధించిన రాజీవ్ రామ్-సాలిస్‌బరీ జోడీ

న్యూయార్క్: పురుషుల టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాలని ఆశించిన భారత స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. శుక్రవారం రాత్రి జరిగిన యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగం ఫైనల్లో బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పరాజయం చవిచూసింది. డిఫెండింగ్ చాంపియన్స్, మూడో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) ద్వయం 2 గంటల్లో 2-6, 6-3, 6-4తో బోపన్న-ఎబ్డెన్ జంటను ఓడించి వరుసగా మూడో ఏడాది యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తద్వారా 1930 తర్వాత ఈ టోర్నీలో వరుసగా మూడేళ్లు డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి జోడీగా రాజీవ్ రామ్-సాలిస్‌బరీ ద్వయం గుర్తింపు పొందింది. జాన్ డోగ్-జార్జి లాట్ (అమెరికా) జోడీ 1928, 1929, 1930లలో వరుసగా మూడేళ్లు ఈ టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచింది. విజేత రాజీవ్-సాలిస్‌బరీ జోడీకి 7 లక్షల డాలర్లు (రూ. 5 కోట్ల 80 లక్షలు)... రన్నరప్ బోపన్న-ఎబ్డెన్ జంటకు 3 లక్షల 50 వేల డాలర్లు (రూ. 2 కోట్ల 90 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా ఫలితంతో 43 ఏళ్ల 6 నెలల వయసున్న బోపన్న తన కెరీర్‌లో రెండోసారి పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. 2010 యూఎస్ ఓపెన్‌లో ఐజామ్ ఖురేషి (పాకిస్తాన్)తో కలిసి ఆడిన బోపన్న డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచాడు. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో మాత్రం రోహన్ బోపన్న ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాడు. 2017లో దబ్రౌస్కీ (కెనడా)తో కలిసి బోపన్న ఫ్రెంచ్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచాడు.



విన్నర్స్ ట్రోఫీతో సాలిస్‌బరీ-రాజీవ్ రామ్ ద్వయం... రన్నరప్ ట్రోఫీతో ఎబ్డెన్-రోహన్ బోపన్న జోడీ

బ్రేక్ పాయింట్ అవకాశాలు వృథా...

రాజీవ్, సాలిస్‌బరీలతో జరిగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం తొలి సెట్‌లో గెలిచి ఆత్మవిశ్వాసంతో కనిపించింది. అయితే రాజీవ్-సాలిస్‌బరీ ఆందోళన చెందకుండా రెండో సెట్‌లో పుంజుకున్నారు. ఆరో గేమ్‌లో బోపన్న-ఎబ్డెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-2తో ఆధిక్యంలోకి వెళ్లారు. అదే జోరులో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచారు. నిర్ణాయక మూడో సెట్‌లో బోపన్న జోడీ కీలకదశలో తడబడింది. 2-1తో ఆధిక్యంలో ఉన్నదశలో మూడో గేమ్‌లో మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశం వచ్చినా దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. సర్వీస్‌ను నిలబెట్టుకున్న రాజీవ్-సాలిస్‌బరీ ద్వయం స్కోరును 2-2తో సమం చేయడంతోపాటు ఐదో గేమ్‌లో బోపన్న జంట సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఆరో గేమ్‌లో తమ సర్వీస్‌ను కాపాడుకొని 4-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. చివరకు 6-4తో రాజీవ్-సాలిస్‌బరీ జోడీ సెట్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకుంది.

భారత్, పాక్ మ్యాచ్‌కు 'రిజర్వ్ డే'

వర్షం పడితే తర్వాతి రోజు కొనసాగింపు • ఏసీసీ నిర్ణయంపై విమర్శలు

కొలంబో: ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య ఆదివారం జరిగే 'సూపర్-4' మ్యాచ్‌కు సంబంధించి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రోజు కొలంబోలో వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా 'రిజర్వ్ డే'ను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అంటే ఆదివారం వాన కారణంగా మ్యాచ్ నిలిచిపోతే ఆట ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే సోమవారం కూడా మ్యాచ్ కొనసాగుతుంది. ఆసియా కప్‌లో ఇప్పటి వరకు ఒక్క ఫైనల్ మ్యాచ్‌కు (సెప్టెంబర్ 17) మాత్రమే రిజర్వ్ డే ఉంది. ప్రేమదాస స్టేడియంలో మొత్తం ఐదు 'సూపర్-4' మ్యాచ్‌లు ఉండగా... మిగతా నాలుగు మ్యాచ్‌లకు కాకుండా ఒక్క భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌కే 'రిజర్వ్ డే' ఇవ్వడం గమనార్హం. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. పాకిస్తాన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. దాంతో టోర్నీ ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రసారకర్తల విజ్ఞప్తి మేరకు ఏసీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

'మాకూ కావాలి'

ఆసియా కప్ 'సూపర్-4' దశలో మిగతా నాలుగు మ్యాచ్‌లను కాదని ఒక్క భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌కే రిజర్వ్ డే కేటాయించడం పట్ల అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్నాయి. 'ఒక టోర్నమెంట్‌లో ఈ తరహా వివక్ష ఎక్కడా చూడలేదు. బరిలో ఉండే అన్ని టీమ్‌లు, మ్యాచ్‌లు సమానం అనే క్రీడా స్ఫూర్తిని మరచి ఇలాంటి ప్రత్యేక ఏర్పాటు ఏమిటి? మిగిలిన మ్యాచ్‌లలో ఏవైనా వర్షం కారణంగా రద్దయి ఆయా టీమ్‌లు ఒక్క పాయింట్‌కే పరిమితం అయితే వారికి అన్యాయం చేసినట్లే కదా' అని శ్రీలంక, బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాలు ప్రశ్నించాయి. ఆసియా కప్ టెక్నికల్ కమిటీలో భాగమైన బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ అక్రమ్ ఖాన్... తమకు ఈ విషయమే తెలీదని, ఏసీసీ ఎవరికీ చెప్పకుండా నిర్ణయం తీసుకుందని విమర్శించాడు. మిగిలిన రెండు టీమ్‌లను మ్యాచ్ ఆడకుండా వెనక్కి పంపించేస్తే సరి అంటూ వ్యంగ్య వ్యాఖ్యానాలు కూడా వినిపించాయి. మరోవైపు తమ మ్యాచ్‌కు కూడా రిజర్వ్ డే ఉంటాలని కోరుకుంటున్నట్లు బంగ్లాదేశ్ కోచ్ హతురుసింఘే, శ్రీలంక కోచ్ సిల్వర్‌వుడ్ అభిప్రాయ పడ్డారు. 'ఈ నిర్ణయం మమ్మల్నీ ఆశ్చర్యపర్చింది. నిజంగా వర్షం విషయంలో అలాంటి ఆలోచనే ఉంటే మా మ్యాచ్‌కు కూడా రిజర్వ్ డే ఉండాలి. కనీసం చర్చించే అవకాశం లేకుండా నిర్ణయం తీసుకోవడం ఏమిటి' అని ఇరు జట్ల కోచ్‌లు వ్యాఖ్యానించారు.



నేడు శ్రీలంక X బంగ్లాదేశ్

ఆసియా కప్ 'సూపర్-4'లో భాగంగా నేడు జరిగే రెండో మ్యాచ్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. పాకిస్తాన్ చేతిలో తొలి మ్యాచ్‌లో చిత్తయిన బంగ్లాదేశ్ ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో నెగ్గడం తప్పనిసరి. మరోవైపు లంకకు ఇది తొలి మ్యాచ్. సొంతగడ్డపై ఆడుతున్న ఆ జట్టు విజయంతో శుభారంభం చేయాలని ఆశిస్తోంది. **మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.**

సబలెంకా X కోకో గాఫ్

మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ



కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేందుకు అమెరికా టీనేజర్ కోకో గాఫ్... రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ అందుకోవాలనే లక్ష్యంతో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో తలపడనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఆరో సీడ్ కోకో గాఫ్ 6-4, 7-5తో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై... సబలెంకా 0-6, 7-6 (7/1), 7-6 (10/5)తో 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలుపొందారు. భారత కాలమానం ప్రకారం నేడు అర్ధరాత్రి దాటాక గం. 1:30 నుంచి ఫైనల్ జరుగుతుంది.

ముకోవాతో 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 19 ఏళ్ల కోకో గాఫ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చి తొమ్మిదిసార్లు పాయింట్లు గెలిచింది. 2017 యూఎస్ ఓపెన్ రన్నరప్ కీస్‌తో 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా తొలి సెట్‌లో ఒక్క గేమ్ కూడా నెగ్గలేకపోయింది. రెండో గేమ్‌లో ఒకదశలో ఆమె 4-5తో వెనుకబడి ఓటమి అంచుల్లో నిలిచింది. తొమ్మిదో గేమ్‌లో కీస్ తన సర్వీస్‌ను నిలబెట్టుకొని ఉంటే విజయం అందుకునేది. కానీ కీస్ సర్వీస్‌ను సబలెంకా బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేసి మ్యాచ్‌లో నిలిచింది. ఆ తర్వాత టైబ్రేక్‌లో పైచేయి సాధించింది. నిర్ణాయక మూడో సెట్‌లో సబలెంకా 2-4తో వెనుకబడింది. ఈసారీ తేరుకొని స్కోరును 4-4తో సమం చేసింది. చివరకు టైబ్రేక్‌లోనూ ఆధిపత్యం కనబరిచి విజయాన్ని అందుకుంది.



సుతీర్థ-ఐహిక జోడీ ఓటమి

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగాల్లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మానవ్ ఠక్కర్ 9-11, 10-12, 5-11తో చైనా దిగ్గజం మా లాంగ్ చేతిలో పోరాడి ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో సుతీర్థ 9-11, 6-11, 4-11తో ఒరావన్ పరానాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో... ఐహిక ముఖర్జీ 11-2, 11-6, 8-11, 9-11, 3-11తో చెన్ జింగ్‌టాంగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సుతీర్థ ముఖర్జీ-ఐహిక ముఖర్జీ (భారత్) జోడీ 5-11, 11-13, 10-12తో వాంగ్-చెన్ మెంగ్ (చైనా) ద్వయం చేతిలో... పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మానవ్ ఠక్కర్-మనుష్ షా (భారత్) జంట 5-11, 3-11, 5-11తో ఫాన్ జెన్‌డాంగ్-లిన్ గావోయువాన్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయాయి. టీమ్ విభాగంలో భారత పురుషుల జట్టు కాంస్య పతకం నెగ్గగా... మహిళల జట్టుకు ఆరో స్థానం లభించింది.



సచిన్‌కు 'గోల్డెన్ టికెట్'



ముంబై: భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్ ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేసిన కొందరు ప్రముఖులకు బీసీసీఐ వరుసగా 'గోల్డెన్ టికెట్' ఇచ్చి మ్యాచ్‌లకు ఆహ్వానిస్తోంది. ఇటీవలే నటుడు అమితాబ్ బచ్చన్‌కు ఈ టికెట్ అందించిన బోర్డు కార్యదర్శి జై షా తాజాగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 'గోల్డెన్ టికెట్' అందించారు. అద్భుత క్రికెటర్, జాతికి గర్వకారణంగా నిలిచిన 'భారత రత్న' సచిన్‌కు టికెట్ అందించడం పట్ల జై షా సంతోషం వ్యక్తం చేశారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన సచిన్ లాంటి వ్యక్తి ఇప్పుడు వరల్డ్‌కప్‌లో ఒక భాగంగా మారారని వ్యాఖ్యానించారు.

కొత్త టికెట్లూ హుష్ కాకి!

వరల్డ్ కప్ అభిమానులను దృష్టిలో ఉంచుకొని 4 లక్షల టికెట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చినట్లు బీసీసీఐ ఘనంగా ప్రకటించింది. కానీ పరిస్థితి చూస్తే ఏమీ మారలేదని అర్థమవుతోంది. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి టికెట్లు అమ్మకానికి పెట్టారు. అయితే భారత్‌కు సంబంధించి అన్ని మ్యాచ్‌లకూ టికెట్లే లేని పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని మ్యాచ్‌లకు 'సోల్డ్ అవుట్' చూపిస్తుండగా... మిగతా మ్యాచ్‌లకు మీరు క్యూలో ఉన్నారు అని 'బుక్ మై షో' చెబుతోంది. గతంతో పోలిస్తే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నవారికి వేచి ఉండాల్సిన సమయం వేర్వేరుగా చూపించగా... ఇప్పుడు అందరికీ ఒకే మెసేజ్ '90 నిమిషాలు' అనే చూపిస్తుండటం విశేషం! అసలు ఏ మ్యాచ్‌కు ఎన్ని టికెట్లు అమ్ముతున్నారనే విషయంపైనే సమాచారం లేకపోగా, 4 లక్షల టికెట్ల గురించి ఎక్కడా స్పష్టత లేదు! చూస్తుంటే ఇదంతా అభిమానులను కాస్త ఓదార్చేందుకు బీసీసీఐ ఆడిన ఒక డ్రామాలాగానే కనిపిస్తోంది.



వేలంపాట.. కోటిన్నర 'తోట'

తోట వైకుంఠం చిత్రానికి రికార్డు ధర

సాక్షి, హైదరాబాద్: చిత్రకళా ప్రపంచంలో మరోసారి భాగ్యనగరం సత్తా చాటింది. నగరానికి చెందిన చిత్రకారుడి ప్రతిభ విశ్వవ్యాప్తమైంది. ముంబై కేంద్రంగా పనిచేసే అస్తాగురు ఆక్షన్ హౌస్ 'మోడరన్ ట్రెజర్స్'వేలంలో పాల్గొన్న ఆరుగురు భారతీయ కళాకారుల చిత్రాలకు అత్యధిక ధర పలుకగా.. అందులో.. తోట వైకుంఠం గీసిన కళాఖండం కూడా ఉంది. గ్రామీణ తెలంగాణ జీవితం ప్రతిబించించేలా ఈ చిత్రం రూపొందింది. రాష్ట్రం గర్వించదగ్గ అత్యంత అరుదైన ప్రతిభావంతులైన చిత్రకారుల్లో తోట వైకుంఠం ముందు వరుసలో ఉంటారు. ఆయన తెలంగాణ ప్రాంతీయతను ప్రతిబింబించే చిత్రాలకు పేరొందారు. సాధారణంగా ఆయన చిత్రాలు రూ.లక్షల్లో ధర పలుకుతాయి. అయితే ఈ తాజా వేలంలో ఆయన ఏడేళ్లనాటి చిత్రం రూ.1,41,35,220 పలికింది. 2015లో తోట వైకుంఠం చిత్రించిన ఈ యాక్రిలిక్-ఆన్-కాన్వాస్ వర్క్ ఆయన అత్యున్నత చిత్రకళా నైపుణ్యానికి అద్దం పడుతూ కళాభిమానుల అభిమానాన్ని పొందింది.

యాదాద్రిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయకొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఆలయ ఈవో గీతారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకను చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, వ్రతాన్ని ప్రారంభించారు. వరలక్ష్మీదేవి వ్రత విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. వ్రతం సందర్భంగా పూజ చేసిన పసుపు బొట్టును మహిళలు వాయినాలుగా తీసుకున్నారు.



జి-20లో కరీంనగర్ ఫిలిగ్రీ



విద్యానగర్ (కరీంనగర్): ఢిల్లీలో శనివారం నుంచి రెండ్రోజుల పాటు జరగనున్న జి-20 దేశాల సదస్సులో 'కరీంనగర్ ఫిలిగ్రీ' మెరవనుంది. సదస్సుకు వచ్చే విదేశీ అతిథుల హృదయాలపై కరీంనగర్ ఫిలిగ్రీ కళాకారులు రూపొందించిన అశోక చక్రాన్ని పోలిన వెండి బ్యాడ్జీలు దర్శనమివ్వనున్నాయి. ఇప్పటికే జి- 20 దేశాల నుంచి సదస్సులో పాల్గొనే అతిథులకు బ్యాడ్జీలు పిన్ చేసేందుకు కరీంనగర్‌కు చెందిన ఫిలిగ్రీ కళాకారులు తరలివెళ్లారు. దేశ ఔన్నత్యాన్ని చాటేలా ఏర్పాటు చేస్తున్న వివిధ స్టాల్స్‌లో జిల్లాకు చెందిన సిల్వర్ ఫిలిగ్రీ స్టాల్ చోటు దక్కించుకోవడం విశేషం.

నేడు బాసర ట్రిపుల్ ఐటీ ఆరో స్నాతకోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం బాసర ట్రిపుల్ ఐటీ ఆరో స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్ బ్రహ్మకుమారీస్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందించనున్నట్లు వెల్లడించారు.

తప్పే చేస్తే ఇంటికే

'డబుల్' ఇళ్ల పంపిణీలో పొరపాట్లు దొర్లితే చర్యలు తప్పవు

- లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పూర్తిగా అధికారులదే: మంత్రి కేటీఆర్
- 21వ తేదీన రెండో దశలో 13,300 ఇళ్ల పంపిణీ
- డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీపై విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మహమూద్ అలీ, తలసాని, సబిత తదితరులు

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో పొరపాట్లకు తావులేకుండా అధికారులు పకడ్బందీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ ఆదేశించారు. పొరపాట్లు జరిగితే పూర్తిస్థాయి బాధ్యత అధికారులదేనని, తప్పు చేస్తే ఉద్యోగం నుంచి తొలగించే స్థాయిలో కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలో పూర్తిస్థాయి బాధ్యత అధికారులకే అప్పగించిందన్నారు. సచివాలయంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంపిణీ ప్రక్రియలో ఎక్కడా తప్పు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, అందుకుగాను అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇళ్ల పంపిణీలో ఏవైనా ఇబ్బందులెదురైై ప్రజాప్రతినిధులు వాటిని అధికారుల దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించి అమలు చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం దేశంలో మరెక్కడా లేదన్నారు. హైదరాబాద్ నగరంలో రూ. 50 లక్షల విలువైన ఒక్కో ఇంటిని పేదల కోసం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. నగరంలో నిర్మిస్తున్న లక్ష ఇళ్ల విలువ రూ.9100 కోట్లు కాగా, వాటి మార్కెట్ విలువ రూ.50 వేల కోట్లకు పైగానే ఉంటుందన్నారు. ఇంత భారీ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అధికారులు ఎంతో కష్టపడి పూర్తి చేస్తున్నారంటూ మంత్రి అభినందించారు.

రెండో దశలో 13,300 ఇళ్ల పంపిణీ..

మొదటి దశలో 11,700 డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పేదలకు పంపిణీ చేశామని, రెండో దశలో భాగంగా ఈ నెల 21వ తేదీన దాదాపు 13,300 ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. అత్యంత పారదర్శకంగా అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమాత్రం లేదన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి వివరాలతో కంప్యూటర్ ఆధారిత డ్రా ద్వారా, పారదర్శకంగా, మీడియా ముందు నిర్వహిస్తున్నామన్నారు.

త్వరలో 'గృహలక్ష్మి'..: నగరంలో గృహలక్ష్మి పథకం కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు కేటీఆర్ తెలిపారు. నగరంలో అమలుకు మంత్రులు కోరిన కొన్ని మార్పులకు సీఎం సూచనప్రాయంగా అంగీకరించారన్నారు. నోటరీ ప్రాపర్టీల అంశంలోనూ త్వరలో పూర్తి మార్గదర్శకాలు వెలువడతాయని కేటీఆర్ తెలిపారు. 58, 59 జీఓల ద్వారా కూడా పెద్దఎత్తున ప్రజలకు ఉపశమనం లభించిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక డబుల్ బెడ్రూం ఇళ్లు, పట్టాల రెగ్యులరైజేషన్, నోటరీ ఆస్తుల అంశం వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి నియోజకవర్గానికి కనీసం 15వేల నుంచి 20వేల మందికి లబ్ధి కలిగిందని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ చెప్పారు.

మూసీ ప్రాంతంలో కబ్జాలు తొలగిస్తాం..

మూసీ పరీవాహక ప్రాంతంలోని కబ్జాలను తొలగించి అక్కడ నివసిస్తున్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు కొత్త ఫోన్ నంబర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళా భద్రత విభాగం కొత్త ఫోన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు మహిళా భద్రత విభాగం ట్విట్టర్ (ఎక్స్)లో నూతన నంబర్లను వెల్లడించారు. ఏ రకమైన వేధింపులున్నా మహిళలు, విద్యార్థినులు 8712656858 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు. 8712656856 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ రెండు నంబర్లు గుర్తు లేకపోతే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

'నిమ్స్ ది గ్రేట్'

- ఎనిమిది నెలల్లో 100 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు
- నెల రోజుల్లో 30 రోబోటిక్ సర్జరీలు
- ట్విట్టర్‌లో వైద్యులకు మంత్రి హరీశ్‌రావు అభినందనలు

లక్డీకాపూల్ : అవయవ మార్పిడి ఆపరేషన్లలో నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) తన ప్రత్యేకతను మరోసారి చాటి చెప్పింది. గతంలో ఎన్నో విజయాలను పదిలపర్చుకున్న నిమ్స్ తాజాగా మారో అరుదైన రికార్డు సృష్టించి వైద్య రంగాలలోనే సంచలనం సృష్టించింది. ఈ ఏడాది ఎనిమిది నెలల్లోనే 100 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను విజయవంతంగా చేసి అరుదైన రికార్డును వైద్యులు సొంతం చేసుకున్నారు. ఇందులో 61 లైవ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, 39 దాతల ద్వారా సేకరించినవి.. గ్రహీతల్లో 11, 12 ఏళ్ల వయసువారు కూడా ఉండడం చెప్పుకోదగ్గ అంశం. శుక్రవారం వందో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసిన వైద్య బృందంలో యూరాలజీ వైద్యనిపుణులు ప్రొఫెసర్ రామ్‌రెడ్డి, విద్యాసాగర్, రామచంద్రయ్య, తదితరులు ఉన్నారు. వీరంతా యూరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాహుల్ దేవరాజ్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స మార్పిడిలు చేస్తున్నారు. గత నెలలో రూ.32 కోట్లతో సమకూర్చుకున్న అడ్వాన్స్‌డ్ పరిజ్ఞానం ఉన్న రోబోటిక్స్ సాయంతో యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల్లో అత్యంత సంక్లిష్టమైన నెల రోజుల వ్యవధిలోనే 30 అపరేషన్లను చేశారు. గాల్‌బ్లాడర్, హెర్నియా, ఆచలాసియా కార్డియా సర్జరీలను చిన్న రంధ్రంతో సులువుగా సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేస్తున్నారు. సాధారణ పద్ధతుల్లో చేసే సర్జరీలతో పోల్చితే రోబోటిక్ సర్జరీలు కూడా చాలా కచ్చితంగా జరుగుతున్నాయి. ఆపరేషన్ జరిగిన మూడు రోజుల్లోనే రోగి డిశ్చార్జి కావడం విశేషం.

మంత్రి హరీశ్‌రావు ప్రశంసలు..

అత్యధిక మార్పిడి ఆపరేషన్లు చేసి నిమ్స్ వైద్యులు చెప్పుకోదగ్గ రికార్డును నెలకొల్పారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశంసించారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ల్లో రికార్డు బ్రేక్ చేసి యూరాలజీ వైద్యులను మంత్రి ట్విట్టర్ వేదికగా అభినందించారు. ఈ అసాధారణ అవయవ మార్పిడి ద్వారా ప్రాణాలను కాపాడాలనే తమ అచంచలమైన నిబద్ధతను హైలైట్ చేస్తోందన్నారు.

ఎంత పెద్ద శస్త్రచికిత్స అయినా..

ఎంత పెద్ద శస్త్రచికిత్సనైనా సులువుగా చేయవచ్చు. రోబోటిక్ సర్జరీలను ప్రారంభించిన అనతికాలంలోనే పెద్ద సంఖ్యలో విజయవంతంగా ఆపరేషన్లు చేయడం నిమ్స్ వైద్యుల ప్రతిభకు తార్కాణం. ఇప్పుడు ఆస్పత్రిలో నొప్పి తక్కువతో.. ఇన్ఫెక్షన్లకు తావులేకుండా చేస్తున్నాం. – ప్రొఫెసర్ నగరి బీరప్ప, సంచాలకుడు, నిమ్స్

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.